RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932


PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 233 శనివారం 22 - 03 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## తెలంగాణలో భారీ వర్షం వడగళ్ల వాన



- తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు
- మార్చి 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

# సీఎం రేవంత్ రెడ్డి మంచి కళాకారుడు అధ్యక్షా



సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. రేవంత్ రెడ్డి మంచి వక్త.. మంచి కళాకారుడు అధ్యక్షా.. అంటూ ఆయన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను హరీశ్‌రావు గుర్తు చేశారు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టారు.ఆరు గ్యారెంటీలు ఆవిరైపోయాయి. కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందుకుంటూ - మిగతా 2 లో

- రేవంత్ రెడ్డి మంచి వక్త.. మంచి కళాకారుడు అధ్యక్షా.. అంటూ సెటైర్లు
- ఆరు గ్యారెంటీలు ఆవిరైపోయాయి
- గ్యారెంటీల్లో ప్రధానమైన అంశాల మీద ప్రస్తావన లేదు, ప్రతిపాదన లేదు
- పింఛన్ 4 వేలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తూనే కొందరు కాలం చేసిన్రు
- బాండ్ పేపర్లు బంగాళాఖాతంలో కలిసినయి. గాంధీలిచ్చిన వాగ్దానాలు గాలి మాటలే

## రేవంత్‌తో హరీష్‌రావు భేటీ



- రేవంత్‌రెడ్డిని కలిసిన అసెంబ్లీలో మాజీమంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మారావు
- పలు కీలక అంశాలపై హరీష్‌రావు చర్చించారు
- బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ సీతాఫల్‌మండి కళాశాలకు కేటాయించిన రూ.32కోట్లు ప్రభుత్వం అర్ధాంతరంగా ఆపేసింది
- మాజీమంత్రి హరీష్‌రావు

## కర్ణాటక అసెంబ్లీని మళ్లీ కుదిపేసిన హనీట్రాప్



కర్ణాటక రాజకీయాల్లో కలకలం రేపిన హనీ ట్రాప్ వ్యవహారం

ముస్లిం కోటా బిల్లును స్పీకర్ పాస్ చేస్తున్నట్లు ప్రకటన

ఆగ్రహంతో స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లిన బీజేపీ సభ్యులు

ముస్లిం కోటా బిల్లు ప్రతులను చించి స్పీకర్ ముఖంపైకి విసిరిన బీజేపీ సభ్యులు

## చైనాతో యుద్ధం వస్తే ఏం చేద్దాం?



- పెంటగాన్ రహస్యాలు మస్క్‌కు!
- ఫేక్ న్యూస్ అంటూ ట్రంప్ రిప్లై
- అమెరికా పాలనా వ్యవహారాల్లో ఎలాన్ మస్క్ జోక్యం
- పెంటగాన్‌ను సందర్శించనున్న ఎలాన్ మస్క్

## కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి

- ఉగ్రఘటనలు కూడా తగ్గాయి
- ఆర్టికల్ 370 రద్దుతో 'ఒకే రాజ్యాంగం- ఒకే జెండా'
- రాజ్యాంగ నిర్మాతల కలను ప్రభుత్వం నెరవేర్చింది
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



# టూర్స్ అంటూ వెళ్లి డ్రగ్స్ కొంటున్న విద్యార్థులు !



మత్తు పదార్థాల రవాణా ఒకప్పుడు పాత నేరస్థులు, డ్రగ్స్ వ్యసనపరులు, డబ్బు కోసం అడ్డదారులు తొక్కేవారు, జులాయిలకే పరిమితమైన అంశం. ఇప్పుడీ మత్తు దందా తరగతి గదులను తాకుతోంది. విద్యార్థులే మత్తు పదార్థాల ఏజెంట్లుగా విద్యాసంస్థలకు గంజాయి అందుతోంది. డ్రగ్స్, గంజాయి, జల్సాలకు అలవాటుపడ్డ కొందరు విద్యార్థులు డబ్బు కోసం విక్రేతలుగా మారుతున్నారు. తోటి విద్యార్థులకు అలవాటు చేసి మత్తుకూపంలోకి లాగుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఖరీదైన సింథటిక్ డ్రగ్స్ తీసుకొచ్చి అమ్ముతున్నారు. విహారయాత్రల మాటున ద్విచక్రవాహనాల మీద వెళ్లి తిరిగొచ్చే సమయంలో గంజాయిని తీసుకొస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.కొన్ని నెలలుగా కళాశాలల విద్యార్థులే మత్తు పదార్థాలు విక్రయిస్తూ పోలీసులకు చిక్కుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో తరచూ విద్యార్థులు పట్టుబడుతున్నారు. తాజాగా ఘట్‌కేసర్‌లోని ఇంజినీరింగ్ - మిగతా 2 లో

- తిరిగొచ్చి హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న పలువురు విద్యార్థులు
- ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో అమ్మకం
- పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ ఇంజినీరింగ్ విద్యార్థులు
- ద్విచక్రవాహనాల మీద వెళ్లి తిరిగొచ్చే సమయంలో గంజాయిని తీసుకొస్తున్నారు
- కాలేజీలపై ఫోకస్ పెట్టిన టీజీ న్యాబ్

## సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై హోంమంత్రి సమీక్ష




- రాష్ట్రవ్యాప్తంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు
- పురోగతి పై సమీక్ష నిర్వహించిన మంత్రి అనిత
- డీజీపీ హరీష్ గుప్తాతో పాటు హాజరైన పోలీసు ఉన్నతాధికారులు

మొదటిపేజీ తరువాయి

# చైనాతో యుద్ధం వస్తే ఏం చేద్దాం?



అమెరికా పాలనా వ్యవహారాల్లో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆయన నిర్వహిస్తున్న డోజ్ విభాగానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విస్తృత అధికారాలు కల్పించడంపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల వేళ తాజాగా మస్క్ పెంటగాన్‌కు వెళ్లనున్నారనే వార్తలు మరింత చర్చనీయాంశంగా మారాయి. అంతేకాదు, అమెరికా రక్షణశాఖ రూపొందించిన కొన్ని రహస్య ప్రణాళికలను టెస్లా అధినేతకు వివరించనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ విషయంపై డొనాల్డ్ ట్రంప్ స్పందించారు.చైనాతో యుద్ధం వస్తే ఎలా వ్యవహరించాలో తెలిపే మిలిటరీ ప్లాన్‌ను మస్క్‌కు తెలియజేయనున్నట్లు న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. యుద్ధం లాంటి పరిస్థితి ఎదురైతే చైనాతో ఎలా పోరాడాలన్న దానిపై అమెరికా మిలిటరీ 20 నుంచి 30 స్లైడ్స్ రూపొందించింది. ఒకవేళ అలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు చైనా ఏయే వాటిని లక్ష్యంగా చేసుకుంటుంది? ఎలాంటి దాడులు చేస్తుంది? అన్న వివరాలు అందులో ఉన్నాయి. యుద్ధంలో ఎలాంటి వ్యూహాలను అనుసరించాలన్న ప్రణాళికలను కూడా రూపొందించారు. ఈ ప్లాన్‌ను త్వరలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పెంటగాన్ అందించనుంది. అయితే, ఈలోగానే ఆ వివరాలను మస్క్‌ను తెలియజేస్తారని కథనంలో పేర్కొంది.c

**ఇది ఫేక్ న్యూస్**

అయితే, ఈ కథనాలను డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. 'న్యూయార్క్ టైమ్స్ మరోసారి అసత్య వార్తలు ప్రచారం చేస్తోంది. మస్క్ పెంటగాన్‌కు వెళ్లి, చైనాతో యుద్ధ ప్రణాళికల గురించి చర్చిస్తారు అని ప్రచురించింది. ఎంత హాస్యాస్పదం ఇది! మస్క్ తన పర్యటనలో కనీసం చైనా పేరును కూడా ప్రస్తావించరు. మీడియా ఇలాంటి అబద్ధాలను సృష్టించడం ఎంత అవమానకరం. ఏదేమైనా ఇది పూర్తిగా ఫేక్ న్యూస్' అని ట్రంప్ తన సోషల్ మీడియా ట్రూత్‌తో పోస్ట్ చేశారు.అటు న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని తప్పుడు వార్త అని పెంటగాన్ అధికార ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. అమెరికా కాలమానం ప్రకారం ఎలాన్ మస్క్ శుక్రవారం పెంటగాన్‌ను సందర్శించనున్నారు. ఈ విషయాన్ని పెంటగాన్ అధికార ప్రతినిధి ధ్రువీకరిస్తూ ఈ మేరకు స్పందించారు. మస్క్‌కు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్నామని, ఆయనను రక్షణశాఖ మంత్రి పీట్ హేగ్సే ఆహ్వానించారని తెలిపారు. ఇది కేవలం పర్యటన మాత్రమే అని ప్రతినిధి స్పష్టం చేశారు.

# కర్ణాటక అసెంబ్లీని మళ్లీ కుదిపేసిన హనీట్రాప్




కర్ణాటక రాజకీయాల్లో కలకలం రేపిన హనీ ట్రాప్ వ్యవహారం ఇవాళ మళ్లీ అసెంబ్లీని కుదిపేసింది. ఈ అంశంపై శాసనసభలో చర్చించాల్సిందేనని బీజేపీ పట్టుబట్టింది. అయితే ఆ నిరసనలను పట్టించుకోకుండా ముస్లిం కోటా బిల్లును స్పీకర్ పాస్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సభ ఒక్కసారిగా అలజడి రేగింది.ఆగ్రహంతో స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లిన బీజేపీ సభ్యులు తమ చేతుల్లోని ముస్లిం కోటా బిల్లు ప్రతులను చించి స్పీకర్ ముఖంపైకి విసిరి కొట్టారు. ప్రతిగా.. కాంగ్రెస్ సభ్యులు బుక్‌లు, పేపర్లను ప్రతిపక్ష సభ్యులపైకి విసిరారు. ఈ గందరగోళం నడుమ సభను స్పీకర్ కాసేపు వాయిదా వేశారు.పబ్లిక్ కాంట్రాక్ట్‌లలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం తెచ్చింది. అయితే ఇది రాజ్యాంగ విరుద్ధమంటున్న బీజేపీ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై కోర్టుకు వెళ్తామని చెబుతోంది. మరోవైపు సభలో ఇవాళ జరిగిన పరిణామాలపై బీజేపీ ఎమ్మెల్యే భరత్‌శెట్టి స్పందించారు. "హనీ ట్రాప్ వ్యవహారంపై చర్చించకుండా.. ముస్లిం కోటా బిల్లును ప్రవేశపెట్టడంపైన సీఎం సిద్ధరామయ్య దృష్టి పెట్టారు. అందుకే మేం నిరసన తెలిపాం. అంతేగానీ మేము ఎవరికీ హాని తలపెట్టలేదు" అని అన్నారాయన.

**ఎవరినీ రక్షించే ఉద్దేశం లేదు: సీఎం సిద్దు**

ఇంకోవైపు ముస్లిం కోటా నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థించుకుంది. సామాజిక న్యాయం, మైనారిటీలకు ఆర్థిక సాధికారకత కోసం రిజర్వేషన్లు తీసుకొచ్చామని సిద్ధరామయ్య ప్రభుత్వం చెబుతోంది. హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా చర్యలు తీసుకుంటామన్న సీఎం సిద్ధరామయ్య ఇందులో నుంచి ఎవరినీ రక్షించే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు. ఉన్నత స్థాయి కమిటీతో విచారణ చేస్తామని హోంమంత్రి జి పరమేశ్వర హామీ ఇచ్చినప్పటికీ బీజేపీ అనవసర రాద్ధాంతం సృష్టిస్తోందని మండిపడ్డారు.ఇదిలా ఉంటే.. మంత్రులు, ఎమ్మెల్యేలతో సహా 48 మంది రాజకీయ నేతలు హనీట్రాప్ బాధితులుగా ఉన్నారంటూ కర్ణాటక మంత్రి రాజన్న అసెంబ్లీ సాక్షిగా చేసిన ప్రకటన తీవ్ర చర్చనీయాశంమైన సంగతి తెలిసిందే. ఇందులో అధికార, విపక్ష సభ్యులతో పాటు జాతీయ స్థాయిలోని నాయకులు కూడా ఉన్నారంటూ బాంబ్ పేల్చారాయన. అయితే ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. బీజేపీ మాత్రం ఈ వలపు వల వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ హస్తమే ఉందని, కాబట్టి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తోంది.

# సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై హోంమంత్రి సమీక్ష




రాష్ట్రవ్యాప్తంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటులో పురోగతి పై హోంమంత్రి అనిత అధ్యక్షతన మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, పోలీసింగ్ లో టెక్నాలజీ వినియోగం తదితర ప్రధాన అంశాలపై చర్చించారు.రెవెన్యూపరమైన కేసులలో ఆ శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పరిష్కరించాలని మంత్రి అనిత ఆదేశించారు. సమీక్షకు డీజీపీ హరీష్ గుప్తాతో పాటు ఐజీ,డీఐజీ స్థాయి పోలీస్ ఉన్నతాధికారులు, విజయవాడ, విశాఖపట్నం పోలీస్ కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలు, డీజీపీ కార్యాలయంలోని పోలీస్ అధికారులు హాజరు అయ్యారు.

# టూర్స్ అంటూ వెళ్లి డ్రగ్స్ కొంటున్న విద్యార్థులు!

మొదటిపేజీ తరువాయి



కళాశాలకు చెందిన విద్యార్థి ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ అధికారులకు చిక్కాడు. బీటెక్ రెండో ఏడాది చదువుతున్న నిందితుడు బీదర్‌కు వెళ్లి గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. హైదరాబాద్‌కు తీసుకొచ్చి కళాశాలల విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. డబ్బు కోసం ఈ పనిచేస్తున్నట్లు నిందితుడు చెప్పడంతో పోలీసులు షాకయ్యారు.ఘట్‌కేసర్‌లో ఇద్దరు విద్యార్థులు అరెస్ట్ : ఇటీవల మేడ్చల్ అబ్కారీ అధికారులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు విద్యార్థులను అరెస్టు చేశారు. నిందితులు జొమాటో బ్యాగులో 8.6 కిలోల గంజాయి తీసుకెళ్తున్నారు. ఏపీలోని సీలేరుకు వెళ్లి 40 కిలోల గంజాయి తీసుకొచ్చినట్లు నిందితులు అంగీకరించారు. మరో ఘటనలో ఘట్‌కేసర్‌లో గతేడాది ఇద్దరు విద్యార్థుల్ని పోలీసులు అరెస్టు చేశారు. బీటెక్ చదువుతూ జల్సాలకు అలవాటుపడ్డ వీరు గంజాయి కొనుగోలు చేసి తెలిసిన వారికి అమ్ముతున్నట్లు చెప్పారు. వీరి నుంచి 1.08 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు.హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్మకాలు : ఈ నేపథ్యంలో గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటుపడ్డ విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి నగరానికి తీసుకురావడం కలవర పెడుతోంది. ఈ విక్రయాలతో భారీగా కమీషన్ రావడం దందాలోకి దిగడానికి ఒక కారణమవుతోంది. ఉదాహరణకు ఏవోబీ సరిహద్దులో కిలో గంజాయి రూ.3వేలకు విక్రయిస్తే హైదరాబాద్‌లో రూ.50 వేల వరకూ ఉంటోంది. గోవాలో కొకైన్ గ్రాము రూ.2 వేలుంటే నగరంలో రూ.10 వేలకు విక్రయిస్తుంటారు.డబ్బుకు ఆశపడుతున్న కొందరు ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు విశాఖ, అరకు తదితర పర్యాటక ప్రాంతాలకు ద్విచక్రవాహనాల మీద వెళ్తున్నారు. తిరిగొచ్చేటప్పుడు తమకున్న పరిచయాలతో స్థానిక ఏజెంట్ల ద్వారా కిలోల పరిమాణంలో గంజాయి కొనుగోలు చేసి నగరానికి తీసుకొస్తున్నారు. నగరానికి వచ్చే ద్విచక్రవాహనాల మీద నిఘా తక్కువ ఉండడం, ఒకవేళ తనిఖీలు ఉన్నా దూరం నుంచే గుర్తించి సరుకు విసిరేసి తప్పించుకుంటున్నారు. కొందరు ముందు ఒక వాహనాన్ని పంపించి తనిఖీలు లేవనుకుని నిర్ధారించుకుని నగరానికి తీసుకొస్తున్నారు.

**తనిఖీలు పెంచడంతో తగ్గిన రాకపోకలు :** గతంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని అటవీ ప్రాంతాల్లో సాగయ్యే గంజాయి బెంగళూరు, ముంబయి, గోవా తదితర ప్రాంతాల నుంచి సింథటిక్ డ్రగ్స్ పెడ్లర్లు, ఏజెంట్ల ద్వారా నగరానికి వచ్చేవి. స్థానిక దళారీల ద్వారా ఇవి విద్యార్థుల వరకూ చేరేవి. కొంతకాలంగా నిఘా ఎక్కువకావడం, సరిహద్దులు, నగర శివార్లలో తనిఖీలు పెంచడంతో పెడ్లర్ల రాకపోకలు తగ్గిపోయి కృత్రిమ కొరత ఏర్పడుతోంది. మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు తమకున్న పరిచయాలతో నేరుగా ఏవోబీ సరిహద్దుల్లోని గంజాయి విక్రేతల్ని సంప్రదించి ద్విచక్రవాహనాల మీద వెళ్లి తీసుకొస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి మంచి కళాకారుడు అధ్యక్షా

మొదటిపేజీ తరువాయి



ప్రజా జీవితం చక్కగ సాగుతున్న సందర్భం. స్వర్గాన్ని కిందకు దించుతామనే రీతిలో వీళ్లు హామీలు ఇచ్చిన్రు. ఆరు గ్యారెంటీల పేరుతో బాండు పేపర్లు ముద్రించి ఆశలు రేపిన్రు. ఆరు గ్యారెంటీల్లో ప్రధానమైన అంశాల మీద ప్రస్తావన లేదు, ప్రతిపాదన లేదు. దాదాపుగా చేతులెత్తేసారు. ఆరు గ్యారెంటీల్లో మొదటి హామి మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా 2500 మహాలక్ష్మి ఊసే ఎత్తలేదు. మాట కూడా ఎత్తని మరో హామి, 4వేల పింఛన్. ముసలివాళ్లు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేతన్నలు, గీతన్నలు తదితర 44 లక్షలనిరుపేద ఆశల్ని ఈ బడ్జెట్ అడియాశలు చేసింది అని హరీశ్‌రావు మండిపడ్డారు.మన ముఖ్యమంత్రి కూడా మంచి వక్త, మంచి కళాకారుడు అధ్యక్షా ఎన్నికల ముందు పల్లె పల్లెనా తిరుగుతూ ఎంతో నాటకీయంగా, డ్రమటిక్‌గా వారు చెప్పిన డైలాగులు ఒక్కసారి మళ్లీ గుర్తు చేస్తున్నా.. "వచ్చే నెలా డిసెంబర్ 9 నాడు, ఇందిరమ్మ రాజ్యం వస్తుంది. రెండు వేలు కాదు, నాలుగు వేల పించన్ వస్తది" అన్నడు. ఇంకేం అన్నడు"మనువడు వచ్చి కాళ్లు ఒత్తుతడు, పెట్రోల్ కు ఐదు వందలో, వెయ్యో అడుక్కుంటడు అవ్వా" అన్నడు. ఈ రాష్ట్రంలో 44 లక్షల మంది ఆసరా పించన్‌దారుల చెవుల్లో ఈ మాటలు ఇంకా గింగురుమంటున్నయి. మనవడు కాళ్లొత్తడం లేదు గానీ, అవ్వా తాతలు కన్నీళ్లు ఒత్తుకొంటున్నరు. పింఛన్ 4 వేలు ఎప్పుడైతదా.. అని ఎదురుచూస్తూనే కొందరు కాలం చేసిన్రు. తీరా జరుగుతున్నదేమిటి? ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. కానీ, లక్షమందికి పింఛన్లు కోత పడింది. ఇంట్లో ఎందరుంటే అందరికీ ఇస్తాం అని ఊదరగొట్టిన్రు. ఇవాళ అవ్వ లేదు, తాత లేదు, 4 వేల పెన్షన్ లేదు అధ్యక్షా.. ఇగ యువ వికాసం పేరిట రూ.5లక్షల విద్యా భరోసా కార్డు ఊసే లేదు. భట్టి విక్రమార్క 2 బడ్జెట్లు పెట్టినా దాని ప్రస్తావనే లేదు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట 12వేలు అన్నరు. కోటి మంది కూలీలు ఉంటే లక్ష లోపే ఇచ్చ చేతులు దులుపుకొన్నరు. కోటి మందికి ఇవ్వాలంటే 12వేల కోటక్లు కావాలి. గత బడ్జెట్ లో 906 కోట్లు పెట్టారు. 300 కోట్లు కోత పెట్టిఈ బడ్జెట్ లో 600 కోట్లకే కుదించారని హరీశ్‌రావు పేర్కొన్నారు.కూలీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది అధ్యక్షా.. బాండ్ పేపర్లు బంగాళాఖాతంలో కలిసినయి. గాంధీలిచ్చిన వాగ్దానాలు గాలి మాటలే అయినయి. ఆరు గ్యారెంటీలకు దిక్కు లేదు గానీ, అందాల పోటీలు పెడుతరట. మింగ మెతుకు లేదు, మీసాలకు సంపెంగ నూనె అన్నట్టున్నది. 2 బడ్జెట్ల తర్వాత ఆరు గ్యారెంటీల మీద చేతులెత్తేశారు. ఆరు గ్యారెంటీల విషయంలో మీ వైఖరి ఎట్లుందంటే..

# కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి

మొదటిపేజీ తరువాయి



జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులు తగ్గిపోయాయని.. అక్కడ ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొంటున్నట్లు చెప్పారు. రాజ్యసభలో హోంశాఖ పనితీరుపై జరిగిన చర్చ సందర్భంగా షా మాట్లాడారు. ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం అనుసరిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వాల పనితీరుపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.'గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాలతో కశ్మీర్‌ను నాశనం చేశాయి. అయితే, తమ ప్రభుత్వం దేశంలో శాంతి భద్రతలు కాపాడటంపైనే ప్రధానంగా దృష్టి పెట్టింది. జమ్ము కశ్మీర్‌లో ఉగ్రఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. 2004-2014 మధ్య ఈ ప్రాంతంలో 7,217 ఉగ్రవాద సంఘటనలు జరిగాయి. 2014 నుంచి 2024 మధ్య ఆ సంఖ్య 2,242కి తగ్గింది. మోదీ పాలనలో కశ్మీర్‌లో ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతం తగ్గాయి. ఉగ్రవాదాన్ని జీరో టాలరెన్స్ విధానంతో కఠినంగా అణచివేశాం.2026 మార్చికల్లా నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం. ఉగ్రఘటనలే కాకుండా రాళ్ల దాడులు కూడా తగ్గాయి. కశ్మీర్ యువకులు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. 2019 నుంచి 2024 వరకూ యువతకు 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య కూడా పెరిగింది. పెట్టుబడులు కూడా పెరిగాయి. జమ్ము కశ్మీర్‌లో ఇప్పటికే రూ.12,000 కోట్ల విలువలైన పెట్టుబడులు వచ్చాయి. రూ.1.1 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఇప్పుడు కశ్మీర్‌లో సాయంత్రం పూట కూడా సినిమాహాళ్లు తెరిచే ఉంటున్నాయి' అని అమిత్ షా తెలిపారు.

# రేవంత్‌తో హరీష్‌రావు భేటీ

మొదటిపేజీ తరువాయి




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలో మాజీమంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మారావు కలిశారు. అలాగే మాజీమంత్రి మల్లారెడ్డి కుటుంబ సమేతంగా సీఎం రేవంత్‌ను కలిశారు.మెడికల్ కళాశాల సీట్ల పెంపు కోసం సీఎంను కలిసినట్లు మర్రి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై హరీష్‌రావు చర్చించారు. ఈ భేటీ అనంతరం మీడియాతో హరీష్‌రావు మాట్లాడారు. సీతాఫల్‌మండి జూనియర్, డిగ్రీ కళాశాల విషయంలో పద్మారావుతో కలసి సీఎం రేవంత్‌ను కలిశానని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ సీతాఫల్‌మండి కళాశాలకు రూ.32కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. కేసీఆర్ కేటాయించిన పనులను రేవంత్ ప్రభుత్వం అర్థాంతరంగా ఆపేసిందని హరీష్‌రావు చెప్పారు.

**డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి క్లారిటీ లేదు..**

కాంగ్రెస్, బీజేపీ పార్టీల 'బడే భాయ్.. చోటే భాయ్ బంధం' అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి బయటపెట్టారని అన్నారు. కేంద్రం తెలంగాణకు నిధులు ఇవ్వకపోయినా.. తన ప్రసంగంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పల్లెతు మాట అనలేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీకి తాము సమాన దూరంగా ఉంటామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీది తెలంగాణ ప్రజల పక్షమని తెలిపారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి కాంగ్రెస్ కంటే.. సభలో బీఆర్ఎస్‌ను ఎక్కువ టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డిపై తాను మాట్లాడినంత గట్టిగా ఎవరూ మాట్లాడలేదని చెప్పారు. తాను రేవంత్ బట్టలు విప్పితే.. మహేశ్వరరెడ్డి రేవంత్‌ను కవర్ చేశారని అన్నారు. కాంగ్రెస్ పిలిస్తే పోవటం లేదని డీఎంకే నేతల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెన్నైవెళ్తున్నారని తెలిపారు.దక్షిణాదికి జరుగుతున్న అన్యాయంపై మెదట మాట్లాడిందే బీఆర్ఎస్ అని గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి ఓ స్టాండ్ లేదు... క్లారిటీ లేదని హరీష్‌రావు విమర్శించారు.

# తెలంగాణలో భారీ వర్షం.. వడగళ్ల వాన

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మార్చి 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడగా.. సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదైన ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోనే ఈ అకాల వర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లో వడగండ్లు పడ్డాయి. ధర్మపురి మండలంలో ఈదురుగాలులతో కూడిన వానకురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేరేళ్ల, తుమ్మేనాల, ధర్మపురి, తిమ్మాపూర్‌తో పాటు పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోనూ భారీ వర్షం పడింది. భారీ వర్షాలు పడటంతో రైతులకు కొంతమేర నష్టం కలిగింది.తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. మార్చి 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వర్షాల కారణంగా.. వేడి తీవ్రతతో పాటు వడగాలులు సైతం తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీంతో రెండు రోజుల పాటు ప్రజలకు వడగాలుల నుంచి ఉపశమనం పొందనున్నారు.



తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 22 - 03 - 2025

# రైతు రాజ్యమే రైతు సమస్యలకు పరిష్కారం : జస్టిస్ చంద్రకుమార్

**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఓర్సు ఇంద్రసేనా గారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌ" జస్టిస్ చంద్రకుమార్ గారు ముఖ్య అధితిగా పాల్గొని ప్రసంగిస్తూ...రాష్ట్రంలో నీటికొరతతో పంటలు కోతకు వచ్చే సమయానికి పంటలు ఎండిపోతున్నాయి, దీనితో రైతులు తీవ్రమైన ఆవేదనతో వున్నందున తక్షణమే ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కొరకు కృషి చేయాలన్నారు. %ణతీ% స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి సరియైన గిట్టుబాటు ధరను ఇవ్వాలి, రైతుల ఆత్మహత్యలను నివారించాలి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రభుత్వాలు కల్తీ విత్తనాల పరిశ్రమలపై ఉక్కుపాదం మోపి, కల్తీ విత్తనాల తయారీదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు.



అలాగే రైతుల నుండి ఎట్టి పరిస్థితుల్లో ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ చేయరాదు, ఒకవేళ భూసేకరణ తప్పని పరిస్థితిలో చేయాల్సి వస్తె భూసేకరణ చట్టం 2013 ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూసేకరణ చట్టం 2013 కు చేసినటువంటి రైతుల భూములు పరిశ్రమలకు ఎలాంటి అంగీకారం లేకుండానే పరిశ్రమలకు అప్పగించాలనే సవరణలను వెంటనే రద్దు చేయాలన్నారు. రైతు సమస్యలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే భావసారూప్యంగల ప్రజాసంఘాలతో , రాజకీయ పార్టీలతో కలిసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబం వరంగల్ జిల్లా, దుగ్గొండి మండలం, మాంధాపురం గ్రామానికి చెందిన గంధం లక్ష్మీ గారి కుటుంబానికి జస్టిస్ చంద్రకుమార్ గారి చేతులమీదుగా ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాశం యాదగిరి, నైనాల గోవర్ధన్, అంబు రాథోడ్ కోల జనార్ధన్, రైతు సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి ఒంగూరు నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్నాటి మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి మేడిభావి ప్రభానంద్, సోమిడి శ్రీనివాస్, ఇంద్రవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిధులు అడుగుతే అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటు

విద్యార్థి యువజన, సంఘాలు, పిడిఎస్ యు, పివైఎల్ ఆధ్వర్యంలో

విద్యారంగానికి 20 శాతం నిధుల కై చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు

అరెస్టు చేసిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను విడుదల చేయాలి

పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్

**భువనగి,రి తెలంగాణ సేన న్యూస్ ,మార్చ్ 21 :** విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని ,చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టిన విద్యార్థి యువజన సంఘాలు, పిడిఎస్ యు, పి వై ఎల్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ,సిగ్గుచేటని పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజారి కుమార్ విమర్శించారు. కేవలం 7.57 మాత్రమే బడ్జెట్ లో నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ, పిడిఎస్ యు రాష్ట్ర కమిటీ నిర్వహించ తలపెట్టిన, చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్ళనీయకుండా జిల్లాలో ఉన్న నాయకులను



అక్రమంగా అరెస్ట ల ను ఖండించారు. అతి తక్కువ గా కేటాయించడాన్ని వ్యతి రేకస్తూ, పిడిఎస్ యు,రాష్ట్ర కమిటీ తలపెట్టిన, చలో అసెంబ్లీ ముట్టడిని భగ్నం చేయడానికి, విద్యార్థి గొంతులను నొక్కే ప్రయత్నం లో భాగంగానే ,పోలీసులు అక్రమంగా అరెస్టులకు పునుకున్నారు అని ఆరోపించారు.ఇలాంటి చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడో గ్యారంటీ గా ,ఇచ్చిన ప్రజాస్వామిక పాలన అందిస్తుందని వ్యంగ్యంగా అన్నారు. విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయించడం వలన, పెండింగ్ లో ఉన్న, విద్యార్థుల స్కాలర్ షిప్ లు , ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయాలని అన్నారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి అని తెలిపారు. విద్యాశాఖకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమున్నర కాలం గడుస్తున్న, ఇంతవరకు కనీసం విద్యాశాఖకు ఒక మంత్రి లేకపోవడం చాలా సిగ్గుచేటు అన్నారు. వెంటనే మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల అభివృద్ధి కోసం ఒక్కొక్క యూనివర్సిటీకి రూ 1000 కోట్లు కేటాయించాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో యూనివర్సిటీల కొరకు కనీసం బడ్జెట్ కేటాయించక పోవడంతో, జిల్లాలో విద్యార్థులకు ఉన్నత విద్య దూరం అవుతున్నటు వంటి పరిస్థితి ఏర్పడ నుంది అన్నారు. విద్యావ్యవస్థ బాగుపడాలంటే కనీసం విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో విద్య రంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టు చేసి, విద్యార్థి యువకుల గొంతు నొక్కడమే ప్రజలు ప్రజాస్వామ్య పాలననా? అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి అని అన్నారు. అక్రమ అరెస్టులను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఖండించాల్సింది గా విజ్ఞప్తి చేశారు.

# రాజీవ్ యువ వికాస్ పథకంలో అర్హత కోల్పోనున్న యువత

గత 12 సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయనందున

తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర.కో ఆర్డినేటర్ వడ్డేబోయిన శ్రీదర్

**భువనగిరి, తెలంగాణ సేన న్యూస్, మార్చ్ 21 :** ఉపాధి కల్పన కై రాజీవ్ యువ వికాస్ పథకం అమలు లో, రేషన్ కార్డులు లేని యువతకు నష్టం జరిగే అవకాశం ఉందని, తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ వడ్డమైన శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి నిబంధనలు మార్చాలి అని కోరారు. పథకం అమలు లో చిక్కులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, నూతన రేషన్ కార్డులకు అవకాశం కల్పించకపోవడం తో 12 సంవత్సరాలుగా , కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పోయింది అన్నారు. పెళ్లిళ్లు చేసుకున్న దంపతులకు ,కొత్త రేషన్ కార్డులు లేకపోవడం తో ,తల్లి దండ్రుల తో ఉన్న కార్డుల లో కొంతవరకు పేర్లు ఉండటం, ఇబ్బందికర ంగా ఉంది అన్నారు .యువతకు చేయూత



నందించేందు కు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకం పై సబ్సిడీ రుణాలు లభిస్తాయని, ఉపాధి పొందవచ్చు అనుకున్న వారికి, నిరాశ తో ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు అన్నారు. మీ సేవా సెంటర్లకు వెళ్తే అక్కడ నిర్వాహకులు, వివరాలు నమోదు చేసే క్రమంలో రేషన్ కార్డ్ ఆప్షన్ వచ్చేసరికి, ఇంతకుముందు పాత కార్డు డిలీట్ అయిన కారణంగా ,ఆ నెంబర్ కొడితే దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయని, చెప్పడంతో యువకలు చాలా మంది నిరుత్సాహ వెను తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గడసంత సంతోష్, దింతసరం శంకర్.. తదితరులు పాల్గొన్నారు.

# మానవుల మనుగడకు అడవులే ఆధారం

ప్రపంచ అటవీ దినోత్సవం


**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ మరియు స్వచ్ఛంద సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో ఖానాపూర్ మండలం లోని పాఖాల్ చెరువు అడవి ప్రాంతంలోని బయోడైవర్సిటీ పార్క్ పరిసరాలలో వనదర్శిని కార్యక్రమంలో భాగంగా అడవిశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రీనా మరియు సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్ లు పాల్గొని మాట్లాడుతూ పారిశ్రామికీకరణ,పట్టణీకరణలతో అడవులు అంతరించిపోతున్నాయని దానివల్ల కాలుష్యం ఆందోళనకరంగా పెరిగి ఆక్సిజన్ లేక పట్టణాలలో మనుషులంతా ఉక్కిరి బిక్కిరై వాహనాలు కూడా తిరుగలేని స్థితి వచ్చిందని అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎంత పకడ్బందీగా అడవుల నరికివేతను కాల్చివేతను ఆపినా మనకు సరిపోయే 33% అడవులు లేక కేవలం 24 శాతం




మాత్రమేమిగిలాయని అన్నారు. డిల్లీ లాంటి పట్టణాలలో ఇప్పటికే సరి సంఖ్య బేసి సంఖ్య విధానంతో వాహనాలకు తిరగడానికి పరిమితి విధించినారు. ఇంకా రాబోయే రోజుల్లో ఆందోళనకరంగా పెట్రోలు డీజిల్ లాగా ఆక్సిజన్ బంకుల్లో మనం ఆక్సిజన్ కొనే రోజులు రాకుండా జాగ్రత్త పడాలని కోరినారు.తర్వాత ఏ ఎస్ ఆర్ సంస్థ ప్రతినిధి ఎర్రబోయిన రాజశేఖర్ మాట్లాడుతూ అడవులలో ఎంతో అమూల్యమైన అటవీ సంపద ఔషధ మొక్కలు మరియు అటవీలో జీవించే ఎన్నో వన్యమృగాలు నశించిపోతున్నాయని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.తర్వాత స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్యార్థులంతా పర్యావరణం పై మరియు సకల జీవుల ప్రాణానికి ఆధారమైన అడవులను సంరక్షించుటపై పూర్తి అవగాహన కలిగి ఇతరులకు కూడా చెప్పాలని కోరినారు.చివరగా జిల్లా వినియోగదారుల విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగే ల్లి సారంగం మాట్లాడుతూ మనం పీల్చే గాలిలోని కార్బన్ డయాక్సైడ్ ను చెట్లు పీల్చుకుని ఆక్సిజన్ను సకల జీవులకు అందిస్తున్నాయని అందుకే చెట్ల విలువను తెలుసుకొని అందరూ ఒక చెట్టు బోతే 10 చెట్లు నాటాలని ఆశయంతో ఉండాలని ఇంకా ఈ కార్యక్ర.మంలో అశోక్ నగర్ సైనిక్ స్కూల్ ఎన్ సి సి విద్యార్థులతో కలసి పీ ఈ టి వెంకటేష్, పాఖల్ బేస్ క్యాంపు ఇన్చార్జి విజయ్,శివ, వెంకట్రామ నరసయ్య మరియు సైనిక్ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

# రవణ రంగాన్ని రక్షించుకుందాం

**సంస్థన్ నారాయణపురం, తెలంగాణ సేన న్యూస్ :** ఈ నెల 24వ తేదీన రవాణా రంగాన్ని రక్షించుకుందాం. కార్మిక హక్కులను కాపాడుకుందాం అనే నినాదంతో పార్లమెంటు ముందు జరుగు ధర్నాను ఆటో కారు డీసీఎం లారీ ర్యాలీ మినీ డీసీఎం టాటా ఏసీ ట్రాక్టర్స్ అంబులెన్స్ స్కూల్ బస్సు ట్రక్స్ తదితర కార్మికులు కదిలి పార్లమెంట్ మెంట్ ముందు ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేసి ట్రాన్స్పోర్ట్ కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి పాషా పిలుపునిచ్చారు కార్మికులు పగలనక రాత్రి అనక ఎండ వాన చలి కాలాలలో కూడా 24 గంటలు రోడ్లపై వాహనాలు నడిపేది డ్రైవర్లు చట్టబద్ధమైన సౌకర్యాలు సామాజిక క్షేమ చట్టం గానీ లేవు సంఘవిద్ర శక్తులు దాడిలో ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగాయి రోడ్డు విస్తరణలో ఆటో కార్మికులు అడ్డాలు లేక బండ్లు ఎక్కడ పెట్టుకోవాలి అనేక ఇబ్బందులకు గురవుతా ఉన్నారు ఒకపక్క ట్రాన్స్పోర్ట్ కార్మికులు ఆటో రంగం వాళ్ళు ప్యాసింజర్ గిరాకి లేక ఇబ్బంది పడుతున్నటువంటి తరుణంలో ప్రభుత్వం ఫ్రీ బస్సులు పెట్టడం వల్ల బండ్ల కిస్తులు చెల్లించినటువంటి



పరిస్థితి గిరాకు లేక అప్పులల్లో నెట్టబడుచున్నారు ప్రభుత్వం ఆటో రంగా కార్మికులకు వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని 2019 చట్టం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్లపై పార్లమెంటు ముందు ధర్నాను ప్రతి డ్రైవర్ కదిలి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు కార్మిక చట్టాలను కాలరాశి నాలుగు లేబర్ కోట్లు కార్మికుల పొదుపాటి వెసులుబాటు కల్పించే కార్మిక చట్టాలను కూడా రద్దుచేసి లేబర్ పళ్ళు తెచ్చింది ఈ లేబర్ కళ్ళు అమలు చేయడానికి వీటన్నిటికీ తదితర డిమాండ్లపై జరుగు ధర్నాను ట్రాన్స్పోర్ట్ కార్మిక వర్గం కదలాలని ప్రభుత్వం వెంటనే స్పందించి 2 2019 చట్టాన్ని వెనుక తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి శ్రీనివాస్ చారి మరియు కార్మికులు మేడి స్వామి బండ జంగయ్య బాసరాజు లింగయ్య నందగిరి శ్రీనివాస్ సురవి యాదగిరి చితువుల నరసింహ గౌడ్ వలిగొండ జంగయ్య పోలేపల్లి మల్లేష్ మిద్దెల విజయ్ కూరాకుల శీను బోయ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్స్ భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతి సభలను విజయవంతం చేయండి

హిందు మతోన్మాద, బ్రాహ్మణీయ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుదాం.

ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనిరింగ్ కళాశాల ప్రొఫెసర్ మారేడు వెంకట దాస్.

**ఉస్మానియా యూనివర్సిటీ, తెలంగాణ సేన న్యూస్ :** ఈ నెల 23న కామ్రేడ్స్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 94వ వర్ధంతి సందర్భంగా డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుండి 29వరకు నిర్వహించ తలపెట్టిన కామ్రేడ్స్ భగత్ సింగ్ రాజు గురు సుఖదేవుల వర్ధంతి వారోత్సవాల గోడ పత్రికను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ యొక్క గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ మారేడు వెంకట దాస్ మాట్లాడుతూ డెబ్బెయ్ ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో



ఉచిత విద్య, వైద్యం అందించలేని స్థితిలో ఉన్న భారతదేశం ఉన్నదని, మోడీషా నాయకత్వంలో విదేశీ కార్పొరేట్ బహుళ జాతీ కంపెనీలకు అడవులను, ఖనిజాలను ధారదాత్తం చేస్తున్నారని, కామ్రేడ్స్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల ఉరిశిక్ష అమలు క్రమంలో వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం అనేది తెల్ల దొరలు పోయి నల్ల దొరలు వస్తారని వచ్చిన స్వాతంత్రం వట్టి బూటకపు స్వాతంత్రం అని వరన్నారని పేర్కొన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ ప్రజలకు అందాల్సిన రాజ్యాంగ ఫలాలు వారికీ అందడం లేదని, ఈ దేశంలో సంపన్నులు అధిక సంపన్నులుగా పేదలు నిరుపేదలుగా మారుతున్న క్రమంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, మహిళలు రాజ్యాంగ బద్దంగా వారి హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో ఆర్య బ్రాహ్మణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆర్థిక ,రాజకీయ, సామాజిక రిజర్వేషన్ల కల్పించాలని వారన్నారు. అదే విధంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్ మాట్లాడుతూ కామ్రేడ్స్ భగత్ సింగ్,రాజు గురు, సుఖే దేవ్ ల పోరాట స్పూర్తిని అందిపుచ్చుకుని నూతన జాతీయ విద్యా విధానం -2020కి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని, అలాగే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేలా ప్రభుత్వాలపై పోరాటం చేయాల్సిన బాధ్యత ఈ దేశ యువతగా, విద్యార్థులుగా మనందరిపై ఉందని వారన్నారు. ఈ కార్యక్రమం లో డిఎస్ఎ రాష్ట్ర కో కన్వీనర్ గణేష్, సభ్యులు అరుణ్, అనూష, కృష్ణ, ప్రవీణ్, సాయిరామ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కసారించాలి

**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అధ్యక్షులు సామ్రాజ్యం జనరల్ సెక్రటరీ వెంకటరెడ్డి అంజయ్య భవన్ హైదరాబాద్ లేబర్ కార్యాలయంలో అడిషనల్ లేబర్ కమిషనర్ న గంగాధర్ ని కలిసి యూనియన్ తరపున మెమోరండం ఇవ్వడం జరిగింది. ఇందులో హమాలి కార్మికులను కాంట్రాక్టర్లు మరియు గోదాంఓనర్లు ఏ విధంగా కష్టనష్టాలకు గురి చేస్తున్నారో వివరిస్తూ ఒక జాయింట్ మీటింగ్ను ప్రభుత్వ అధికారులు కాంట్రాక్టర్లు మరియు గోదాం ఓనర్లచే పెట్టించవలసినదిగా కోరడమైనది. దానికి వారు అనుకూలంగాస్పందించి జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్లకు ఇట్టి దానిపై ఆదేశాలిస్తానని చెప్పడం జరిగింది. అలాగే ఇదే కార్యాలయంలో కనీస వేతన సలహా మండలి చైర్మన్కి మరియు సెక్రటరీ గారికి కూడా బోర్డు మీటింగ్ ల సమయంలో హమాలీ కార్మికుల విషయమై చర్చించి రాష్ట్రమంతటా ఒకే రకమైన పనికి ఒకే బరువైన బస్తాకు కామన్ రేట్ నిర్ణయించవలసినదిగా కోరుతూ వారికి కూడా వేరువేరు లెటర్స్ ఇవ్వడం జరిగినది.



# పదవ తరగతి పరీక్షల సరళని పరిశీలించిన, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** నేటి నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల సరళిని మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృశ్యం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు.జిల్లాలో (8183 )కి గాను పరీక్షలకు హాజరైన వారి సంఖ్య (8176) కాగా (7) గైహాజరయ్యారు, 99.91, శాతం నమోదు అయ్యింది.జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి, కేసముద్రం, కురవి, మహబూబాబాద్ మండలాలలో పరీక్షలను పరిశీలించారు.

# పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతుల పరిశీలన

మనోధైర్యంతో వ్రాయండి , కలెక్టర్ హనుమంతరావు

**భువనగిరి, తెలంగాణ సేన న్యూస్ ,మార్చి 21 :** పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించి ,విద్యార్థులకు మనో ధైర్యాన్ని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.శుక్రవారం నుంచి ప్రారంభమైన ,పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో నిర్వహణ తీరును పరిశీలించారు. పట్టణం లోని గంజ్ ఉన్నత పాఠశాలలో, అన్ని గదులను కలెక్టర్ కలియ తిరిగి,ఎలక్ట్రిసిటీ, తాగునీరు తదితర మౌలిక వసతులను క్షుణ్ణం గా పరిశీలించారు. పరీక్ష ల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెండెంట్ కి పలు సూచనలు చేశారు.సజావుగా అన్ని పరీక్ష లు జరిగే లా మానటరింగ్ చేయాలన్నారు.



# సీఎంఆర్ ఐటి కళాశాల ఆధ్వర్యంలో విజ్ఞాన విహారయాత్ర



**సిద్దిపేట, తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా ములుగు మండలం నాగిరెడ్డి పల్లి గ్రామ వ్యవసాయ పంట పొలాలలో శు క్రవారం సిఎంఆర్ ఐటి కళాశాల జేఎస్టీయూ హైదరాబాద్ శాఖ వారి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు విజ్ఞాన విహారయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి గ్రామ వ్యవసాయ దారులతో మమేకమై ఆటపాటలతో సందడి చేశారు, అనంతరం సీఎంఆర్ కళాశాల వారి సౌజన్యంతో వ్యవసాయదారులకు చల్లని మజ్జిగ, పండ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందజేశారు, ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, సీఎంఆర్ ఐటి కళాశాల ఆధ్వర్యంలో చదువుతోపాటు విజ్ఞానం సామాజిక సేవ లక్ష్యంగా విజ్ఞాన విహారయాత్ర నిర్వహిస్తూ, మారుమూల గ్రామాల్లోని రైతులతో, రైతు కూలీలతో ఒక రోజు గడపడం చాలా సంతోషంగా ఉందని ఈ నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు మాపట్ల చూపించిన ప్రేమ అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు, అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ జంగారెడ్డి సార్ , ప్రిన్సిపల్ మధుసూదన్ రావు, ఎస్ ధనలక్ష్మి మేడం, కోఆర్డినేటర్ విజయ మేడం కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ భూములకు బోర్డు పెట్టాలి

**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** మాదన్నపేట రోడ్డు 111 ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని బోర్డు పెట్టాలని దళిత బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాటం డిబిఆర్పి వ్యవస్థాపక అధ్యక్షులు ఇమ్మడి బాబు నర్సంపేట ఆర్డిఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఇమ్మడి బాబు 111 ప్రభుత్వ భూమిలో గత కొద్ది రోజుల నుండి భూ కబ్జాదారులు ప్లాట్ల బిజినెస్ చేయడం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు ఆ భూమి ప్రభుత్వ భూమి కనుక ఆ ప్రభుత్వ భూమిని వెంటనే సర్వే చేయాలని డిబిఆర్పి సంఘము నుండి డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమములో గండికోట సమ్మక్క రాపోలు వెంకన్న లు పాల్గొన్నారు.



# శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయానికి మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు


ఆలయంలో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేపట్టిన ఎస్సై, సిఐ లకు కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ



**ఏటూరునాగారం : తెలంగాణా సేన న్యూస్, మార్చ్ 21 :** ఈ రోజున ములుగు జిల్లా, ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మూడు సి సి కెమెరాలను ఏర్పాటు చేసిన ఎస్సై తాజుద్దీన్, సిఐ శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ చైర్మన్ మదుగురి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మదూగురి ప్రసాద్ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు భద్రతను నిర్ధారించేందుకు ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబడ్డాయని, కెమెరాలు ఆలయంలోని అన్ని ప్రాంతాలను పర్యవేక్షిస్తాయి. అక్రమ కార్యక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలు సహాయ పడతాయని అన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన ఎస్సై తాజుద్దీన్, సిఐ శ్రీనివాస్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదములు ఆలయ కమిటీ తరఫున తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయం డైరెక్టర్లు ఇరవేణి రాంలాల్,ఇర్సవడ్ల కిరణ్,వలస తిరుపతి, కట్కూరి రాధికా, కర్ల అరుణ, దుర్గం కొమరయ్య, సోమంధపు నర్సింహులు, పెద్దబోయిన అర్జున్ ,గార పోషలు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య,తాండ్ర శ్రీను,కంపెల్లి భాగ్య, బట్టు ప్రవీణ్, పెద్దబోయిన యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని మోసం చేసి కోటి యాభై లక్షలు స్వాహా చేసిన స్నేహితులు

**హైదరాబాద్, సుల్తాన్ బజార్, తెలంగాణ సేన న్యూస్ 21:** చిన్ననాటి స్నేహితుని మోసం చేసిన ఘటన సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.. బాధితుడు మల్లికార్జున్ తెలిపిన వివరాలు ప్రకారం చిన్ననాటి స్నేహితుడైన నవీన్.. వినోద్ అనే వ్యక్తిని బినామీగా చేసుకుని లిటిగేషన్ లో ఉన్న ప్రాపర్టీని కోటి 50 లక్షల రూపాయలకు కొనిపించారు. రిజిస్ట్రేషన్ అయిపోయిన తర్వాత తీరా ఇంట్లోకి దిగేసరికి అప్పటికే ఆ ప్రాపర్టీ లిటిగేషన్లో ఉందని నరేష్ అనే అసలైన ఓనర్ ఒరిజినల్ డాక్యుమెంట్స్ చూపెట్టడంతో మల్లికార్జున్ కంగుతిన్నాడు.. ఇదేంటని నవీన్ ను నిలదీయగా కొన్ని రోజులు కాలం గడిపాడు.. అనంతరం కోర్ట్ నుంచి నోటీసులు తీసుకొచ్చి మల్లికార్జున్ కు కోటి రూపాయలు ముట్ట చెప్పినట్టు మల్లికార్జున్ ముందు పెట్టాడు.. ఇదేంటరి అడగగా నవీన్ బెదిరింపులకు పాల్పడుతున్నారని మల్లికార్జున్ వాపోయారు.. ప్రాపర్టీ నీ అమ్ముకొని, ఉన్న డబ్బులు తో ఒక ప్రాపర్టీ కొంటే స్నేహితుడే మోసం చేశాడని మల్లికార్జున్ ఆత్మహత్య ప్రయత్నానికి కూడా ప్రయత్నించారు.. అయినా కూడా బాదూరికి న్యాయం జరగపోవడంతో తన గోడును తెలియజేయడానికి మీడియా ముందుకు వచ్చారు.. మీడియాతో సహా సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్కు పరిష్కారం కోసం వెళ్లగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస చారి మల్లికార్జున్ బాధను విని విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బాధితుడు తెలిపారు.. అన్ని ప్రాపర్టీలు అమ్ముకొని మోసపోయి పిల్లలను పోషించుకోలేని పరిస్థితిలో ఉన్నానని మల్లికార్జున్ గోడును వెళ్ళబోశాడు. మహిళా మండలి అధ్యక్షురాలు డప్పు సునీత బాధితులకు అండగా నిలిచారు.



# గజ్వేల్ లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

**సిద్దిపేట,తెలంగాణ సేన న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజక వర్గంలో శుక్రవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి కాగా పరీక్షలకు అని ఏర్పాట్లు చేసిన అధికారులు,పోలీసుల పహారాలో పదవ తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి, నిర్భయంగా పరీక్షలు రాసి పరీక్షల్లో ప్రశ్నలకు జవాబులు క్షుణ్ణంగా రాయాలని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తేవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శనివారం 22 - 03 - 2025

# చెప్పుల్లో సేఫ్టీ ఫీచర్!



ఎన్ని చట్టాలు వచ్చినా, ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా.. ఇప్పటికీ 'మహిళల భద్రత' గాలిలో దీపమే! దేశంలో రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతుండటం.. ఆందోళన కలిగించే అంశమే! ఈ క్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పాఠశాల విద్యార్థులు.. మహిళల భద్రతకు భరోసా ఇచ్చే లక్ష్యంతో ఒక ప్రత్యేకమైన ఆవిష్కరణ చేశారు. ఇంటిగ్రేటెడ్ ఎస్‌ఓఎస్ (సేవ్ అవర్ సోల్) సేఫ్టీ ఫీచర్‌తో.. సరికొత్త చెప్పులకు రూపకల్పన చేశారు. ఇవి ఆపదలో ఉన్న ఆడవాళ్లకు అండగా నిలుస్తాయని ఆవిష్కర్తలు అమృత్ తివారీ, కోమల్ జైస్వాల్ అంటున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ఈ చెప్పుల్లో.. కాలికింద ఎస్‌ఓఎస్ బటన్‌ను ఏర్పాటుచేశారు. ఈ బటన్‌ను ప్రత్యేక యాప్‌ద్వారా ఫోన్‌కు కనెక్ట్ చేస్తారు. మహిళలు తమకు ఏదైనా ఆపద పొంచి ఉన్నట్టు భావిస్తే.. వెంటనే ఈ బటన్‌ను ప్రెస్ చేస్తే చాలు. యాప్‌లో అప్పటికే సేవ్ చేసి ఉన్న కుటుంబసభ్యులు, స్నేహితుల నెంబర్లకు హెచ్చరిక మెసేజ్‌లు వెళ్తాయి. సందేశం అందుకున్నవాళ్లు వెంటనే అప్రమత్తం అవుతారు. అంతేకాదు.. వారు ఉన్న లొకేషన్‌తోపాటు ఆడియోను రికార్డ్ చేసి మరీ పంపిస్తుంది. అలా.. ఆపదలో ఉన్నవారు ఎక్కడ ఉన్నారో? వారి చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇందులో మరో సేఫ్టీ ఫీచర్.. ఈ చెప్పులు 'స్టన్ గన్' మాదిరిగానూ పనిచేస్తాయి. దాడిచేసే వ్యక్తిని అడ్డుకోవడానికి చిన్న విద్యుత్ షాక్‌ను ఇస్తాయన్నమాట. భవిష్యత్తులో.. ఈ చెప్పుల్లో కెమెరాను ఇన్‌స్టాల్ చేయాలని భావిస్తున్నట్లు ఆవిష్కర్తలు చెబుతున్నారు. తద్వారా బాధితుల చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో చూడొచ్చు.

# గాజాను స్వాధీనం చేసుకుంటాం

**ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం**

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన**



యుద్ధ కల్లోల గాజాను తాము స్వాధీనం చేసుకుని, అభివృద్ధి చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మంగళవారం ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో చర్చల అనంతరం వైట్‌హౌసలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. "మేం(అమెరికా) గాజాను స్వాధీనం చేసుకుంటాం. అక్కడ ధ్వంసమైన భవనాల వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. యుద్ధం కారణంగా పేలకుండా మిగిలిపోయిన బాంబులను నిర్వీర్యం చేయాల్సి ఉంది. ఆ తర్వాత గాజాను ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం. అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తాం. దాంతో ఆర్థికాభివృద్ధి, కొత్త ఇళ్ల నిర్మాణం జరుగుతుంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రకటన గాజా చరిత్రను మారుస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు. ట్రంప్ ప్రకటనపై అరబ్ దేశాలు విముఖత వ్యక్తం చేశాయి. ఇజ్రాయెల్ దాడులకు ముందు వరకు గాజాలో ప్రభుత్వాన్ని నడిపిన హమాస్ కూడా ట్రంప్ ప్రకటనను ఖండించింది. ఈ ప్రతిపాదనకు ఒప్పుకొనేది లేదని, ట్రంప్ గందరగోళాన్ని సృష్టిస్తున్నారని హమాస్ సీనియర్ నేత సమీఅబూ జుహ్రీ వ్యాఖ్యానించారు. అమెరికా దురాక్రమణను అడ్డుకుంటామన్నారు. కాగా, గాజా పునర్నిర్మాణం జరిగే వరకు 2 లక్షల మంది పాలస్తీనీయులను శరణార్థులుగా స్వీకరించాలంటూ ఈజిప్ట్, జోర్డాన్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, అరబ్‌లీగ్, పాలస్తీనా అథారిటీని ట్రంప్ ఇటీవల కోరారు. అయితే.. తమ దేశాల్లో ఉగ్రవాద భయాలు పెరుగుతాయనే ఆందోళనతో ఆయా దేశాలు ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించాయి.

## ఈసారి పరీక్షా పే చర్చ చాలా స్పెషల్.. ప్రధానితో పాటు సద్గురు, దీపికా పదుకొణె, మేరికోమ్.. ఇంకా ఎందరో



పరీక్షా పే చర్చ 2025 కార్యక్రమం ఫిబ్రవరి 10న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి 3.6 కోట్ల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తొలిసారిగా, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, ఆధ్యాత్మిక గురువు సద్గురు, బాలీవుడ్ నటి దీపికా పదుకొనే, ప్రముఖ క్రీడాకారులు మేరీ కోమ్, అవని లేఖారా బోర్డు పరీక్షల్లో ఒత్తిడిని తగ్గించుకోవడానికి విద్యార్థులకు చిట్కాలు అందజేస్తారు. పరీక్షా పే చర్చా కార్యక్రమం కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ 14 డిసెంబర్ 2024 నుండి ప్రారంభమై 14 జనవరి 2025 వరకు కొనసాగింది. క్రీడా ఛాంపియన్లు మేరీ కోమ్, అవని లేఖారా తమ పట్టుదల, సవాళ్లను అధిగమించిన కథలతో విద్యార్థులకు స్ఫూర్తినిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ప్రధానమంత్రి మోదీ విద్యార్థులతో ప్రత్యేక సంభాషణ, దీనిలో ఆయన వారి ప్రశ్నలకు సమాధానమిస్తారు. విద్య, జీవిత సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో మార్గదర్శకత్వం చేస్తారు. ఎంపిక చేయబడిన మొత్తం 2,500 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వారి అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడానికి విద్యా మంత్రిత్వ శాఖ నుండి కిట్‌లను అందుకుంటారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన బి ఆర్ ఎస్ యువ నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



**అందోల్ నియోజకవర్గం తెలంగాణ సేన న్యూస్ :** అందోల్ మండలానికి చెందిన పార్టీ యువ నాయకుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన, విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ ఆయనను సంగారెడ్డి హాస్పిటల్ లో పరామర్శించారు. గాయపడిన నేత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న క్రాంతి కిరణ్, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను ధైర్యంగా ఉండాలని ఆయన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనది. ఏ సమయంలోనైనా వారికి అండగా ఉంటాం అని అన్నారు. సభ్యులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాస్పిటల్‌కు చేరుకుని యువ నేత ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు ప్రస్తుతం ఆయన పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. త్వరగా ఆరోగ్యంగా తిరిగి వస్తారని ఆశిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు చంటి క్రాంతి కిరణ్.

# వికారాబాద్ ను అభివృద్ధి చేయాలి



**వికారాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** వికారాబాద్ అభివృద్ధి చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ గారిని కలిసి న వికారాబాద్ జిల్లా ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షులు , కాంటెస్ట్ ఎమ్మెల్యేబీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామ్ చందర్ యాదవ్. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేసి, వికారాబాద్ జిల్లా అభివృద్ధి గురించి విన్నవించడం జరిగింది. వికారాబాద్ జిల్లా నుండి ముఖ్యమంత్రివర్యులు మరియు అసెంబ్లీ స్పీకర్ గా మీ రు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు చాలా సంతోష దాయకం. హైదరాబాద్ పట్టణానికి ఆనుకుని కూతవేటు దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లాలో అభివృద్ధి లేక ముఖ్యంగా పల్లె ప్రాంతాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని స్పీకర్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వికారాబాద్ జిల్లా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భాగంగా ఉన్నప్పుడు నాయకులు అభివృద్ధి చేయలేదని ప్రజలు వాపోతున్నారు. ఇంతకుముందు కూడా అభివృద్ధి పనుల గురించి ముఖ్యమంత్రివర్యుల వారికి వివరించడం జరిగింది. దయచేసి స్పీకర్ గారు మరియు ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారు తమ సొంత జిల్లాను పట్టించుకొని అన్ని విధాల అభివృద్ధి చేయాలని స్పీకర్ గారిని కోరడం జరిగింది. వికారాబాద్ జిల్లాలో సుమారుగా 75% రోడ్లన్నీ అద్వానంగానే తయారై యాక్సిడెంట్లు జరుగుతున్నాయి బాలింతలు వయోవృద్ధులు దవాఖానకు వెళ్లాలంటే కష్టంగానే ఉంది. ముఖ్యంగా పల్లెటూరు రోడ్లు అభివృద్ధి చేయడం అత్యవసరం. రోడ్లు బాగు చేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరడం జరిగింది. వేసవి కాలంలో కూడా నీటి ఎద్దడి రావచ్చు దయచేసి త్రాగునీటి కరువు రాకుండా ప్రజలను కాపాడి నీటి సరఫరా పెంచి వృద్ధిపరచాలని కోరడం జరిగింది. పల్లెల్లో విద్యావ్యవస్థ కుంటుపడింది. పాఠశాలలో ఉపాధ్యాయుల సరైన దామాషా పద్ధతులో లేక సరి అయిన వసతులు లేక బాల బాలికలకు ఇబ్బందిగా ఉంది. విద్యార్థులు లేక కొన్ని స్కూళ్లు కూడా మూత పడి ఉన్నాయి. మండల స్థాయి వరకు వరకు కూడా ప్రైవేటు పాఠశాలలున్నందున ఫీజులు చెల్లించడం పేదలకుతలకు మించిన భారంగా అయింది. బాల బాలికలకు సరైన వసతులు లేవు. బాలికలకు మూత్రశాలలు మరుగుదొడ్లు లేక చదువు మానేస్తున్నారు. ప్రజా సమస్యలు నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు గోడు వెళ్ళబోసుకు ంటున్నా రు. విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారు . బాలికలకు బాత్రూం మూత్రశాలలు లేక కూడా బాలికల విద్యకు విఘాతం కలుగుతుంది దామగుండం డిఫెన్స్ ప్రాజెక్టులో కోల్పోయిన భూములు ,ఉపాధి పేదలకు ఏదో విధంగా ఉపాధి కల్పించి సహాయం చేసి పొట్టకూటికి జరుగునట్లు చూడాలని కోరడం జరిగింది. దామగుండం అడవిలో ఉన్న పండ్లు ఫలాలు మిగతా వి ఉపాధి లాగా లభించేది. దయచేసి పేదల జీవనోపాధికి ఉపాధి గురించి ఆలోచించండి. పర్యాటక ప్రాంతం వలె అనంతగిరిని అభివృద్ధి చేసి దేవాలయాన్ని మరియు ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకులు మన రాష్ట్రం వాళ్లే కాకుండా కర్ణాటక మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ వాళ్లు కూడా రావటానికి ఆస్కారం ఉంది దయచేసి పద్మనాభ స్వామిటెంపుల్ అనంతగిరిని అభివృద్ధి పరచాలని స్పీకర్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. విద్యా వ్యవస్థ వైద్య వ్యవస్థ పేదలకు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు వైద్య సాయం విషయంలో తమరు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వచ్చి మండల్ లెవెల్లో వైద్యం అందినట్లు ఆరోగ్య కేంద్రాలు ఆధునికరించాలని మందులుఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని కోరడం జరిగింది. విద్య వైద్యం ఉపాధి మరియు సామాజిక సంక్షేమ ఫలాలు పేదలకు అందునట్లు తమరు సహాయం చేయాలని విన్నవించడం జరిగింది. వయోవృద్ధులకు సమయానికి పెన్షన్ ఇవ్వాలని గ్రామాలను బాగు చేయాలని కోరుతూ, స్పీకర్ గారిని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధానికి దగ్గరలో ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకోలేదు. వికారాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో చేరునట్లు తమరు శాయశక్తుల కృషిచేసి ముఖ్యమంత్రి వారి సహకారంతో వికారాబాద్ జిల్లాను అభివృద్ధి చేయాలని స్పీకర్ గారి నివాసములో కలిసి మనవి చేయడం జరిగింది. స్పీకర్ గారిని కలిసిన వారిలో బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ తో పాటు బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ అధ్యక్షులు అశోక్ యాదవ్ గొర్ల కాపరుల అధ్యక్షులు మధు యాదవ్ అభిమానులు పెద్దలు పాల్గొని స్పీకర్ గారికి వికారాబాద్ జిల్లా అభివృద్ధి గురించి విన్నవించడం జరిగింది. గౌరవనీయులైన స్పీకర్ గారు పాజిటివ్ గా స్పందించి పూర్తి సహాయం చేస్తానని ముఖ్యమంత్రి గారికి మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

# ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

**సెంటర్ లను పరిశీలించిన తహశీల్దార్ శ్రీకాంత్**



**ముధోల్, తెలంగాణ సేన న్యూస్, మార్చ్ 21 :** ముధోల్:మండల కేంద్రమైన ముధోల్ లోని మూడు పరీక్ష కేంద్రాలు- మండలంలోని అష్టా ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి .విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు .ఈ పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు జరిగాయి. మండలంలో మొత్తం 701 మంది విద్యార్థులు పరీక్ష లు రాశారు. ముధోల్ ల్లోని రబింద్ర పాఠశాల పరీక్ష కేంద్రంలో240మంది విద్యార్థులు, ఆశ్రమ పరీక్ష కేంద్రంలో 167విద్యార్థులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం లో 180మంది విద్యార్థులు, మండలంలోని అష్టా పరీక్ష కేంద్రంలో 114 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు నిర్వాహకులు తెలిపారు. ముధోల్ లోని మూడు పరీక్ష కేంద్రాలను ముధోల్ తహశీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

## అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించిన సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డి కి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి,పాలాభిషేకం



**సంస్థాన్ నారాయణపురం, తెలంగాణ సేన న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దుబ్బాక నవీన్ గారి ఆధ్వర్యంలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారికి మరియు కాంగ్రెస్ పార్టీ మంత్రులకు,మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరవనీయులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,దామోదర రాజనర్సింహ్మ,ఉత్తంకుమార్ రెడ్డి,గారికి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం గారికి మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగింది.రాష్ట్రంలో ఎస్సీ లో ఉన్న 59 కులాలను 3 మూడు గ్రూపులుగా అసెంబ్లీలో బిల్లు తీర్మానం చేసి పార్లమెంటుకు పంపడం జరిగింది. అందులో భాగంగానే నారాయణపూర్ మండల కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి ఎస్సీ నాయకులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ మండల నాయకులు ఎండి అక్బర్ అలీ,గారు గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి గారు,నారాయణపూర్ మండల ఉపఅధ్యక్షులు ఎర్ర వెంకటేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తుల లక్ష్మయ్య,గారు మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ,మాజీ సర్పంచ్ ప్రజ్ఞ నాయక్,ఉప్పల నాగరాజు,గునిగంటి రాజు,రిపోర్టర్ సింగం కృష్ణ,నాతి లక్ష్మణ్,యశ్వంత్ యాదవ్, కొండ నవీన్,రాసమల్ల వీరేశం, తదితరులు, పాల్గొన్నారు,

# స్టూడెంట్ యాక్టివిటీస్ సెంటర్ కు అంబేద్కర్ పేరు ప్రారంభోత్సవం




**బాసర, తెలంగాణ సేన న్యూస్, మార్చ్ 21 :** నిర్మల్ :-జిల్లా బాసర త్రిబుల్ ఐటీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టూడెంట్ యాక్టివిటీస్ ప్రారంభోత్సవం సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన అవిశ్రాంత కృషికి గుర్తింపుగా ఆర్జీయూకేటీలోని స్టూడెంట్ యాక్టివిటీస్ సెంటర్‌కు ప్రముఖ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టారు. ఈ కేంద్రాన్ని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ శ్రీ ఇట్యాల పురుషోత్తం, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్, ప్రముఖుల సమక్షంలో అధికారికంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఓఎస్డి ప్రొఫెసర్ మురళీ దర్శన్,ఎవో రణధీర్ సాగి,వివిధ విభాగాల డీన్‌లు పాల్గొన్నారు.విద్యార్థుల సంక్షేమం,పాఠ్యేతర కార్యక లాపాలను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా శ్రీ ఇట్యాల్ పురుషోత్తం మాట్లాడుతూ, విద్యార్థి-కేంద్రీకృత చొరవల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు.సమగ్ర విద్యా అనుభవాన్ని అందించడంలో విశ్వ విద్యాలయం చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ వైస్ చైర్మన్ కు తన మద్దతు, ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు.ఒక శక్తివంతమైన క్యాంపస్ సంస్కృతిని పెంపొందించడానికి విశ్వ విద్యాలయం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టూడెంట్ యాక్టివిటీస్ సెంటర్ అత్యా ధునిక సౌకర్యాలతో అమర్చబడి విద్యార్థుల కార్యకలాపాలు,క్లబ్బులు,సంస్థలకు కేంద్రంగా పని చేస్తుంది. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి,నాయకత్వ అభివృద్ధి,సమాజ సేవను ప్రోత్సహించడం ఈ కేంద్రం లక్ష్యం.

# అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



**సంస్థాన్ నారాయణపురం, తెలంగాణ సేన న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా, నారాయణపురం మండలం, పుట్టపాక గ్రామానికి విచ్చేసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ కి పుట్టపాక గ్రామ సమస్యలపై డి వై ఎఫ్ ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. %ణ్ఖీ×% జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దొంతగోని అమరేందర్ మాట్లాడుతూ గ్రామంలో మూడు ఆవాస ప్రాంతాలు ఉన్నాయి వీటిలో వృద్ధులు వికలాంగులు ఎక్కువ ఉండడంతో పెన్షన్ కి గాని రేషన్ బియ్యానికి గాని తీసుకోవడానికి సుమారు ఒక కిలోమీటర్ వరకు రావాల్సి వస్తుంది దీనివల్ల వృద్ధులు గాని వికలాంగులు గాని వారి ఆరోగ్య రీత్యా ఇబ్బంది పడతా ఉన్నారు దీని విషయంపై అడిషనల్ కలెక్టర్ గారికి ఆయా ప్రాంతాలలోనే వారికి పెన్షన్ గాని రేషన్ బియ్యం గాని అందజేయాలని వారిని కోరడం జరిగింది అట్లాగే గ్రామంలో 2009 10 సమయంలో నిరుపేద కుటుంబాలకి ప్రభుత్వం ప్లాట్లు పంచడం జరిగింది ఇట్టి ప్లాట్లను కొంతమంది వ్యక్తులు కబ్జా చేసుకుని వ్యవసాయం చేస్తూ ఆ ప్లాట్ యజమానులనే బెదిరించడం జరిగింది. దీనిపై అడిషనల్ కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేస్తూ సుమారు మూడు ఎకరాల 20 గుంటల భూమిని కబ్జా కోర్ల నుండి రక్షించి అర్హులైన వారికి ఆ యొక్క ఇండ్ల స్థలాలను అందజేయాలని వారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జోకు మహేష్,నడికుడి నరసింహ,నల్లవెల్లి వెంకటేష్,ఆందోజు శంకరచారి , సుక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో అక్రమ అరెస్టు లా

**చలో హైదరాబాద్ అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికై**

**ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు**

**సీఐటీయు జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు**




**భువనగిరి, తెలంగాణ సేన న్యూస్, మార్చ్ 21 :** ప్రజా పాలన అంటే అక్రమ అరెస్టులా అని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు ప్రశ్నించారు. అసంఘటిత రంగా కార్మికులు, హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కారానికై,చలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నా లో పాల్గొనకుండా ,అడ్డుకొని అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు.సందర్భంగా మాట్లాడుతూ ,గత ప్రభుత్వం కార్మికుల ప్రజల సమస్యలు ,పరిష్కరించడంలో విఫలమైనది అని ఆరోపించారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, కార్మిక చట్టాలు అమలు చేస్తామని, కార్మికుల సంక్షేమం కోసమే పాలన ఉంటుందని చెప్పిన ముఖ్యమంత్రి,కనీస వేతనాలు చెల్లిస్తామని, అనేక వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి, సంవత్సరం అయిపోతున్న ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదు అన్నారు.అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ,తమ సమస్యలు పరిష్కరించాలని , చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నాలో పాల్గొనడానికి వెళ్తున్న , హమాలి కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం, ఎంతవరకు సమంజసం అని అన్నారు .ప్రజా పాల అంటే అక్రమ అరెస్టులు కేసులు పెట్టడమేనా అని విమర్శించారు. వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేసి, అసంఘటిత కార్మికులకు కార్మికులకు సంక్షేమం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఐలయ్య, నరసింహ ,సిద్దయ్య ,బాల మల్లయ్య ,బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


## 10వ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించి, అక్కడి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్



**సంగారెడ్డి, తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నుండి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, కరుణా హై స్కూల్ మరియు సాహితీ హై స్కూల్ పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్. గారు ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడి బందోబస్తు ఏర్పాట్లను మరియు పరీక్షా రాయడానికి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు ఉండవలసిన కనీస సదుపాయాలు, అత్యవసర మెడికల్ సేవల గురించి పర్యావేక్షించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 10వ తరగతి పరీక్షల నిర్వాహణ గైడ్ లైన్స్ పాటిస్తూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 యాక్ట్ -2023 అమలులో వుంటుందని, పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపియస్.గారు వివరించారు. పరీక్షా కేంద్రాల దగ్గర ఉన్నటువంటి అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ముందుగానే నోటీసులు జారీ చేసి, మూసివేయించడం జరిగింది అన్నారు.విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్ మరియు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్స్ ఎవ్వరికి కూడా పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడానికి అనుమతించబడవు.పరీక్షా కేంద్రం వద్ద ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లైతే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీసు వారికి సమాచారం అందించాలని సూచించారు.

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల



నీలాంబ ఉరివేసుకుని చనిపోయిన మరునాడే.. కళామందిరానికి వచ్చింది లలితాంబ. వెళ్లి దూరంగా కొందరు మహిళా కవయిత్రుల మధ్య కూర్చుంది. ఎక్కడో ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.. విడిపోయాయి. ఇద్దరి మధ్య పూర్తి నిశ్శబ్దం! అదొక నృత్త విన్యాసం.. దాని అర్థం ఆ పరమేష్టికే తెలియాలి!! జీవితం.. కనీసపు శారీరకతృష్ణ కూడా తీరని ఓ ఎండిన మోడుగానే బతుకు ముగిసిపోతుందా!? నీలాంబక్కను తల్పంపై అలా చూసేసరికి ఆరోజు లలితాంబ చేతిని తన గుండెకు తాకించడం తప్పయిందా?.. అప్పటికే తమమధ్య ఆమె కోరుకున్న భోగినీ పండుగ జరిగినట్లు భావించి ఆ సంతోషంలో.. శారీరక బాధల నుంచి విముక్తి కోరుకుని ఉరి వేసుకుందా!? అది కూడా ఖర్మకొద్దీ ఆ రోజునే.. ప్చ్! నీలాంబ మరణం కలిగించిన లోలోన ఘర్షణను మర్చిపోవడానికి అన్నట్లు ఈ పెళ్లిపనులు మీదికెత్తుకున్నాడు జాయచోడుడు. రాత్రింబవళ్లు మరో ఆలోచన రాకుండా అన్నీ తానై నిర్వహిస్తున్నాడు.కాకతీయ సామంత రాజ్యాలన్నీ కూడా గణపాంబ వివాహం తెచ్చిన ఉత్సవ వాతావరణంతో సంబరాలను జరుపుకొంటున్నాయి. సంబరాలతో పులకించిపోతోంది అనుమకొండ మహానగరం. నగరమంతా చలువ తాటాకులతో పెళ్లిపందిరులు వేస్తున్నారు. ఇక కాకతీయకోట, అందులో ఉన్న నియోగాలు, భవనాలు, రాజప్రాసాదాలు, రాజనగరి అన్నిటా సంతోష సందడులే. రాజనగరి మరీమరీ వెలిగిపోతోంది. రాజ్యమంతటా ఆనందసంద్రాలు పొంగి పొరలుతున్నాయి. పెళ్లి బరువు బాధ్యతల నడుమ కాబోయే కాకతీయ వారసులపై ఓ కన్నేసి ఉంచాడు జాయచోడుడు. ముఖ్యంగా పెద్ద మేనల్లుడు రుద్రమదేవుడు, రెండవ మేనల్లుడు మురారిదేవుడు.. వాళ్లిద్దరి కదలికలు, ఉత్సాహ ఉద్వేగాలు.. పెళ్లి సంబరాల్లో వాళ్ల ఆటపాటలు.. అన్నీ పరిశీలిస్తున్నాడు. హరిహరుడు, మురారి విసురునాడులోని గురుకులంలో యుద్ధవిద్యలు అభ్యసిస్తుండగా.. హరిహరుడు కాలధర్మం చెందాడు. మురారి అక్కడే చదువు కొనసాగిస్తున్నాడు. గణపాంబ పూర్తిగా రాజప్రాసాదంలోనే రాజగురువుల వద్ద చదువుకుంటుండగా.. రుద్రమదేవుడు త్రిపురాంతకం గోళకిమఠంలోని విద్యాకేంద్రంలో చదువుతున్నాడు. చదువుతోపాటు యుద్ధవిద్యల్లో కూడా నిష్ణాతుడని విన్నాడు. జాయచోడుని నాజూకు శరీరం రాలేదు గానీ.. అందంలో మేనమామకు తీసిపోడు మురారి. చుట్టూ పదిమంది మిత్రులను వెంటేసుకుని ఎప్పుడూ ఘల్లుఘల్లున నవ్వుతూ కేరింతలలో కనిపిస్తున్నాడు మురారి. రుద్రమదేవుడి పక్కన కూడా ఉన్నారు మిత్రులు.. కాదుకాదు అంతా మిత్రురాళ్లు! ఆశ్చర్యపోయాడు. రుద్రమదేవుడు.. గణపతి %-% సోమల దంపతుల ద్వితీయ సంతానం. చూపులకు ఏదో వింత శరీరుడిలా తోచాడు జాయచోడునికి. కాకతీయవంశానికి కాబోయే వారసుడు.. అతని ఆహార్యం వింతగా ఉంది. కంచుకంపై బంగారపు కవచం ధరించాడేమిటి? పరీక్షగా చూస్తే.. అది వక్షస్థలాన్ని నొక్కిపెడుతున్నట్లు! మరింత పరీక్షగా చూస్తే.. చూడకూడని యుక్తవయస్కురాలి యువ సమున్నతాలను దాచడానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా తోచింది. సాధారణంగా యుద్ధవీరులైన మహిళలు అలాంటి కవచాలను ధరిస్తారు. కానీ యువ రారాజు, యుద్ధరంగంలో ఉన్నట్లు అక్క పెళ్లిసంబరాలలో దుస్తులపై కవచం ధరించడం ఏమిటి?! రుద్రమదేవుని జనన సమయంలో రాజ్యంలో చెలరేగిన వాద ప్రతివాదాలు గుర్తొచ్చాయి జాయచోడునికి. చతుష్పథం వద్ద మిత్రుల చర్చలు కళ్లముందు కదలాడాయి. ఇతనికోసమా అప్పట్లో రాజ్యమంతా అట్టుడికిపోయింది?! ఇతనా కాబోయే చక్రవర్తి? ఇతనా పరిణత రాజకీయవేత్త, రణరంగ నిపుణుడు, ఆయన కలలోకి వచ్చినా శత్రువు గుండె ఆగి మరణిస్తాడని కవులు కీర్తించే గణపతిదేవుని వారసుడు? అతణ్ని ఎగాదిగా చూసి జాయచోడుని ఆనందం ఆవిరైపోయింది. అప్పుడే రుద్రమదేవుడు కూడా జాయచోడుణ్ని పరిశీలనగా చూస్తున్నాడు. తననే చూస్తున్న రుద్రమదేవుణ్ని చూసి పలకరింపుగా నవ్వాడు జాయచోడుడు. అతను తిరస్కారంగా చూసి మూతి తిప్పుకొని వెళ్లిపోయాడు.

**దిమ్మెరపోయాడు జాయచోడుడు. వీరయువకుడు అలా మూతి తిప్పడం!??**

అభినయాలు ఎన్నిరకాలో, ప్రతి శరీరభాగ కదలికలు ఎలా ఉండాలో సప్రమాణంగా చెప్పగల మహానాట్యకారుడు జాయచోడుడు విభ్రాంతి చెందాడు. ఆ మూతి తిప్పడం?? ఎటువెళ్లినా.. ఏమి చేస్తున్నా.. ఆ మూతి తిప్పుడు దృశ్యమే మరీమరీ జాయచోడుని కళ్లముందు కదలాడుతోంది. అతనిపై దృష్టిపెట్టాడు జాయచోడుడు. అతడు ఎవ్వరితో కలవడంలేదు. పక్కన ఇద్దరు పరిచారికలు అన్నీ సమకూరుస్తూ అతని వెన్నంటి ఉన్నారు. 'వెన్నంటి ఉన్నారు' అనే కంటే.. ఎవ్వరినీ కలవకుండా కాపలా కాస్తున్నారు అనొచ్చు.వెలనాడు కార్యాలయంలోనే పనిచేస్తూ జాయచోడుడు అనుమకొండ వచ్చిన నాటినుంచి తిరిగి ఆయన ఆంతరంగిక వార్తాహరుడుగా వ్యవహరిస్తున్న వృద్ధుడైన అంకమరట్టని పిలిచి రుద్రమదేవుని కదలికలు పరిశీలించమన్నాడు. మరునాడు అంకమరట్ట చెప్పాడు చెవిలో.. "యువరాజుగారిలో అబ్బాయి కంటే అమ్మాయి లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని యువకులే నవ్వుకుంటున్నారు. పైగా యువరాజుగారు యువకుల చెయ్యి తగిలినా చిరాకు పడిపోతున్నారట మహారాజా! ఇక భుజంపై చెయ్యి వేస్తే యుద్ధమేనట!". చలువపందిళ్లు వేస్తున్నచోట ఉన్నాడు రుద్రమదేవుడు. యువకులంతా కబుర్లు చెప్పుకొంటూ పనిచేస్తుంటే.. అతను మాత్రం ఇద్దరు చెలికత్తెల మధ్య చెంపకు చెయ్యి ఆన్చి విస్ఫారిత నేత్రాలతో చూస్తున్నాడు. చెలికత్తెలు ఏదో చెప్తున్నారు. ముగ్ధ మనోహరంగా అచ్చమైన తెలుగింటి ఆడపిల్లలా నవ్వుతున్నాడు. నవ్వుతున్నప్పుడు ఆ బుగ్గలపై బుజ్జిబుజ్జి చొట్టలు చూడముచ్చటగా కనిపించీ కనిపించకుండా వచ్చి పోతున్నాయి. జాయచోడుని మనసంతా విచారం అలుముకుంది. రుద్రమదేవుడు కేవలం స్త్రీ అయితే ఎంత కన్నులపండువగా ఉంటుంది! తల్లిలా ఛాయ తక్కువైనా.. అందానికి తిరుగులేదు!!

**భగవంతుడా.. బావగారికి ఎంత పెద్ద పరీక్ష పెట్టావయ్యా!!**

ప్చ్.. బావగారితో వీడి గురించి చర్చించాలి అనుకుంటూ గణపాంబ ఉన్న మందిరంలోకి ప్రవేశించాడు. ఎదురుగా గణపాంబను అలంకరిస్తున్నారు సైరంధ్రులు, పుష్పలావికలు. సహకరిస్తూ హాస్యమాడుతున్న మిత్రురాళ్లు, బంధువుల్లోని యువతులు. అదొక యువ యవ్వన కెరటాలు ఎగసిపడుతున్న సంద్రం. ఆ మందిరమంతా విరిసిన నవ్వుల నవ సుమపరిమళంతో పల్లవించి ప్రవహిస్తోంది. 'తను ఆ యవ్వనప్రాయపు సవ్వడులను దాటిపోయాడేమో..' పలకరింపుగా నవ్వి వెనుదిరిగాడు. "మామా.." పిలిచింది గణపాంబ. ఆగి వెనుదిరిగి చూశాడు. గణపాంబ ఆత్మీయంగా పరిగెత్తుకు వచ్చింది. "వీడు.. నా తమ్ముడు. రుద్రమదేవుడు!". "ఆరోజు తండ్రిగారు పరిచయం చేశారుగా పెద్దతల్లి. కానీ, మాట్లాడలేదు" అన్నాడు రుద్రమదేవుణ్ని ఎగాదిగా చూస్తూ. "రుద్రా.. జాయచోడదేవుడు మామ. వినే ఉంటావు. దైవం ప్రసాదించిన మామ. ఎవరికోగానీ, ఇలాంటి మామ దొరుకడు. మహాయోధులు, మహానాట్యకారులు కూడా. అంతేకాదు తండ్రిగారికి అత్యంత నమ్మకస్తులు.." గొప్పగా చెప్పింది గణపాంబ. "విన్నాను. విన్నాను. పిఠాపుర యుద్ధంలో తండ్రిగారికి ఆయుధం అందించిన తీరు తండ్రిగారు ఎప్పుడూ చెబుతుంటారు. త్రిపురాంతకంలో మా యుద్ధగురువులు కూడా మామ ప్రతిభను పాఠాల వేళ ప్రస్తావిస్తుంటారు. ఇప్పుడు దగ్గరగా చూస్తున్నాను" అన్నాడు రుద్రమదేవుడు తిప్పుకొంటూ.అతని గొంతు.. హతవిధీ! ఎంత అన్యాయం చేశాడు దేవుడు. గొంతుకూడా స్త్రీలాలిత్యంతో ఎంత శ్రావ్యంగా ఉంది! రాత్రి ఆంతరంగిక మందిరంలో గణపతిదేవుడితో అన్నాడు జాయచోడుడు. "రుద్రమదేవుడి అంశంలో.. దేవుడు అన్యాయం చేశాడు బావగారు!". పెళ్లి ఏర్పాట్లలో చాలా అలసిపోయినట్లు ముఖం పెట్టాడు గణపతిదేవుడు. "వాడు.. అక్కడే ఇంకా బాగాచదివి ప్రవర్ధిష్ణువు కావాలి. కానీ, అక్కపెళ్లి చూడాల్సిందేనని పట్టుబట్టి మరీ వచ్చాడు. ప్చ్! నిద్ర వస్తోంది జాయా.." అన్నాడు ఆవులిస్తూ. ఆయన ముక్తసరిగా సంభాషణ ముగించి.. 'వెళ్లిపో!' అన్నట్లు మాట్లాడటం ఆశ్చర్యపరచింది. మరునాడు రాజనగరిలో వివాహానికొచ్చిన అతిథులకు నాట్య ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మొదటి ప్రదర్శనే జాయచోడుని నృత్తం. తొలి ప్రదర్శన కావడం.. అదీ జాయచోడుడు నర్తించనుండటంతో రాజనగరి నాట్యమండపం కిక్కిరిసిపోయింది.అందరూ ఆయన నృత్త విన్యాసాన్ని శారీరక కదలికలను విభ్రాంతితో చూస్తున్నారు. సాక్షాత్తూ నటరాజు కైలాసం వీడి అనుమకొండ వచ్చినట్లు.. ఆడుతున్నాడు జాయచోడుడు. కానీ, అతనిలో ఏకాగ్రత లేదు. భావప్రకటన విరుద్ధంగా ఉంది. పాద ముద్రలు తడబడుతున్నాయి. హస్తముద్రలైతే ఘోరం. కానీ, ప్రేక్షకులు ఎప్పటిలాగే విస్మయంతో చప్పట్లు కొట్టి ఆయనను అభినందనలతో ముంచెత్తారు. తీవ్ర విషాదంలో కూరుకుపోయాడు జాయచోడుడు. మొదటిసారి తను నృత్తంలో తప్పటడుగులు వేశాడు. నటుని తాదాత్మ్యత కోల్పోయాడు. విన్యాస విచిత్రాలకు మాత్రమే సాధారణ ప్రేక్షకులు మైమరుస్తారు. కానీ నాట్య ప్రవీణులు చూస్తే ముఖాన ఊస్తారు. పూర్తిగా ఘోరమైన మార్గినృత్తం. దీనికంటే ఓ మారుమూల పల్లెటూరిలో దేశీ ప్రదర్శన ఉత్తమం. తల వంచుకుని రంగమండపం దిగిపోతున్న జాయచోడుడు.. ప్రేక్షకుల్లో ఓ యువతి తనను పరికించి చూడటం గుర్తించాడు. ఎవరీమె? ఎక్కడో చూచినట్లు తెలుస్తోంది. ఎవరీమె.. ఎవరై ఉంటారు?.. ఆమె చేతులు జోడించి అభినందనగా చప్పట్లు చరచి తిరిగి చేతులు జోడించి నమస్కరించి అభినందనగా చూసి మాయమైంది.ఆ పిల్లను చూశాక అతని నృత్త విఫలత తాత్కాలికంగా పక్కకుపోయింది. ఎవరీ పిల్ల?! ఎక్కడ చూశాను అనే ఆలోచన పెరిగిపోయింది. వివాహం క్రతువు పదిరోజులు. ముందువెనకా సంబరాలు మొత్తంగా నెలరోజులు. ఇటు వియ్యాలవారి ఆచార వ్యవహారాలను సమాదరిస్తూ, అటు గణపతిదేవునికి, సోమలదేవికి సహకరిస్తూ శాస్త్రీయ వివాహతంతులలోనూ జాయచోడుడే. యువకులతో చెడుగుడు, యువతులతో పాత్ర గొండ్లి, గుర్రం భంజలి.. అందరినీ కలిపి బిళ్లంగోడు.. అలాగే యువతీ యువకులకు లాస్యనాట్యం, దండరాసకం నేర్పించి, ఆడించి, ఆడి, నాట్యం చేసి నవ్వించి కవ్వించి పెళ్లి వేడుకలను మరపురాని మధుర సంఘటనగా లిఖించాడు. అప్పగింతల వేళ రాజ ప్రాసాదమంతా ఉద్వేగపు కన్నీటిలో తడిసి ముద్దయ్యింది. సహజంగా స్త్రీలందరూ తీవ్రంగా దుఃఖిస్తున్నారు కానీ కాస్త ఎక్కువగా ఏడ్చింది మాత్రం నారాంబతోపాటు రుద్రమదేవుడు! వెక్కివెక్కి ఏడ్చిన ఏకైక మగాడు!! కానీ, మరి కొన్నిరోజులలో ఓ వార్త రాజధానిలో పుట్టి పెద్దలను భయవిహ్వలులను చేసింది. గణపతిదేవుని పెద్ద కుమారుడు.. యువరాజు రుద్రమదేవుడు ఆడమగ కానీ నపుంసకుడు!!

# ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా.. ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు

మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.



### దాహం పెరుగుతుంది

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

### నోటి దుర్వాసన దీని లక్షణమే..

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.

### మలబద్ధకం

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.


### ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

### ఒంటి నొప్పులు..

ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

# ప్రేమంటే ఏమిటంటే



'జనవరి జయం జయం.. ఫిబ్రవరి పెండ్లికి పిలుపు' అని చిన్నప్పటి గేయం. వాలంటైన్ పుణ్యమా అని ఫిబ్రవరి అంతా ప్రేమికుల మాసంగా మారిపోయింది. ఈ నెల కోసం యువత ఏడాదంతా ఎదురు చూస్తూ ఉంటుంది. ప్రేమను వ్యక్తం చేయడానికి, ప్రేమించిన వారితో సమయం గడపడానికి వాలెంటైన్ డేని చాలామంది ఓ ప్రత్యేకమైన సందర్భంగా భావిస్తారు. గిఫ్టులు, టూర్లు ప్లాన్ చేస్తారు. ఫిబ్రవరి 14వ తేదీ ఒక్కరోజులో ప్రపంచవ్యాప్తంగా కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. గులాబీలు, చాక్లెట్లు, ఖరీదైన బహుమతుల కొనుగోళ్లతో అన్ని షాపులు బిజీ బిజీ. మనిషిని ఇంతలా వశపరచుకుంటున్న ఈ ప్రేమ ఎక్కడ మొదలవుతుంది? ఎన్ని రకాలుగా ఉంటుందో.. తెలుసుకుందాం.పరీక్షలఅప్పుడెప్పుడో గజినీ సినిమాలో సూర్య, అసిన్ 'హృదయం ఎక్కడున్నది.. హృదయం ఎక్కడున్నది..' అంటూ ప్రేమ గీతం పాడుకుంటే అందరూ ఫిదా అయ్యారు. ప్రేమ మనిషిలో ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడానికి ఒక్కరూ ప్రయత్నించలేదు. సైకాలజిస్టులు మాత్రం ఈ అంశంపైన దృష్టి సారించారు. న్యూయార్క్‌లోని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మెడికల్ కాలేజ్‌కి చెందిన బినాక అస్విడో రొమాంటిక్ లవ్‌పై పరిశోధనలో భాగంగా ప్రేమ మెదడులో ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. ప్రేమలో ఉన్నవారికి ప్రేయసి లేదా ప్రియురాలు ఫొటో చూపించినప్పుడు మెదడులోని వెంట్రల్ టెగ్మెంటల్ ఏరియా (వీటీఏ), న్యూక్లియస్ అకమ్బన్స్, వెంట్రల్ పల్లిడియం, రఫే న్యూక్లియస్ ప్రాంతాలు ఉత్తేజితమయ్యాయని ఎఫ్.మ్యాగ్నెటిక్ రెజోనెన్స్ ఇమేజింగ్ ద్వారా తెలుసుకున్నారు.

### తొలి రోజుల్లో..

వెంట్రల్ టెగ్మెంటల్ ఏరియా రివార్డ్ సిస్టంలో కీలకమైన ప్రాంతం. నూతన ప్రేమికుల్లో ఈ ప్రాంతం బాగా ఉత్తేజితమవుతుందని పరిశోధనలో తేలింది. వెంట్రల్ పల్లీడియం, రఫే న్యూక్లియస్ ప్రాంతాలు 20 ఏళ్ల తర్వాత కూడా ఒకరి పట్ల ఒకరికి ప్రేమ ఉండటానికి కారణమని తెలుస్తుంది. వెంట్రల్ పల్లీడియం అటాచ్‌మెంట్ హార్మోన్లను విడుదల చేసి బంధం నిలబడేలా చేస్తుంది. దీర్ఘకాలిక ప్రేమికుల్లో రఫే న్యూక్లియస్ సెరటోనిన్ హార్మోన్ రిలీజ్ చేసి బంధంలో కుదురుకునేటట్టుగా చేస్తుంది. మనుషుల్లో ప్రేమ భావన పెంపొందడంలో మెదడులోని రివార్డ్ సిస్టం కీలక పాత్ర పోషిస్తుందని న్యూరోసైన్స్ చెబుతుంది. మెదడులోని హిప్పో క్యాంపస్, మీడియల్ ఇన్సుల, యాంటీరియర్ సింగ్లేట్ భాగాలు రివార్డ్ సిస్టంలో ప్రధాన పాత్ర పోషించి ప్రేమ అనే భావన వృద్ధి చెందేలా చేస్తాయని పరిశోధనలో తేలింది.

### కెమికల్ గడబిడ ..

ప్రేమ అనే ఫీలింగ్ కలిగినప్పుడు మెదడులో ఏం జరుగుతుందనే దానిపై హార్వర్డ్ మెడికల్ కళాశాల శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. మెదడులో విడుదలయ్యే కొన్ని రసాయనాల ఫలితమే ప్రేమ అని తేల్చి చెప్పారు. ప్రియురాలితో చూపు కలవగానే మెదడులో ఫినెల్ తలామిన్ అనే రసాయనం విడుదలవుతుంది. అరచేతుల్లో చెమట పట్టడం.. మోకాళ్లు వణకడం ఈ హార్మోన్ ప్రభావమే. ఈ లవ్ మాలిక్యూల్ కొద్ది మోతాదులో చాక్లెట్‌లా ఉంటుంది. అందుకనే వాలంటైన్ రోజు చాక్లెట్ల అమ్మకాలు ఊపందుకుంటాయి. ఒక మనిషిపై వ్యామోహం కలగడానికి మెదడు విడుదల చేసే అడ్రినలిన్, డోపమైన్, నారెఫినెఫ్రిన్ హార్మోన్లే కారణం. నచ్చినవారి చూడగానే శరీరంలో ఈ హార్మోన్లు విడుదలై అనేక స్పందనలు కలిగిస్తాయి. అందుకే ప్రేమికులు గంటల కొద్దీ కబుర్లు చెప్పుకొంటారు. ప్రపంచాన్ని మర్చిపోతారు. ఈ దశలో వీరిలో ఆక్సిటోసిన్ అనే హార్మోన్ రిలీజ్ అవుతుంది. దీని ప్రభావంతో ఒకరిని ఒకరు టచ్ చేయాలని, హగ్ చేసుకోవాలని అనిపిస్తుంది. ఈ హార్మోన్ల ప్రభావం 3 నెలల నుంచి 18 నెలల వరకూ ఉంటుంది. ఆ తర్వాత కూడా ప్రేమ ప్రయాణం దీర్ఘ కాలం కొనసాగితే వాసోప్రెసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది ఇద్దరి మధ్య బంధం మరింత బలపడటానికి దోహదపడుతుంది.


### ఏడు రంగుల వాన

నేటి యువత ప్రేమ అని అనుకుంటున్నది ప్రేమ కాదు. కేవలం వ్యామోహం మాత్రమే. నిజమైన ప్రేమ అంటే ఏమిటో సైకాలజిస్ట్ స్టర్న్ బెర్గ్ తన త్రిముఖ ప్రేమ సిద్ధాంతంలో వివరించారు. ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉన్నట్టే ప్రేమకు మౌలికాంశాలు అయిన సాన్నిహిత్యం, వ్యామోహం, నిబద్ధతల కలయికలతో ఏడు రకాల ప్రేమలు పుడతాయని ఆయన వివరించారు. లైకింగ్, ఇన్ ఫ్యాట్, లవ్, ఎంప్టీ లవ్, రొమాంటిక్ లవ్, కంపానియట్ లవ్, ఫటస్ లవ్, కంజుమేటివ్ లవ్ అని ఏడు రకాల ప్రేమలు ఉంటాయని వివరించారు. వీటన్నిటిలోనూ కంజుమెట్ లవ్ అనేది అతి ముఖ్యమైనది. నేటి యువత రొమాంటిక్ లవ్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. అది పరిపూర్ణమైన ప్రేమ కాదు. సాన్నిహిత్యం, వ్యామోహం, నిబద్ధత కలగలిసిన ప్రేమే నిజమైనది, శాశ్వతమైనది. దాన్ని సాధించడం ఎంత కష్టమో, నిలుపుకోవడం కూడా అంతే కష్టం. ప్రేమ స్వరూపాన్ని, పరిపూర్ణత్వాన్ని అర్థం చేసుకున్న వారికి అది ఒక ఎమోషన్‌లా కాకుండా, మోటివేషన్‌లా పనిచేస్తుంది. ప్రేమ సఫలమైనా, విఫలమైనా జీవితంలో ముందుకు తీసుకువెళ్తుంది.

రమాయణం

# అమ్మగార్లు.. అయ్యగార్లు

మొదట్లో మా ఇంట్లో వంటకు అయ్యగారు ఉండేవారు. అయితే, మేము మిడిల్ స్కూల్‌కు వచ్చేసరికి అమ్మే వంట చేసేది. ఏరోజూ ఏడెనిమిది మందికి తక్కువ కాకుండా తను వండాల్సి ఉండేది. అయినా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వంటల కోసం అయ్యగార్లు, అమ్మగార్లూ వచ్చేవారు. 'ఆడ ఇక మా నాన్న తన అమ్మమ్మకూ, తాతయ్యకూ దత్తపుత్రుడు కనుక వాళ్లిద్దరికీ తద్దినాలు పెట్టేవాడు. అది చాలా ఖర్చు, శ్రమతో కూడిందైనా, నాన్న తన ఎనభై మూడో ఏట చనిపోయేదాకా.. సుమారు తన పద్నాలుగో ఏట నుంచీ.. అంటే డబ్బై ఏళ్లపాటు ఎంతో శ్రద్ధగా ఆబ్దికాలు పెట్టేవాడు. "ఎందుకు నానా ఈ తద్దినం పెట్టడం?!" అని ఓసారి అడిగాను. దానికి నాన్న ఎంతో ఓపిగ్గా.. "మనం రోజూ అన్నం తింటం గద! మరి పై లోకానికి పోయినోళ్లకు ఎవరు పెడతరు?! మనకు ఒక సంవత్సరం అయితె వాండ్లకు ఒకరోజు అన్నట్టు. అందుకోసం వాండ్లకు ఏడాదికొక్కసారి పిండాలు పెట్టాలె. దాన్ని కాకులకో, పక్షులకో పెడుతం. వాండ్లు పక్షుల రూపంల ఒచ్చి తినిపోతరని, అట్ల వాండ్ల దీవెనలు ఉంటయని పెద్దవాండ్ల నమ్మకం!"



అని చెప్పాడు. అట్లాగే ఇంకోమాట కూడా చెప్పాడు.. "పెద్దవాండ్ల విశ్వాసం కోసం అది చెయ్యాలె. ఆ పేరుతోటి ఆరోజు ఒక పదిమంది ఆకలితోటి ఉన్నవాండ్లకు భోజనం పెడితే బాగుంటదని నాకనిపిస్తది".. ఆ మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. వారం ముందే ఓ జీతగాడిని వెంటపెట్టుకుని వెళ్లి కిరాణా సామాను తెచ్చేవాడు నాన్న. అప్పుడే కాదు.. నాన్న ఎప్పుడు ఇంట్లోకి సామాను తెచ్చినా నాకూ, అక్కకూ చెరో బిస్కట్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చేవాడు. మేము వాటికోసమే ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవాళ్లం. అదే మాకు చాలా గొప్ప ఔట్ సైడ్ ఫుడ్. అదికూడా తరచుగా ఉండేది కాదు. ఏదైనా ఇంట్లో చేసింది తినడమే! తద్దినం రోజు ఏడింటికల్లా మా పక్కఊరు చాగల్లు నుంచి సింహయ్యగారు, ఆయన కొడుకు కేశవయ్యగారు వచ్చేవారు. ఆరోజు వీలైనంత వరకూ నేను బడి ఎగ్గొట్టడం తప్పనిసరి అని వేరే చెప్పక్కర్లేదుగా! వాళ్లు వస్తూనే మడిపంచెలు కట్టుకుని వంటింట్లో దూరేవారు. అమ్మకు ఒక్క వంట తప్పేది కానీ, మిగతా అన్ని పనులూ పెరిగేవి. ఓ పది రకాల వంటకాల కోసం బోలెడు కూరగాయలు కోసి, మిగతా వంట సామానంతా సిద్ధం చేసి ఉంచేది. వాళ్లు పిలిస్తే చాలు.. "ఏం గావాలె అయ్యగారూ!" అంటూ సిద్ధంగా ఉండేది. దగ్గరి మూడు కుటుంబాల బంధువులు భోజనాలకు వచ్చేవారు. ఇంకా పదిమంది దాకా పనివాళ్లకు, ఆరోజున ఎందరొస్తే అందరు బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టడం అమ్మవంతే అయ్యేది. మేము కాస్త పెద్దయిం తరువాత వడ్డనలు చేసేవాళ్లం. అప్పుడు గ్రైండర్లు, మిక్సర్లు లేవు గనుక.. అయ్యగార్లు పెద్దరోటి ముందు కూచుని పప్పు రుబ్బేవారు. వాళ్లు చేసే గారెలు భలే రుచిగా ఉండేవి. మమ్మల్ని వంట చేసేటప్పుడు ఆ దరిదాపులక్కూడా రానిచ్చేవారు కాదు. మాకేమో మగవాళ్లు ఎలా వండుతారో చూద్దామని కుతూహలం. "ఇటు దిక్కు రావొద్దు.. మడి!" అనేవారు. ఇంకొక బ్యాచ్ బ్రాహ్మలు వచ్చి ఏవో మంత్రాలు చదివి నాన్నచేత తద్దినం పెట్టించేవారు. తరువాత అందరం వరుసగా కింద చిన్న చాపల మీద కూచొని.. ముందు విస్తర్లు పరుచుకుని ఉంటే, వాళ్లే వడ్డన చేసేవారు. సింహయ్య గారు అప్పటికే చాలా పెద్దాయన. ఆయనకు వంగడం వచ్చేది కాదు. అన్నిటినీ నిలబడే అంతెత్తునుంచి తపుక్కున విస్తట్లో వేసేవాడు. అయినా మేము భయంతో ఏమీ అనేవాళ్లం కాదు. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కేశవయ్యగారు కూడా వచ్చేవాడు. నాన్న చనిపోయాక ఇక మా పుట్టింట్లో తద్దినాలు పెట్టడం ఆగిపోయింది. కొన్నాళ్లకు కేశవయ్యగారు మంచాన పడ్డాడని తెలిసి వెళ్లి చూసొచ్చాను. ఆయన పోయినా ఇప్పటికీ ఆ కుటుంబంతో టచ్‌లోనే ఉన్నాం. మా చిన్నప్పుడు కూనూరు నుంచి లక్ష్మయ్యగారు, వాళ్లన్నయ్య మత్స్యయ్యగారు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. "గీ మత్స్యయ్య ఏం పేరు? గీయిన మనిషే గద.. చేప పేరు పెట్టుకున్నడేంది?!" అని అమ్మను అడిగాను. "నీకు కోతి మాటలు బాగ ఎక్కువయినయ్! శ్రీ మహావిష్ణువు దశావతారాలల్ల మొదటిది ఏంది?!" అన్నది అమ్మ. నాకు ఠక్కున గుర్తొచ్చింది. "తిరుపతి, యాదగిరి, సింహాచలం.. అని దేవుని గుళ్లుండే ఊరి పేర్లు పెట్టుకున్నట్టే.. మత్స్యగిరి, వరాహగిరి, కూర్మనాథం అని కూడా పెట్టుకుంటరు" అన్నది అమ్మ. అప్పుడర్థమైంది. ఇంతకూ ఈ మత్స్యయ్యగారి గురించి చెప్పొచ్చేదేంటంటే.. ఈయన ఎప్పుడూ మా అక్కాచెల్లెళ్లిద్దరి మధ్యలో ఏదోఒక గొడవో, పోటీనో పెట్టి తమాషా చూద్దామనుకునేవాడు. మేమేం తక్కువా?! ఆదర్శ అక్కాచెల్లెళ్లం మరి! మాకు పెద్దగా కొట్లాటలే వచ్చేవి కావు. ఆయన మా పుట్టినరోజులు గుర్తు పెట్టుకుని ఒకరోజు ముందుగానే వచ్చేవాడు. పుట్టినరోజంటే పెద్దగా కేక్ కట్‌చేయడం, స్నేహితుల్ని పిలవడం, సెలెబ్రేట్ చేయడం లాంటివి మాకు తెలియదు. ఆరోజు తలంటు పోసుకోవడం, ఉన్నంతలో కొత్త బట్టలు వేసుకోవడం చేసేవాళ్లం. అమ్మ ఏదైనా స్వీట్ చేసేది. ఈ మత్స్యయ్యగారు రాగానే.. "పోయినేడు మీ చెల్లె పుట్టినరోజుకు లడ్డూలు చేయించింది అమ్మ. మరి నీ పుట్టిన్రోజుకు ఏం చెయ్యాలె చెప్పు?! మీ అమ్మను అడుగు" అంటూ అక్కను రెచ్చగొట్టేవాడు. ఇక అక్క లడ్డూలు చేయించమని అమ్మ వెంటపడేది. ఆ తరువాత వచ్చే నా పుట్టినరోజు కూడా అంతే! "మీ అక్క పుట్టినరోజుకు లడ్డూలు చేసిన్రు. నీకు గూడ గవ్వే అయితె ఏం బావుంటది?! మంచిగ మైసూర్ పాక్ చేయించుకో.. అమ్మ తోటి చెప్పుపో!" అనేవాడు. "ఏం జెయ్యాల్నో అమ్మకు తెల్సు" అనేదాన్ని నేను. ఈయన కథ ఇలా ఉంటే.. అప్పుడప్పుడూ మా ఇంటికి కూనూరు నుంచి అండమ్మగారూ, లక్ష్మయ్యగారూ వచ్చేవారు. వాళ్ల ముచ్చట్ల గురించి వచ్చేవారం చెప్పుకొందాం!

# జెలెన్‌స్కీ హీరో కాదు, జీరో

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంపుకీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకీ మధ్య వాషింగ్టన్ ఓవల్ ఆఫీసులో జరిగిన వాగ్యుద్ధం ఒక ప్రపంచ సంచలనం అయింది. యూరపున్కైతే అది కుదిపేసింది. ఇటీవల అమెరికా పాలకుల స్వభావం మారలేదు కాని వారి ఎత్తుగడలలో చీలిక వచ్చింది. అమెరికా తన లక్ష్యాలను తిరిగి వేరుగా నిర్వచించుకోవాలి అన్న ధోరణికి ప్రతినిధి డొనాల్డ్ ట్రంప్. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మాటల్లో చెప్పాలంటే, "నగరానికి కొత్త షెరీఫ్ వచ్చాడు." అంటే రంగంలోకి ట్రంప్ వచ్చాడు. ట్రంప్ వచ్చీ రాగానే అమెరికా పాత ఏర్పాటుని మార్చే పనిని హడావుడిగా మొదలుబెట్టేసాడు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక రంగాలలో ఈ డబడబలూ పెను కంపాలు అందుకే. రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుంచీ ప్రపంచంలో తిరుగులేని ఆర్థిక శక్తిగానూ సైనిక శక్తిగానూ ఏపుగా ఎదుగుతూ వచ్చిన అమెరికా ప్రపంచానికి పెద్దన్న అయింది. ఇప్పుడు అమెరికా ఆటలకి అడ్డుకట్ట వేసే శక్తులు క్రమంగా రంగంలోకి వచ్చాయి. చైనా ఒక కొత్త సామ్రాజ్య శక్తిగా, ఆర్థిక శక్తిగా సవాలు విసురుతోంది. రష్యా కొంత కోలుకొని నిలబడింది. మరోవైపు అమెరికా ఆర్థిక పతనం పుంజుకొంటోంది. అమెరికా జాతీయ రుణం 36 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెరిగింది.ఈ సందర్భంలో తమ పాత ఏర్పాటుకి కాలం చెల్లిందనీ, మరో కొత్త "ఏర్పాటు" అవసరమనీ ట్రంపు వర్గం భావిస్తోంది. ఓవల్ ఆఫీసు డ్రామా తర్వాత, జెలెన్‌స్కీని హీరోగా చూపించే కథనాలు వచ్చాయి. నిజానికి, ఒక పెద్ద ఆటలో జెలెన్‌స్కీ ఒక చిన్న బుడంకాయ. ఈ బుడంకాయకు భవిష్యత్తు లేదు. అతడు అమెరికా, యూరపు నాయకుల రాజకీయ క్రీడలో ఒక పావు మాత్రమే. అతనికి ఒక స్వతంత్ర పాత్ర ఏదీ లేదు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలైన నాటి నుంచీ, ఈ బంటుని యూరపు అమెరికాలు బాగానే మేపుతూ వచ్చాయి. నాటో దేశాల్లో ఎక్కడికెళ్లినా అతడికి డబ్బూ ఆయుధాలూ ఇచ్చి బుజ్జగించారు. ఈ గారాబం జెలెన్‌స్కీ తలకెక్కింది. ట్రంప్ వచ్చాక అదంతా మారిపోతోంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కావడానికంటే ముందే రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ కుదేలయిపోయింది. ఉక్రెయిన్ వాస్తవ పరిస్థితి తెలిసిన నిపుణుల మాట ఇది. ఆ సంగతి జెలెన్‌స్కీకి తెలుసు. అయితే తన కుక్క చావుని, ప్రపంచానికి ఒక వీర మరణంగా చూపించాలన్న కోరిక కూడా ట్రంప్ ముందు అతని కుప్పిగంతులకు మరో కారణం. మరో విశేషం: సమావేశాన్ని రద్దు చేద్దామని ట్రంప్ ముందు జెలెన్‌స్కీకి కబురుచేశాడు. కాని జెలెన్‌స్కీ మాత్రం వస్తానని పట్టుబట్టాడు. అప్పుడు, జెలెన్‌స్కీ వచ్చేది, కేవలం తమ ఉమ్మడి ఒప్పందం మీద సంతకం చేయడానికి మాత్రమే అని ట్రంపు బహిరంగ ప్రకటన చేశాడు.అంతవరకూ ఉక్రెయిన్‌కి అందించిన భారీ "సాయా"నికి గాను, ఉక్రెయిన్ తన ఖనిజ సంపదపైన వందేళ్ల పాటు అమెరికాకు హక్కులు కల్పించాలి అన్నదే ఒప్పందం. తామిచ్చిన సాయం 350 బిలియన్ డాలర్లని ట్రంప్ చెప్పాడు. సామ్రాజ్యవాదుల "సాయం" మరి అలాగే ఉంటుంది. ఈ ఘోరమైన ఒప్పందం గురించి సమావేశానికి ముందే జెలెన్‌స్కీకి తెలుసు. ఓవల్ ఆఫీసులో కెమేరాల ముందు అతడు ఒక క్షతగాత్రుడిలా డ్రామా ఆడాడు. అక్కడ ఒక దేశ భక్తునిగా, తన దేశం కోసం ట్రంపునయినా ఎదుర్కోగల వీరునిగా అవతారం ఎత్తాడు. ఇప్పుడు ట్రంపుని మంచి చేసుకోడానికి నానా తంటాలు పడుతున్నాడు. ఖనిజ సంపదపై అమెరికాకు హక్కులు రాసివ్వడానికి, దేశాన్ని తాకట్టు పెట్టడానికి అతడు సిద్ధమే. అయితే, యుద్ధం ఆగకూడదు, తన పదవి ఊడగూడదు. ఎంతకాలం? రష్యాని ఓడించే దాకా. అది సాధ్యమా? ఈ ప్రశ్న ఒక రిటైరైన అమెరికా కల్నల్‌ని అడిగితే, ఆయన నవ్వకుండా చెప్పిందిది: రష్యన్లందరూ ఓ ఉదయం లేవగానే నడవడం ఎట్లాగో మర్చిపోతే, అది సాధ్యం. యుద్ధం కొనసాగితే జనం అన్యాయంగా చచ్చిపోతూనే ఉంటారు. ముఖ్యంగా ఉక్రెయిన్ జనం. యుద్ధం ఆగిపోతే నాశనమయ్యేది, జెలెన్‌స్కీ, అతని ముఠా మాత్రమే. ఉక్రెయిన్‌లో మార్షల్ లా కొనసాగుతోంది. ఎన్నికలు సక్రమంగా జరిగితే జెలెన్‌స్కీ చిత్తుగా ఓడిపోవడం ఖాయం. అందుకే అతడు ఎన్నికలకు వెళ్లడు. మార్షల్ లా పొడిగిస్తాడు. ఎన్నికలు జరపక తప్పని పరిస్థితి ఎదురైతే వాటిని సక్రమంగా జరగనీయడు. ప్రపంచాన్నంతా అదుపు చెయ్యాలన్న తన పాత ధోరణిని వదులుకోక తప్పదని ట్రంప్ దళం గ్రహించింది. ఇకముందు సమ ఉజ్జీలతో దీర్ఘ కాలంపాటు సాగే యుద్ధాల్లో అది ఇరుక్కోకపోవచ్చు. తాను కొడితే తిరిగి కొట్టలేని అర్భకుల మీద దాడులకే అది పరిమితం కావచ్చు. ఈ క్రమంలో జెలెన్‌స్కీ లాంటి పెంపుడు కుక్కల్ని తగ్గించుకొని వాటిపై గతంలో పెట్టిన మదుపుని వడ్డీతో సహా వెనక్కి తీసుకోవాలనుకోవచ్చు.యూరపుని కూడా అది తన ప్రాధమ్యాల నుంచి తొలగించవచ్చు. జెలెన్‌స్కీ ట్రంపుని కలవడానికంటే ముందే ఫ్రెంచి అధ్యక్షుడు మాక్రాన్, బ్రిటిషు ప్రధాన మంత్రి స్టార్మర్ ఒకరి తరవాత ఒకరు ట్రంపుని కలిశారు. వారి లక్ష్యం: యూరపు భద్రతకి, వారి శాంతి దళాల భద్రతకీ అమెరికా హామీ ఇవ్వాలిబీ రష్యా కొమ్ములు విరగ్గొట్టాలి. ఈ నాయకులకు కావల్సింది శాంతి కాదుబీ యుద్ధం. అందుకు అమెరికా నడుం బిగించాలి. రష్యాతో పోరాటంలో తమల్ని ముందుండి నడపాలని వారు కోరినప్పుడు, ట్రంపు వారి సైనిక శక్తిని పొగిడి వారికి అమెరికా అవసరం లేదనీ, వారే స్వయంగా రష్యాని ఎదుర్కోగలరని చెప్పి చేతులు దులుపుకొన్నాడు. ఒక బ్రిటిషు విలేఖరి వ్యాఖ్యానించినట్టుగా అంతవరకూ "రాజుగారి విదూషకుల్లాగా" ప్రవర్తించిన ఆ ఇద్దరు యూరపు నాయకులూ ట్రంపు మాటలకి ఏడవలేక నవ్వారు. అమెరికాకి ఇప్పుడు చైనాని నిరోధించడమే ప్రధానం. అమెరికా తన సొంత సహజ సరిహద్దుల్లో, సుస్థిరం కావాలనుకొంటోంది. సహజ సరిహద్దులు అంటే, కెనడా, మెక్సికో, గ్రీన్‌లాండు, పనామా కెనాల్ తదితరాలు. ఇక, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మాటకొస్తే, ఇప్పటికే రష్యా దాదాపు జయించింది అన్నది నిపుణుల అంచనా. ఉక్రెయిన్ భూభాగాలను రష్యా ఎంత ఆక్రమించింది అన్నది ఇక్కడ గీటురాయి కాదు. అది ఉక్రెయిన్ సైనికశక్తిని ఎంత నిర్వీర్యం చేసింది అన్నదే ప్రధానం. ఇప్పుడు ఉక్రెయిన్‌కి రిజర్వు దళాలు అంతమైపోయాయి. రిజర్వు ఆయుధాలూ లేవు. సైనికుల ఆత్మస్థయిర్యం అత్యంత దిగువ స్థాయిలో ఉంది. ప్రజల్లో యుద్ధ విముఖత భారీగా పెరిగింది. జెలెన్‌స్కీ ఓ రాజకీయ జూదరి. తాజా కుర్స్క్ యుద్ధంలో అతడి నడ్డి విరిగింది. యుద్ధ రంగం వదిలిపోతున్న ఉక్రెయిన్ సైనికుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పుడు, అమెరికా కూడా తన కాడి కింద పడేసింది. యూరపు దేశాలు మాత్రం మాటల్లో సంఘీభావం ప్రకటించాయి. పాత వార్సా దేశాలైన పోలెండు, మూడు బాల్టిక్ దేశాలతో పాటు స్కాండినేవియన్ దేశాలు కూడా ఉక్రెయిన్‌కి సంఘీభావం తెలిపాయి. ఈ "సంఘీభావాల"న్నీ కలిసినా అంతిమ ఫలితాన్ని మార్చలేవు. ట్రంపుతో చర్చల్లో నెల రోజుల యుద్ధ విరమణకి అంగీకరిస్తూనే, యుద్ధానికి గల మూలకారణాలను తొలగించమంటున్నాడు పుతిన్. అంటే, నాటో సంగతి తేల్చమంటున్నాడు. అంతే కాదు. ఉక్రెయిన్‌కి, విదేశీ సహాయం – ఆయధాలు, డబ్బు, గుప్త సమాచారం వగైరాలు – ఆగిపోవాలి, అంటున్నాడు. పక్క నుంచి జెలెన్‌స్కీ గుండెలు బాదుకుంటూ ఏదో అరుస్తూనే ఉన్నాడు. వినేవాడే లేదు.

# అంకెలతో కూడా అబద్ధాలేనా?



కాంగ్రెస్ తలచుకుంటే కానిదేముంటుంది? అందులోనూ అది రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అయినప్పుడు. మన మామూలు ఇంద్రియాలకూ.. వాటికి అందే లెక్కలకూ.. రెండు రెండ్లు అంటే నాలుగు అని అర్థం. లేదు 10 ం10=20 అనేది నిజం. కానీ, సాధారణ గణితశాస్త్ర సూత్రాలకు ఆవల, అబద్ధాల ఫ్యాక్టరీలో మరో తర్కం ఉన్నది. సంవత్సరం తరబడి.. ఆ మాటకు వస్తే మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు అనేక మాసాల ముందునుంచి గంటకో రకంగా మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల గురించీ, సృష్టించిన ఆస్తుల గురించి అతిశయోక్తులు, అంతులేని అబద్ధాలు మాట్లాడుతూ నడిపిన కుతర్కంతో కాంగ్రెస్ పార్టీని రేవంత్ అధికారంలోకి తెచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చాక కూడా అదే వ్యక్తిత్వం ఆయనను విడదీయలేని నీడగా వెంటాడుతూనే ఉన్నది.రైతు బంధును, రైతు భరోసాగా మార్చి కేసీఆర్ ఇస్తున్న రూ.10 వేల బదులు తాను రూ.15 వేలు ఇస్తానంటూ ఆకాశంలో మబ్బులు చూసి ముంత పారబోసుకునేలా పేద రైతులను మభ్యపెట్టారు. కాగా, నేడు అధికారంలో కూర్చున్నాక, తన రెండో బడ్జెట్‌లో – రూ.15 వేలు కాదు తూచ్, రూ.12 వేలతో సర్దుకోండంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మరి ఆ మాటకు వస్తే, స్వయంగా కేసీఆరే తిరిగి ఎన్నికల్లో అధికారంలోకి వస్తే తామే స్వయంగా రైతుబంధు డబ్బును రూ.12 వేలకు పెంచుతామంటూ చేసిన వాగ్దానాన్ని ఇక్కడ ఒకసారి గుర్తుచేసుకోవచ్చు. కానీ, అదనంగా మరో రూ.3 వేలకు రేవంత్ చేసిన వాగ్దానం నేడు తెలంగాణ కొంప ముంచింది.అలాగే, అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న (2023) రూ.2 లక్షల మేరకు రైతు రుణమాఫీ చేస్తానంటూ మరో వాగ్దానం చేశారు రేవంత్. అది చాలదన్నట్టు, రుణమాఫీ చేస్తున్నాను కనుక వీలైతే వెళ్లి బ్యాంక్‌లో అప్పు తీసేసుకోండి అంటూ రైతులకు ఉచిత సలహాలు ఇచ్చారు. ఇక వీటితో పాటుగా ఆరు గ్యారెంటీలతో తెలంగాణ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. చివరికి నేడు బడ్జెట్ మీద బడ్జెట్ పడుతున్నా, జనాల ఆశలు అడియాసలుగా మిగిలిపోతున్నాయి. ఆకాశంలో మబ్బులు చూసి ముంత పారబోసుకున్న విధంగా నేడు తెలంగాణ పేద రైతు పరిస్థితీ.. ముసలి పింఛనర్ల దుస్థితి, నిరుద్యోగ యువకుల జీవితాలు మిగిలిపోయాయి.వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ చరిత్రే మాయ మాటలు.. మభ్య పెట్టడంతో సాగింది. దీనికి తార్కాణమే, 1960లోనే, నాటి సోషలిస్ట్ నాయకుడు రామ్‌మనోహర్ లోహియా కాంగ్రెస్ పార్టీ గురించి చెప్పిన మాటలు 'తక్షణ ప్రయోజనాలను పొందటానికి దీర్ఘకాలిక పర్యవసానాలను లెక్కచేయనితనం కాంగ్రెస్ పార్టీది'. అదీ కథ. అంటే, అధికారం కోసం అడ్డదారులు తొక్కడం కాంగ్రెస్ పార్టీకి షరామామూలే. ఇదంతా పాత కథ. ఈ కథ తాలుకు ప్రస్తుత ఎపిసోడ్‌లో రాహుల్ నేతృత్వంలో రాష్ట్రానికి ఓ రకంగా, 5, 6, 7, రకాలుగా గ్యారెంటీలు ఇచ్చుకుంటూ కాంగ్రెస్ రథం కదులుతుంది. కానీ, ఇటు తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అటు కర్ణాటకలో 5 గ్యారెంటీలు ఇచ్చారు. కానీ, అమలు జరుగుతున్న దాఖలా లేకే ఆఖరికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్వయంగా ఈ గ్యారెంటీల వ్యవహారం ఏమీ బాగున్నట్టు లేదంటూ మొన్నీ మధ్య ముక్తాయించారు. అంటే, కాంగ్రెస్ పెద్దాయనకే, ఆ పార్టీ నేతల అబద్ధాలు వెగటు పుట్టే స్థాయికి చేరుకున్నాయి. ఇక ప్రస్తుతం ఈ అబద్ధాలకు, గంట క్రితం తానేం మాట్లాడాడో కూడా మర్చిపోయే సత్తా ఉన్న మన ముఖ్యమంత్రి శక్తి సామర్థ్యాలు తోడయ్యాయి. ఇంకేం కథ రక్తసిక్తమవుతుంది. తెలంగాణ ప్రజల కష్టాలు, కన్నీళ్లతో నేడు మరోసారి ఈ నేల తల్లడిల్లుతుంది.ఈ కారణం చేతనే, నేడు దేశంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా కేవలం 15 నెలల్లోనే.. ఆ మాటకు వస్తే మొదటి ఆరు నెలల లోపే జనాల ఆగ్రహానికి.. అసహ్యానికి, వ్యతిరేకతకు ఈ ప్రభుత్వం లక్ష్యమైంది. ఈ క్రమంలోనే నిన్నా మొన్నటి బడ్జెట్‌లో కూడా మరుగుజ్జులు వెంపలి చెట్టుకు నిచ్చెనలు వేసినట్టు ఒక ప్రక్కన గతేడాది బడ్జెట్ తాలూకు రూ.2,91,000 కోట్లలోనే రూ.71,000 కోట్ల మేరకు కోత పడిందని చెప్పుకొంటూనే అంటే గతేడాది బడ్జెట్ అసలు సైజు రూ.2,20,000 కోట్లు అంటూనే, మరో ప్రక్కన నేడు రూ.3,04,000 కోట్ల సూపర్ సైజ్‌తో రికార్డ్ స్థాయి బడ్జెట్‌ను వేసిన దుస్సాహసం ప్రభుత్వానిది.దీనికిముందు మరో విషయం – 2024లో బడ్జెట్ వేసే క్రమంలో –అంతకుముందరి టీఆర్ఎస్ బడ్జెట్‌ను విమర్శిస్తూ ఆ బడ్జెట్‌లు వాస్తవానికి దూరంగా ఉన్నాయనీ, అవి తాము వేసిన అంచనాలను చేరుకోలేకపోయాయని రేవంత్ ప్రభుత్వం విమర్శించింది. దీనిలో భాగంగానే, కేంద్రం నుంచి వచ్చే గ్రాం ట్ అంచనాలు. కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని, అతిగా అంచనా వేసుకున్నదని.. అటువంటి పొరపాట్లు తాము చేయబోమని రేవంత్ రెడ్డి చెప్పుకున్నారు. ఉన్నది ఉన్నట్టు మధింపు చేసుకుని వాస్తవాలకు అనుగుణంగా, అతిశయోక్తులు లేకుండా బడ్జెట్ ప్రవేశపెడుతామంటూ చెప్పుకొన్నారు. కాగా, ఈ 15 నెలల కాలంలో ఏ అంచనాను కూడా సరిగా వేయలేక పోవడమే కాకుండా కేసీఆర్ సాధించిన విజయాలను కూడా నేడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వపక్షం చేస్తుంది. ఫలితంగానే నేడు తెలంగాణలో తిరిగి రైతు ఆత్మహత్యలు, చేనేత కార్మికుల కడగండ్లు, నిరుద్యోగ యువతకు ఉపాధి వ్యథలు, దగాపడ్డ మహిళల దిక్కుతోచని స్థితి కనపడుతున్నాయి.దీనంతటిలో భాగంగానే, నేడు ఈ బడ్జెట్ 6 గ్యారెంటీలకు కేవలం రూ.59,000 కోట్ల చిల్లర కేటాయించి, పండుగ చేసుకోండి అంటూ జనాలకు సెలవిస్తున్నది. కాగా, గత బడ్జెట్‌లో ఈ గ్యారెంటీలకు రూ.53,000 కోట్ల మేర కేటాయించారు. దీనినైనా పక్కాగా బడ్జెట్‌లో గ్యారెంటీలకు ఖర్చుపెట్టిన దాఖలాలు లేవు. వాస్తవంలో ఇప్పటికీ అమలు జరిగిన గ్యారెంటీ ఏదైనా ఉందంటే 'అది కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే. %–% మిగతా పథకాలన్నీ, అరకొరగానో.. అసలు అమలుకాకుండానో మిగిలిపోయాయి.అదేమిటని ప్రశ్నిస్తే, కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసి పోయిందంటూ అబద్ధాల పరంపరలో మరో అబద్ధం రేవంత్ రెడ్డి సొంతం. అయితే, అసెంబ్లీ సాక్షిగా నాడు కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులంటూ శ్వేతపత్రాన్ని విడుదల చేసిన నాడూ.. నాటి నుంచి నేటి వరకూ అసెంబ్లీలోనూ బయట, పదే పదే అదే అబద్ధాన్ని వల్లె వేసినాడు కూడా. ఆర్బీఐ, కాగ్ అధికారిక గణాంకాలను ఉటంకిస్తూ ఎన్నిసార్లు, ఈ ఆరోపణలకు జవాబు చెప్పినా తగ్గేదేలే అన్నది రేవంత్ తీరు. విషయం జనాలకు అర్థమైందని కూడా, బహుశా ఆయన గ్రహిస్తున్నట్టు లేరు. ఏకపక్షంగా తన ధోరణిలో తాను తిట్ల దండకంతో కలగలుపుతూ అంకెల అబద్ధాల కషాయాన్ని కూడా ఇంకా జనం గొంతులో పోయాలని ఆయన చూస్తున్నారు. అదీ ఇదీ అని కాదు, ఇచ్చిన ఏ వాగ్దానాన్ని కూడా నిలబెట్టుకోని రేవంత్ కాంగ్రెస్ ప్రస్తు తం బీసీ జనోద్ధరణకు కులగణన చేశానంటూ, చెప్పుకుంటూ.. ఆ సర్వే నివేదిక సిరా చుక్కలు ఇంకా ఆరకముందే బీసీలను దగా చేస్తూ, ఈ బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేవలం రూ.11,000 కోట్లకు కొద్దిగా పైనే కేటాయించింది. కాగా, గత సంవత్సరం బడ్జెట్‌లో ఈ కేటాయింపు రూ.8 వేల కోట్లు మాత్రమే. ఇక ఇప్పుడు గుర్తుచేయాల్సిన హైలైట్ 'కామారెడ్డిలో.. బీసీ డిక్లరేషన్ పేరిట ప్రకటించిన బీసీలకు ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ.20,000 కోట్లు కేటాయిస్తామన్న వాగ్దానాన్ని. అంటే, వాగ్దానాన్ని గత బడ్జెట్‌లో కాక, ప్రస్తుతం బీసీల కోసం కులగణన పూర్తిచేయాలని చెప్తున్న ఈ బడ్జెట్ ముంగిటిలో కూడా పరిహాసమే చేశారు. అదీ విషయం.మరో అంశం నిరుద్యోగ భృతికి సంబంధించినది. ఖమ్మం యూత్ డిక్లరేషన్ పేరిట –నిరుద్యోగ యువతకు భృతి కింద రూ.4 వేలు ఇస్తామంటూ స్వయానా ప్రియాంకా గాంధీ ప్రకటించి వెళ్లారు. అయితే, అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే మన భట్టి విక్రమార్క గారు నిరుద్యోగ భృతి ఇస్తమని చెప్పలేదని ముక్తాయించి ఊరుకున్నారు. వాగ్దానభంగాల పరంపరలో ఇదో మైలురాయి. అయితే, నిరుద్యోగ యువత అందరి సంగతి ఏమో కానీ, మా కార్యకర్తలకు మాత్రం న్యాయం చేస్తామంటూ రాజీవ్ యువ వికాసం పేరిట, సోనియాగాంధీని మెప్పించే పథకం ఒక దానిని ప్రస్తుత బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు.కాకపోగా, అన్ని వాగ్దానాలను భంగపర్చి ప్రజల్లో అవమానాన్ని, అపకీర్తిని మూటగట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ప్రస్తుతం ఈ రాజీవ్ యువ వికాసం పట్ల పెద్దగా ఉత్సాహంగా ఉంటారని నేననుకోను. పార్టీలోని పెద్ద నాయకులు అంటే పాలకుల స్థాయిలో ఉన్నవారి అవకతవకలు, ఆలోచనరహిత తీరుకు తాము జనాలలో జవాబు చెప్పుకోవాల్సి రావడం, ప్రస్తుతం కార్యకర్తలకు బహుశా గతంలో ఎప్పుడూ లేనంతటి పెద్ద సమస్యగా తయారైంది.'పీఏస్' అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల కాలంలో.. ప్రభుత్వ ఆదాయం దారుణంగా పడిపోయినా, అదంతా ఏమీ పట్టనట్టు రికార్డు స్థాయి బడ్జెట్ మళ్లీ వేసిన ఈ కాంగ్రెస్ పార్టీ నాయకులకు తాము ఆ ఖర్చులకు డబ్బు ఎలా సమకూర్చుకుంటామో చెప్పే విజ్ఞత కూడా కొరవడింది. అంటే, నేటి తెలంగాణ ఆర్థిక పరిస్థితిని వీళ్లు గాలిలో దీపంలా మార్చి.. 'దేవుడా.. నీవే దిక్కు' అనుకోమంటున్నారు. గుడ్డేటుగానో, గాలివాటుగానో.. మంచే జరుగుతుందని మనల్ని నమ్మమంటున్నారు. ఈ పాలన ఇంకా మూడున్నరేండ్లు ఉన్నది. నిజంగానే తెలంగాణకు నీవే దిక్కు దేవుడా కాంగ్రెస్ ప్రస్తుతం బీసీ జనోద్ధరణకు కులగణన చేశానంటూ, చెప్పుకుంటూ.. ఆ సర్వే నివేదిక సిరా చుక్కలు ఇంకా ఆరకముందే బీసీలను దగా చేస్తూ, ఈ బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేవలం రూ.11,000 కోట్లకు కొద్దిగా పైనే కేటాయించింది. కాగా, గత సంవత్సరం బడ్జెట్‌లో ఈ కేటాయింపు రూ.8 వేల కోట్లు మాత్రమే. ఇక ఇప్పుడు గుర్తుచేయాల్సిన హైలైట్ 'కామారెడ్డిలో.. బీసీ డిక్లరేషన్ పేరిట ప్రకటించిన బీసీలకు ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ.20,000 కోట్లు కేటాయిస్తామన్న వాగ్దానాన్ని. అంటే, వాగ్దానాన్ని గత బడ్జెట్‌లో కాక, ప్రస్తుతం బీసీల కోసం కులగణన పూర్తిచేయాలని చెప్తున్న ఈ బడ్జెట్ ముంగిటిలో కూడా పరిహాసమే చేశారు. అదీ విషయం.

# వాక్ స్వాతంత్ర్యంపై కత్తి



మహిళలు, అప్పుడప్పుడు పురుషుల దుస్తులు కూడా విప్పించి ఊరేగించడం మన దేశంలో తరచూ జరుగుతూనే ఉంటాయి. మతం, కులం, వర్గం మధ్య సంఘర్షణలు జరిగినప్పుడు ఆ మొత్తం మతం, కులం లేదా వర్గానికి ఉండే పరువు ప్రతిష్ఠలకు మహిళ శరీరం ప్రతిరూపంగా మారుతుంది. ఆ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిందని భావించినప్పుడు మహిళలను వివస్త్రలను చేసి అవమానిస్తుంటారు. సంఘ విద్రోహ శక్తులు ఇలాంటి నేరాలకు పాల్పడుతూ ఉంటాయి. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూ ఉండటం చూస్తున్నాం.సీఎం రేవంత్ తన పరువుకు భంగం వాటిల్లిందని చెప్తూ ఇద్దరు మహిళా జర్నలిస్టులను బట్టలూడదీసి కొడతామని సాక్షాత్తూ అసెంబ్లీలోనే బెదిరించడం దిగ్భ్రాంతిని కలిగించింది. మార్చి 1న రేవంత్ అసెంబ్లీలో మాట్లాడుతూ తన కుటుంబంలోని మహిళలపై అసభ్యంగా మాట్లాడేవారిని 'బట్టలూడదీసి ఊరేగిస్తామని' హెచ్చరించారు. సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వాక్ స్వాతంత్ర్యాన్ని ఉల్లంఘించడమే. రేవంత్ చేసిన ఈ హెచ్చరిక తాలిబన్లను తలపించింది. సీఎంకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేసినందుకు ఇద్దరు మహిళా జర్నలిస్టులు రేవతి పొగడదండ, తన్వీ యాదవ్ అరెస్టయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవతి, తన్వీ షేర్ చేసిన వీడియోలో రేవంత్‌రెడ్డి, వారి కుటుంబంలోని మహిళలను దుర్భాషలాడారు. ఇది రేవంత్‌కు కోపం తెప్పించింది. జర్నలిజం ముసుగులో సోషల్ మీడియాలో తన కుటుంబంపైనా ఇలాంటి తిట్లను సహించబోనని ఆయన హెచ్చరించారు. అధికారిక గుర్తింపు లేకుండా ఆన్‌లైన్ జర్నలిజంలో ఉన్నవారి విషయంలో భిన్నంగా వ్యవహరిస్తామన్నారు. గుర్తింపు పొందిన జర్నలిస్టుల జాబితాను ఇవ్వాలని జర్నలిస్టు సంఘాలను కోరారు. ఆ ఇద్దరు మహిళా జర్నలిస్టులను ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ రెచ్చగొట్టిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.మహిళా జర్నలిస్టుల అరెస్టుపై బీఆర్ఎస్, బీజేపీ తీవ్రంగా స్పందించాయి. రేవంత్ చర్యలు 1975 నాటి ఎమర్జెన్సీని తలపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఓ వీడియోను షేర్ చేస్తూ.. కాంగ్రెస్ డీఎన్ఏ, ఎమర్జెన్సీ ని ప్రస్తావించారు. 'కాంగ్రెస్ పార్టీ సీఎం భాష ఇదేనా?' అని ప్రశ్నించారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ పత్రికాస్వేచ్ఛ, ప్రేమ, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతారని, ప్రజాస్వామ్యానికి నిర్వచనం ఇదేనా? అని నిలదీశారు. ఇదేనా 'ముహబ్బత్ కీ దుకాణ్?' అని పూనావాలా ప్రశ్నించారు. జర్నలిస్టులను ఉద్దేశిస్తూ సభలో సీఎం అన్ పార్లమెంట రీ భాష వాడారు. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం రాజకీయాల్లో సాధారణ విషయమే. సీఎం తన కుటుంబాన్ని రాష్ట్ర ప్రజల కంటే ఎక్కువగా భావించడమే ఆందోళన కలిగిస్తున్నది. గత ప్రభుత్వంలో రేవంత్ ప్రతిపక్ష నేతగా బీఆర్ఎస్‌ను బలంగా ఢీకొట్టారు.

2021 అక్టోబర్‌లో నాటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లను 'తాలిబన్'ల తో పోల్చారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఇప్పుడదే నాయకుడు విమర్శిస్తున్న వారి గొంతులను మూసి వేయించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తుండ టం విడ్డూరం. అధికారంలో ఉన్న పార్టీకి పోలీసులపై నియంత్రణ ఉం టుంది. ఈ అధికారం పనికిమాలిన కేసుల్లో ప్రత్యర్థులను ఇరికించడానికి వీలు కల్పిస్తుంది.ప్రభుత్వం తన పౌరులకు భద్రత కల్పించాలి. అయితే, ముఖ్యమం త్రి స్వయంగా వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేస్తామని బహిరంగ బెదిరింపులకు దిగడం, అసమ్మతిని అణచివేయడానికి తాలిబన్ల వంటి ఆదేశాలను జారీ చేసినప్పుడు అది ప్రజాస్వామ్య సంస్థలను అపహా స్యం చేస్తుంది. ఇలాంటివేవైనా జరిగినప్పుడు న్యాయస్థానాలు నిర్ణ యం తీసుకుంటాయి. అయితే, పరిష్కారం ఆలస్యంగా రావడంతో అప్పటికే బాధితుడి శారీరక, ఆర్థిక, మానసిక స్థితికి తీరని నష్టం జరుగుతుంది. పౌరులు తమ అభిప్రాయం చెప్పినందుకు బెదిరించడం ద్వారా రేవంత్‌రెడ్డి వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసే ప్రయత్నం చేసి దోషిగా నిలబడ్డారు. రాజ్యాంగం తన పౌరులకు స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్నిస్తుంది. అయితే, దీనికి కొన్ని పరిమితులున్నాయి. దాన్ని న్యా యప్రక్రియ ద్వారా నిర్ణయించడం ఉత్తమం. ఐదు రోజుల కస్టడీ తర్వా త మార్చి 17న ఇద్దరు మహిళా జర్నలిస్టులకు బెయిల్ మంజూరైంది. నేరపూరిత కుట్ర, ద్వేషాన్ని ప్రోత్సహించడం, భారత చట్టం ప్రకారం అసభ్య విషయాలను ప్రచురించడం వంటి తీవ్రమైన అభియోగాలను వారు ఎదుర్కొంటున్నారు. దోషులుగా తేలితే, వారికి జైలు శిక్ష విధించవచ్చు, ఇది కఠినంగా అనిపించవచ్చు. పరువు నష్టం కేసులను అర్థం చేసుకోవచ్చు కానీ, అరెస్టు, బెదిరింపులను అర్థం చేసుకోగలమా?ప్రభుత్వం ఆమోదించిన జర్నలిస్టులనే గుర్తించాలని సీఎం కోరుకుంటున్నారు. జర్నలిస్టుల అధికారిక జాబితాను రూపొందించాలని, జాబితాలో లేనివారిని నేరస్థులుగా పరిగణించాలన్నారు. దీని అర్థం సాధారణ పౌరులకు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే స్వేచ్ఛ లేదనుకోవాలా? ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19కి విరుద్ధం కాదా? సీఎం చేసిన దారుణమైన వ్యాఖ్యలు ఆయన ఫ్రస్ట్రేషన్ నుంచి వచ్చినవని కొందరంటున్నారు.కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్ని అడ్డుకుంటున్నదని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకత్వం.. తొలుత తన ఇం టిని చక్కదిద్దుకోవాలి. సోషల్‌మీడియా యుగంలో దూషణలు, ట్రోలింగ్ ప్రజా జీవితంలో భాగమైపోయాయి. అలాగని ప్రజాస్వామ్యంలో గొంతులను అణచివేయలేం. దానికి ప్రత్యేకంగా చట్టం ఉన్న ది. ఇందుకు సంబంధించి చరిత్రలో చాలా పాఠాలున్నాయి. ఉన్నత కులాలకు చెందిన పురుషులు తనపై అత్యాచారం చేసి అవమానించినందుకు బందిపోటు రాణి ఫూలన్‌దేవి బెహమాయి ఊచకోత ద్వారా ప్రతీకారం తీర్చుకున్నట్టు చరిత్ర. మణిపూర్‌లో తాజాగా మహిళలను వివస్త్రను చేసి ఊరేగించిన ఘటనలను కూడా దేశం చూసింది.

# కొన్ని చీకట్లూ... ఓ వెలుతురూ

అంతా అల్లకల్లోలం. కట్టెగా మారిన సిరి శరీరం మీదబడి ఇంకా కట్టెనెందుకు కాలేకపోయానా అని ఉప్పు సంద్రంలా సుమతి రోదన. చుట్టూ మూగిన జనాలు గుసగుసలాడుకుంటున్నారు... అందరికీ వినబడేలా!

"పెండ్లయిన రెండ్రోజులకే ఉరి పోసుకుందంటే ఏమయినాదో పాపం?"

"మనువు ఇష్టం లేదంట!"

"కాదెహె, పిల్లోడు పనికిమాలినోడంట"

"అదేం కాదు. ఆ పిల్ల ఎవర్నో ప్రేమించినాదంట. ఇష్టం లేని పెండ్లి చేసినారని, అర్థాంతరంగా ఆయువు ముగించుకున్నాది"

"పాపం బిడ్డ. పచ్చగ పారాణి, పెట్టింది పెట్టినట్లే ఉంది"

అన్నీ వినబడుతున్నా ఏమీ వినబడనట్లు అచేతనంగా వెంకట్రామయ్య. తన సిరి సంపదలకు కారణమని తను నమ్మిన తన 'సిరి' నిర్జీవంగా. వొంటి మీద నలభై తులాల బంగారం, ఏ మాత్రం తగ్గరాదని కట్టబెట్టిన యాభై వేల చీరతో నిన్న గాక మొన్న తన ఇంటి నుంచి అత్తగారింటికి తరలెళ్లిన తన గారాల పట్టి, కాదు కాదు, తన వంశ ప్రతిష్ఠ. అవును వంశ ప్రతిష్ఠే, అప్పుడూ ప్రాణమున్న మనిషేమీ కాదు."అన్నీ తెలిసి నాకెందుకు కట్టబెట్టారు? మా పరువూ మర్యాదా అన్నీ పాయె" అల్లుడి గొంతులో బాధ కంటే కోపం, అవమానం అగ్నిపర్వతంలా పలుకుతున్నాయి."పరువేనా...? పెండ్లయిన రెండ్రోజులకే చచ్చిపోయినాదంటే అత్తింటోళ్లు ఏం జేసినారోనని మామీద అనుమానం. లేనిపోని కేసులు. ఎట్ల సావాల్రా దేవుడా...? వీళ్లు నాశనమైపోను!" సిరి అత్తగారి శోకాల్లో శాపాలు.పరువు... పరువు... ఛళ్లున చరిచినట్లయింది. దిగ్గున లేచి కూర్చున్నాడు వెంకట్రామయ్య. చుట్టూ చీకట్లు. ఇదంతా కలా? సెల్ఫోన్ తీసి టైం చూశాడు. పదకొండున్నర. ఇలాంటి కలొచ్చిందేమిటి? పక్కన సుమతి గాఢనిద్రలో ఉంది. మెల్లగా గది బయటికొచ్చాడు. హాల్లో సిరి నాయనమ్మతో కలసి నిద్రపోతోంది. సిరి నిజంగా అంత ప్రశాంతంగా నిద్రపోతోందా? లేకపోతే నిద్ర నటిస్తోందా? లోపలికొచ్చి మళ్లీ పడుకున్నాడు, కానీ నిద్ర దగ్గరికి రానంటోంది. నిద్రకు బదులు గతమొచ్చి కళ్లల్లో నిలిచింది.తొలి సంతానం ఆడపిల్ల పుట్టగానే చాలా కుటుంబాల్లో లాగానే మహాలక్ష్మి పుట్టిందని సంబరపడి శ్రీలక్ష్మి అని పేరు పెట్టుకున్నాడు. ముద్దుగానే కాకుండా ఆధునికంగా కూడా ఉండాలని 'శ్రీ' కాస్తా సిరిగా మారింది. నిజంగా సిరి పుట్టాక సిరి కలిసొచ్చిందని వెంకట్రామయ్యకు అపారమైన నమ్మకం. పట్టిన వ్యాపారమల్లా బంగారమై కురిసింది. సిరి వెనక రెండేళ్లకు అబ్బాయి రమేష్ పుట్టాడు. ఆస్తికి వారసుడు పుట్టాడని వెంకట్రామయ్యకు సంబరం. సంఘంలో పేరు ప్రతిష్ఠలతో పాటు, సంపద పెరగడానికి కారణమైందని సిరి అంటే ప్రాణం. అందులోనూ చిన్నప్పట్నుంచీ సిరి తెలివితో పాటు పట్టుదల గలిగిన పిల్ల. చదువులో ఏ మాత్రం వెనుకబడటానికి ఇష్టపడేది కాదు. సిరి ఏదడిగినా కాదనకుండా తెచ్చిచ్చేవాళ్లు గారాబంతో. ఆడపిల్లని చదువు ఆపకుండా చదివించారు. బీటెక్ మంచి మార్కులతో పాసయి, క్యాంపస్ సెలక్షన్స్ లో మంచి ఉద్యోగం కూడా సాధించుకుంది. ఎంత చదివితేనేం, అంతకంటే ఎక్కువ చదివిన వాణ్ని తెచ్చే దమ్ముందని ధైర్యం వెంకట్రామయ్యకు.సిరి పెళ్లి వెంకట్రామయ్యకు గొప్ప కల, ఇంకా చెప్పాలంటే ప్రతిష్ఠ. ఎంత డబ్బయినా సరే ఖర్చు పెట్టి గొప్ప సంబంధం తీసుకొచ్చి, అంగరంగ వైభవంగా పెళ్లి చేయాలిబీ ఆ పెళ్లి గురించి, వెంకట్రామయ్య గొప్పతనం గురించి జనాలు గొప్పగా చెప్పుకోవాలి. కానీ సిరి అతని అంచనాలను తారుమారు చేస్తూ, ఎవర్నో ప్రేమించానని, అతణ్నే పెళ్లి చేసుకుంటానని తెగేసి చెప్పింది. అతను కులంలోనూ, ఆర్థికంగానూ వెంకట్రామయ్య కుటుంబం కంటే చాలా కింది స్థాయిలో ఉన్నాడు. వెంకట్రామయ్య కాళ్ల కింద భూమి కంపించినట్లయింది. 'నా బిడ్డ నా వంశ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేస్తుందనుకుంటే, ఇంతపని చేస్తుందా? నా పరువేం కావాలి? సమాజంలో నాకున్న గౌరవ మర్యాదలేమై పోవాలి?' గింజుకున్నాడు. చిన్నప్పట్నుంచీ ఏ రోజూ బిడ్డ మాట కాదనని మనిషి, కూతుర్ని అపురూపంగా పెంచుకున్న మనిషి, మొదటిసారి సిరి నిర్ణయాన్ని తప్పుపట్టాడు. తను చూసిన వాణ్ని చేసుకోవాల్సిందేనని హుకుం జారీ చేశాడు. కూతురికీ పట్టుదల తక్కువేం కాదుగా. తండ్రితో వాదించింది, ఘర్షణ పడింది. కానీ తండ్రి ప్రేమ చాటునున్న వంశ గౌరవం, ప్రతిష్ఠ ఓడిపోవడానికి ఇష్టపడలేదు. సుమతి హాల్లోకి ప్రవేశం నిషిద్ధమన్నట్లు, వంటింట్లో పొయ్యి మీద మగ్గుతున్న కూరను కలబెడుతోంది, ఆ కూర మగ్గిపోతోందో, మాడిపోతోందో ఎవరికీ తెలీదు.బిడ్డ ప్రేమ ముందు వంశ గౌరవం, పెద్దరికం తలదించలేదు. ఈరోజు ఈపిల్ల మాటలకు తలొగ్గితే రేపు ఇంటి మానం-మర్యాదా అన్నీ మంటగలిసిపోతాయి. ఎట్లయినా సరే కూతురి మనసు మార్చాలనుకున్నాడు. మొదట మెల్లగా నచ్చజెప్పి ప్రయత్నించాడు. ఊహూ... సిరి మారలేదు. ఇక లాభం లేదని ఇంకో అస్త్రం వదిలాడు.

"ఆస్తివ్వను"

"అక్కర్లేదు" షటిల్‌లాగా దూసుకొచ్చింది సమాధానం.

"మాతో సంబంధాలుండవు"

"మీరు చూసే పెళ్లితో ఉంటాయని గ్యారంటీ ఉందా?" సమాధానం చెప్పలేని ప్రశ్న.

చివరికిక చస్తానని బెదిరించాడు. బెదిరించడం అంటే ఊరికే మాటతో కాదు. నాలుగు రోజులు అన్నమూ, నీళ్లూ మానేసి, మాట్లాడకుండా మొండికేసి, ఏమేం చేయగలడో అన్నీ చేశాడు. చివరికి ప్రేమ ఓడిపోయింది. కాదు, ఓడిపోయేలా చేశాడు.విశాలమైన తటాకంలో ఉండాల్సిన చిరు చేపలు గాజు గోడల మధ్య అక్వేరియంలో ఆక్సిజన్ అందక గిలగిల లాడుతుంటే జాలిగా చూస్తూ "నీ ఇష్టం నాన్నా" అంది సిరి



నిర్లిప్తంగా.ఆ తర్వాత సిరి తండ్రితో మామూలుగా మాట్లాడాలని ప్రయత్నించినా, తనకే ఎందుకో మామూలుగా లేదేమోనని అనుమానం. ఆ... ఏదయితేనేం, తనకు తన పరువు ముఖ్యం. తర్వాత అన్నీ వాటంతటవే సర్దుకుంటాయి. ఎన్ని చూడలేదు. సమాధానం చెప్పుకుని, తనకు నచ్చిన తమ కులపు కుర్రాణ్ని, తమ కంటే గొప్ప ఆస్తిపరుణ్ణి వెతికి మరీ పెళ్లి నిశ్చయించాడు. అయినా ఎందుకో పెళ్లి దగ్గర పడేకొద్దీ ఏవో భయాలు. 'ఈ పెళ్లి ప్రశాంతంగా జరిగిపోతుందా? బంధు మిత్రుల మధ్య తల దించుకునే పరిస్థితి రాదు కదా, కుటుంబం పరువు పోదు కదా' ఇలాంటి ఆలోచనలతో నిద్రెప్పుడు పట్టిందో?

తెల్లారింది.

"సిరీ... సిరీ..." సుమతి కేకలు.

ఉలిక్కిపడి లేచాడు వెంకట్రామయ్య.

"ఏమయింది?"

"సిరి కనిపించటం లేదండీ" సుమతి జీర గొంతులో ఏడుపు పలికింది.

"ఎక్కడికెళ్లింది? సరిగ్గా చూడండి"

"స్నానం చేస్తోందేమో?"

"ఎన్ని గంటలు చేస్తుంది?"

"పెరట్లో ఉందేమో?"

"ఇప్పటికి పదిసార్లు తిరిగొచ్చారు"

తన భయాలు నిజమయ్యేట్టున్నాయని వెంకట్రామయ్య మనసు పొరల్లో కంగారు. స్నేహితులకు ఫోన్ చేద్దామని సెల్ఫోన్ తీసుకున్నాడు. అందులో వాట్సప్ సందేశం."నా జీవితానికి నేనే బాధ్యత వహించాలనుకుంటున్నాను. దయచేసి మీ బరువుగా నన్ను భావించడం మానేయండి.. సిరి" అనుకున్నంతా అయింది. వెంకట్రామయ్య నిలబడిన నేల పాతాళంలోకి జారిపోయింది."వెంకట్రామయ్య కూతురు ఎవరితోనో లేచిపోయిందంట""పోయే కాలాలు. అందుకే ఆడపిల్లకు చదువూ గిదువూ లేకుండా పిల్లప్పుడే పెళ్లి జేయాలనేది""అయినా ఆ పిల్ల ఎంతంటే అంత, మితిమీరిన గారాబం చేశార్లే. అదుపులో పెట్టుకోకపోతే ఇంతే అయ్యేది""ఏనాడన్నా ఆ పిల్లను హద్దుల్లో పెట్టినారా? ఆడపిల్లలకు సెల్లు సగం చేటు. ఎవరితో మాట్లాడతాందో, ఏం చేస్తాందో చూసుకోవద్దా?"ఇలాంటి మాటలన్నీ వినాలి కాబోలు. ప్రాణంగా పెంచుకున్న బిడ్డతో పాటు, ప్రాణసమానంగా చూసుకున్న పరువూ పోయె. ఇంక బతికేం చేయాలి. మౌనంగా గదిలోకి నడిచి, తలుపేసుకున్నాడు. పరువూ, ప్రతిష్ఠా, వంశమూ, గౌరవమూ, మన్నూ మశానమూ ఉరితాడై గొంతును బిగించాయి. ఊపిరి ఆడటం లేదు, ప్రాణం ఒరుసుకుపోతోంది.

రెండు చేతులతో మెడ పట్టుకొని విదిలించాడు. చీకటికి తోడు బయట కీచురాళ్ల శబ్దాలు. 'మళ్లీ ఇంకో కలా...?' మరో సారి మెడ విదిలించాడు. టైం ఒకటిన్నర. ఎంత అస్థిమితం? చీకట్లోనే తడిమి, నీళ్ల సీసా తీసుకొని కాసిని నీళ్లు గొంతులో పోసుకున్నాడు.ఎందుకీ అస్థిమితం? తన కూతురి బాగు కోసమే కదా ఇదంతా చేస్తున్నది. తనకంటే ఎక్కువ ప్రేమను ఎవరు పంచుతారు? ఇరవై మూడేళ్లు ముద్దుగా పెంచుకున్న బిడ్డ సుఖంగా ఉండాలనే కదా తాపత్రయం. తన గారాల బిడ్డ తనను మోసం చేసి వెళ్లిపోతుందా? లేదు, సిరి మాట ఇచ్చిందంటే తప్పదు. నాన్నంటే దానికి ప్రాణం. బలవంతంగా నిద్ర తెచ్చుకోవాలని కళ్లలోకి చీకట్లు మోసుకొచ్చుకున్నాడు.

నల్లగా చీకటి. ఇంట్లో కాంతిగా వెలగాల్సిన విద్యుల్లత భయంకరంగా షాకిచ్చింది.

"ఎన్నాళ్లిలా చీకట్లో ఉంటావు?" స్విచ్ వేస్తూ సుమతి.

కళ్లు చికిలించాడు వెంకట్రామయ్య. "ముందా లైట్ తీసెయ్" ఆజ్ఞాపించాడు.

సుమతి వినిపించుకోలేదు.

"ఎన్నాళ్లిలా చీకట్లో ఉంటావని అడుగుతున్నాను?"

"బతికినన్నాళ్లు...! చాలా? నీ కూతురు చేసిన ఘనకార్యానికి బలయిపోయింది నా కొడుకు. ఇంక వెలుతురెక్కడ మిగిలింది?""ఎన్ని సార్లు ఈ మాటలంటావు? గొప్పగా మార్కులు తెచ్చుకుంటే, మంచి పేరు తెచ్చి పెడితే, నీ కూతురని గర్వపడితివి. నీ ఇంటి పరువు తీసిందనుకున్ననాడు నా కూతురని దెప్పిపొడుస్తున్నావు. అసలు మా పనంతా మీ గొప్పను నిలబెట్టడమేనా?""ఇదిగో ఇట్ల తలతిక్క ప్రశ్నలడిగే అది కొంపలో నుంచి పోయి, సంతకాల పెండ్లి చేసుకుని, మర్యాద తీసింది. పోయింది అట్లా దూరంగానన్నా పోయిందా? ఊళ్లోనే కాపరం పెట్టి, ఎక్కడా తిరగకుండా, తలెత్తుకోకుండా చేసింది. అదింత కడుపేసుకొని తిరుగుతుంటే, ఆ సంకర సంతానాన్ని చూడలేకగదూ, నా కొడుకు నరికి పారేసింది. అది పాపమై వాడు జైల్లో మగ్గుతున్నాడు. దానికేం సుఖంగా చచ్చింది""అవును పాపం కాదు, నెలలు నిండిన బిడ్డను కనీసం కనికరం చూపించకుండా చంపడం పాపం కాదు. పందులూ, కుక్కలూ కూడా తమ పిల్లల్ని ముట్టుకుంటే మీదికొస్తాయే, అంత ఘోరంగా నిండు చూలాలిని పొట్టన బెట్టుకున్న నీది పాపం కాదు! నీ మాట కాదనిందని నీ బిడ్డను చంపుకున్నావు, సరే, ఇంకెవరి బిడ్డనో చంపేకి ఏం హక్కుందని? ఆ తల్లిదండ్రుల కెంత గుండె కోతనో ఎన్నడన్న ఆలోచిస్తివా?""ఏంది ఆలోచించేది? పైసాకు తరుంగాని ప్రతోడూ డబ్బున్న పిల్లను చూసి లవ్వాడానని బుట్టలో ఏసుకొనేటోడే. వాడెంత, వాని తాహతెంత? మన పిల్లనే చేసుకొనేటోడా. ప్రతి ఎదవ నా కొడుకొచ్చి నా ముందు కాలరెగరేసి, నీతులు చెప్పేవాడే ఆడపిల్ల నెట్ట పెంచల్లా అని""అవును, ఆడపిల్లనెట్ట పెంచల్లా అని మగ నా కొడుకులే చెప్పేది. అసలు మేం మనుషులమైతే కదా, ఏది మంచో ఏది చెడుపో మాకు తెలిసేది. మీ ఇంటి పరువును కాపాడల్ల, మీ మర్యాదను నిలబెట్టల్ల. మీరు మటుకు మొగుళ్లై, తండ్రులై, అన్నదమ్ములై, కొడుకులై మా మీద బడి తిని, మేమేం జెయ్యాల్లో, ఎట్టుండాలో తీరుమానం జేస్తారు. కాదూ కూడదంటే చంపి పాతరేస్తారు"."ఏందే గొంతు లేస్తాంది, వీడు సగం చచ్చిన పామనుకుంటాండావా? ఇష్టానుసారం మాట్లాడతాండావు?" చింత జచ్చినా పులుపు చావలేదు, పాత సామెతే కానీ, ఎప్పటికీ పాతబడదు."అది కాదయ్యా, ఏం చేసింది నా బిడ్డ? మనసుకు నచ్చినోణ్ని పెండ్లి చేసుకునింది, అదీ తప్పేనా? నా బిడ్డ అంత తెలివైందని మురిసిపోతాంటివే, ఇరవై మూడేండ్లు ముద్దుగా పెంచుకున్న బిడ్డ తెలివి లేని నిర్ణయం తీసుకుంటాదని ఎట్లనుకొంటివి? అట్లా బిడ్డ పాయె, ఇట్ల కొడుకూ జైలు పాలాయె. ఏం సాధిస్తివి? పరువేమన్నా తిరిగొచ్చెనా? ఈ సంది ఇంగా జనాలకు తెలిసి, బిడ్డను చంపుకుంటిమని, ఉన్ని మర్యాద పాయె. అయినా బిడ్డలే పోయినంక ఇంకా పరువు మిగిలిందా?" వెంకట్రామయ్య భుజం మీద చేయేసింది సుమతి.దాదాపు రెండు నెల్లోయింది సుమతి తనతో ప్రేమగా మాట్లాడి. ఆమె చేతి స్పర్శతో శరీరంలో ఏదో చిన్న కదలిక."అవును ఏం సాధించాను? ప్రేమ ఇంత హింసాత్మకంగా ఉంటుందా? ప్రణయం ప్రాణాలు బలిగోరుతుందా? ప్రాణాలు తీసే ఈ ప్రేమను ఎందుక్కావాలనుకుంటారీ పిల్లలు? వాళ్లేం సాధించారు, నేనేం సాధించాను? ప్రేమా... పరువా...? ప్రాణమా...? చివరికి ఏం మిగిలింది? నా పరువూ మిగల్లేదు, నా బిడ్డ ప్రేమా మిగల్లేదు. ఏం సాధించినట్లు?"

"ఏందయ్యో...? ఏందీ కలవరింతలు...? ఇంకా చిమ్మ చీకట్లు. నిద్రబో నిమ్మళంగా" సుమతి చిరాకుతో కళ్లు తెరిచాడు వెంకట్రామయ్య.

అవును ఇంకా చిమ్మ చీకటి. చీకటెందుకింత బీభత్సంగా ఉంది? ఇంత భయంకరమైన దృశ్యాలతో, చావు మేళాలతో నిద్రెట్లా పడుతుంది? ఈ చీకట్లెప్పుడు వెలుతుర్లో కలుస్తాయి? వెంకట్రామయ్య విసుగ్గా మరోసారి టైం చూశాడు. అయిదు నిమిషాలు తక్కువ నాలుగు. ఇప్పుడిక కళ్లు మూసుకోవాలంటే భయమేస్తోంది. నిద్రపోయినా ఇంకే భయంకరమైన కలలొచ్చి కల్లోలం లేపుతాయో. చీకట్లో కళ్లు మూసుకుపోతాయేమోనని బలవంతంగా కళ్లు పెద్దవిగా తెరచి, పెట్టుకున్నాడు.

మంద్ర స్వరంలో బిస్మిల్లా ఖాన్ షహనాయ్ సంగీతం హాయిగొలుపుతూ వినిపిస్తోంది. కళ్లకు మిరుమిట్ల ప్రయాస లేకుండా ఆహ్లాదకరమైన పూల అలంకరణ. అక్కడక్కడా ఆహూతులను అందంగా ఆహ్వానిస్తూ ముచ్చటైన పూల కుండీలు."మంచిపని చేశారు వెంకట్రామయ్య గారూ, ఆర్కెస్ట్రా పేరుతో చెవులు దద్దరిల్లేలా సినిమా పాటలతో చావగొడుతున్నారీమధ్య. ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ చెవులతో పాటు, మనసుకు కూడా హాయిగా ఉంది" అతిథులు అభిరుచిని మెచ్చుకుంటున్నారు.వేదిక పైన సిరి తన జీవిత భాగస్వామితో కబుర్లు చెబుతూ, స్నేహితులకు పరిచయం చేస్తూ... ఆనందంగా! అవును, అతను సిరి మనసిచ్చిన, మనసారా కోరుకున్న జీవిత భాగస్వామి, తను కావాలనుకున్న గొప్ప పెళ్లి కొడుక్కాదు."గ్రేట్ వీఆర్. అమ్మాయి మనసు తెలుసుకొని తనకు నచ్చిన వాడితో పెళ్లి జరిపిస్తున్నావు చూడూ. నువ్వు నిజంగా గ్రేట్""అవును, ప్రేమగా పెంచుకున్న పిల్లలను అందునా ఆడపిల్లను చదువు, కెరియర్, భాగస్వామి అన్ని విషయాల్లో సరైన నిర్ణయం తీసుకునేలా తీర్చిదిద్దామంటే తల్లిదండ్రులుగా మనం సక్సెస్ అయినట్లే""వాళ్లు మన పెద్దరికానికి విలువనిచ్చినపుడు ఆ గౌరవం నిలుపుకోవాల్సిన బాధ్యత మనదే. ఘర్షణపడితే ఎవరికీ మనశ్శాంతి లేకపోవడమే తప్ప ఏ ప్రయోజనమూ ఉండదు""వెంకట్రామయ్యా, నీమీద నాకింకా గౌరవం పెరిగిందయ్యా. చాలా మంది తల్లిదండ్రులకు నిన్ను ఆదర్శంగా చూపించొచ్చు"మిత్రుల మాటల్లో తనపై ఎనలేని గౌరవం, ప్రేమ. ఆ మాటలు నోట్లోంచి వచ్చినవి కావు. గుండె లోతుల్లోంచే వస్తున్నాయని తెలుస్తోంది. ఇంతకంటే ఎక్కువ ప్రేమ కూతురి కళ్లల్లో... ప్రేమ మాత్రమే కాదు, అంతకంటే ఎక్కువగా ఇంకా ఏదో...

"ఏందయ్యో ముసిముసి నవ్వులు నవ్వుతున్నావు? ఇంగా నీ కలవరింతలు అయిపోలేదా? తెల్లారింది లే" కిటికీ కర్టెన్ పక్కకు జరుపుతూ సుమతి అరుస్తుంటే బద్ధకంగా లేచాడు.కళ్లు తెరవాలనిపించలేదు. కలలోంచి బయటికి రావాలనిపించలేదు. అయినా లేచాడు... హుషారుగా! తెల్లారింది కదా. అవును తెల్లారిపోయింది. ఇక వెలుగు దారాలందుకొని ముందుకు నడవాలి. కిటికీలోంచి బయటికి చూస్తే, సిరి మొక్కలకు నీళ్లు పెడుతూ, గులాబీ మొగ్గను ప్రేమగా తడుముతోంది.

# సునీతా విలియమ్స్ నెక్ట్స్ ప్లాన్ ఏంటీ?





అంతరిక్షయానం సవాళ్లతో కూడుకున్నదైనప్పటికీ ఈసారి మాత్రం సాంకేతిక సమస్య కారణంగా సునీతా విలియమ్స్ సుదీర్ఘ కాలం అక్కడే ఉండిపోవాల్సి రావడంతో జరిగిన పరిణామాలు యావత్ ప్రపంచాన్ని ఉద్వేగానికి గురిచేశాయి. కేవలం ఎనిమిది రోజుల్లోనే పూర్తికావాల్సిన ఆమె ప్రయాణానికి ఏకంగా తొమ్మిది నెలలు పట్టింది. దీంతో ఆమె భూమిపైకి తిరిగి రావడాన్ని అంతా ఆసక్తిగా గమనించారు. ఈ నేపథ్యంలో భారత సంతతి వ్యోమగామి సునీతకు సంబంధించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు పరిశీలిస్తే.భారత సంతతికి చెందిన న్యూరోఅనాటమిస్ట్ దీపక్ పాండ్యా, స్లోవీన్ అమెరికన్ ఉర్సులైన్ బోనీలకు 1965 సెప్టెంబర్ 19న ఒహాయోలో సునీత జన్మించారు. పాండ్యా దంపతులకు ముగ్గురు సంతానం కాగా.. సునీత చిన్న కుమార్తె. దీపక్ పాండ్యా గుజరాత్‌లో జన్మించారు.మసాచుసెట్స్‌లో 1983లో హైస్కూల్, 1987లో యూఎస్ నావల్ అకాడమీ నుంచి బీఎస్సీ, 1995లో ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో సునీత ఎమ్మెస్సీ పూర్తి చేశారు. 1997లో మిలటరీలో చేరిన సునీత.. 30 రకాల విమానాలను 3 వేల గంటలు నడిపిన అనుభవం పొందారు. 1998లో నాసా వ్యోమగామిగా ఎంపికయ్యారు.2006 డిసెంబర్‌లో తొలిసారి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్-ఎస్) వెళ్లారు. అంతరిక్షంలో మారథాన్ చేసిన తొలి వ్యక్తిగా రికార్డు సృష్టించారు. అప్పట్లో 195 రోజుల పాటు అంతరిక్షంలో ఉన్నారు. నాలుగు స్పేస్‌వాక్‌లు చేశారు.2012లో రెండోసారి, 2024లో మూడోసారి వెళ్లిన సునీత.. మొత్తంగా ఇప్పటివరకు తొమ్మిది సార్లు, 62గంటల 6 నిమిషాల పాటు స్పేస్‌వాక్ చేసి.. అత్యధిక సమయం స్పేస్‌వాక్ చేసిన నాలుగో నాసా వ్యోమగామిగా నిలిచారు.అమెరికా రక్షణశాఖ అత్యున్నత పురస్కారం డిఫెన్స్ సుపీరియర్ సర్వీస్ మెడల్ (డీఎస్ఎస్ఎం)తోపాటు అనేక అవార్డులు పొందిన ఆమెకు భారత్ కూడా 2008లో పద్మ భూషణ్‌తో సత్కరించింది.

**శునకాలంటే ఇష్టం..**

సునీతా విలియమ్స్‌కు శునకాలంటే ఇష్టమట. ఆమెకు లాబ్రడార్ జాతికి చెందిన రెండు శునకాలున్నాయి. భర్త మైఖేల్ ప్రస్తుతం వాటి సంరక్షణ చూస్తున్నారు.భర్తతో కలిసి వాటిని వెంట పెట్టుకొని బయటకు వెళ్లడం, వర్కౌట్ చేయడం, ఇంటి పనులు చేసుకోవడం, కార్లు, విమానాలు రిపేర్లు చేయడంతోపాటు ఔటింగ్ వెళ్లి ప్రకృతిలో గడపడమంటే సరదా.భూమ్మీదకు తిరిగొచ్చాక రెండు శునకాలతో సుదీర్ఘ నడకకు వెళ్లడంతోపాటు సముద్రంలో ఈతకు వెళ్లాలని అనుకుంటున్నారట. అంతరిక్షంలోకి భారతీయత భారత, స్లొవేనియా సంప్రదాయాలను గౌరవించే సునీత.. అంతరిక్షంలోకి వెళ్లిన ప్రతిసారి సంప్రదాయ వస్తువులను వెంట తీసుకొనే వెళ్లారు. ఒకసారి స్లొవేనియా పతాకంతోపాటు ఆ దేశానికి చెందిన ఓ తినుబండారాన్ని, భారత్‌కు సంబంధించి ఓ సమోసాను వెంట తీసుకెళ్లారు. గణేశుడి విగ్రహాన్ని సైతం తీసుకెళ్లినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి.హిందూ మతాన్ని ఆచరించే సునీత.. 2006లో భగవద్గీతను ఐఎస్ఎస్‌కు తీసుకెళ్లారు. రెండోసారి వెళ్లినప్పుడు ఓం గుర్తును, ఉపనిషత్తుల కాపీని వెంటపెట్టుకొని వెళ్లారు.గుజరాత్‌లోని ఝులాసన్ ఆమె పూర్వీకుల గ్రామం. భారత్‌లో రెండుసార్లు పర్యటించారు. 2007లో అక్కడ పర్యటించిన సునీత.. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో సమావేశమయ్యారు.

**ముద్దు పేర్లు..**

సునీతా విలియమ్స్‌ను అమెరికాలో సునీ, స్లొవేనియాలో సోంకా అనే పిలుస్తారట.ఫెడరల్ మార్షల్ మైఖేల్ విలియమ్స్‌ను సునీత వివాహం చేసుకున్నారు. టెక్సాస్‌లో ఉండే వీరిద్దరూ కెరీర్ ప్రారంభంలో హెలికాప్టర్లు నడిపేవారు.వీరికి సంతానం లేరని సమాచారం. అహ్మదాబాద్‌కు చెందిన ఓ బాలికను దత్తత తీసుకోవాలని అనుకుంటున్నట్లు 2012లో ఓ సందర్భంలో సునీత వెల్లడించారు.

# లేడీ టార్జాన్!



'అక్కా మనం రోజూ ఇలా చెట్లు నరుకుతూ పోతే కొన్నాళ్లకు అడవే ఖాళీ అవుతుంది. ఇక మన పిల్లలు ఎలా బతుకుతారు?'... ఈ ఒక్క ప్రశ్న కొన్ని హెక్టార్ల అడవిని కాపాడిందంటే నమ్ముతారా? అది అడిగింది... జమున టుడూ. ఈమెది ఒడిశాలోని రాయిరంగపుర్. పచ్చదనం, పొలాల మధ్య పెరిగారీమె. పెళ్లయ్యాక ఝార?ండ్‌లోని మాతుకంకి వచ్చారు. ఇంటి చుట్టూ చెట్లేనని ఆనందించేలోపే సగానికి నరికినవే ఎక్కువగా కనిపించాయామెకి. వంటచెరకు కోసమని స్థానికులు, తమ స్వార్థం కోసం స్మగ్లర్లు నరికేసినవే అవన్నీ. పచ్చని అడవి మోడుబారడం చూడలేకపోయారామె. దాన్ని కాపాడాలనుకున్నారు. చెట్లను నరికితే మనకే ప్రమాదమంటూ అవగాహన కల్పించడం మొదలుపెట్టారు.కానీ ఇంట్లోవాళ్లు సహా ఎవరూ తోడు రాలేదు. అయినా ఆమె ప్రయత్నం ఆపలేదు. చివరికి అయిదుగురు మహిళలు ఆమె ఉద్దేశాన్ని అర్థం చేసుకుని చేయి కలిపారు. అలా 'వన సురక్ష సమితి' మొదలైంది. బాణాలు, కర్రలు, కత్తులు చేతపట్టి అడవికి కాపలాగా వెళ్లేవారు. నక్సల్స్, మాఫియా వాళ్లను అడ్డుకున్నారు. వాళ్లని ముందుండి నడిపిన జమునకు అప్పటికి 18 ఏళ్లే. ఈక్రమంలో బెదిరింపులు, చావు వరకూ వెళ్లొచ్చిన సందర్భాలూ బోలెడు. అయినా ఆమె పోరాటం ఆపలేదు. కాబట్టే, వాళ్ల ఊరి అడవి బతికింది. ఆపై తన పోరాటాన్ని పక్క ఊళ్లకీ విస్తరించారు జమున.ఆమెను అనుసరిస్తున్న ఆ మహిళా సైన్యం సంఖ్య ఎంతో తెలుసా? పదివేలమంది. ఎన్నో మొక్కల్నీ నాటించిన ఆమె 50 హెక్టార్ల అడవిని కాపాడారు. ఆమె ధైర్యానికి పద్మశ్రీసహా దేశవిదేశీ అవార్డులూ వరించాయి. 'లేడీ టార్జాన్ ఆఫ్ ఇండియా' కితాబూ జమున ధైర్యానికి ఓ చిహ్నమే!

# పైసకు కరువొచ్చింది!

మన దేశంలోని 100 కోట్ల మందికి కనీస ప్రాథమిక అవసరాలకు మించి కావలసిన వస్తువులను కొనుగోలు చేసే శక్తి లేదు. తమ సంతోషానికి అవసరమైన వస్తువులను కొనుగోలు చేయలేక అటు సంతోషానికి, ఇటు దుఃఖానికి మధ్య వారు కొట్టుమిట్టాడుతున్నారు. ఇదీ మన దేశంలోని పరిస్థితి. ఇక ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర విషయానికి వద్దాం. అరువై ఏండ్ల వలస పాలనలో తెలంగాణ ప్రాంత ప్రజల చేతులకున్న సంకెళ్లు రాష్ట్ర ఆవిర్భావంతో పటాపంచలయ్యాయి.2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించడం, ఆ తర్వాత విజ్ఞులైన తెలంగాణ ప్రజలు రాష్ట్ర పాలనా పగ్గాలు ఉద్యమ సారథి కేసీఆర్‌కే అప్పగించడంతో రాష్ట్రంలో ఇటు అభివృద్ధి కార్యక్రమాలు, అటు సంక్షేమ పథకాలు జోడెడ్లలా పరుగులు తీశాయి. 'మిషన్ కాకతీయ' పథకంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు పూడికతీత, మరమ్మతుల వంటి పనులతో చెరువులు కొత్తరూపును సంతరించుకున్నాయి. ఇదొక్కటే కాదు, ఇంటింటికీ నల్లా నీరు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, దళితబంధు, బీసీబంధు వంటి అనేక సంక్షేమ పథకాలు రైతు, బహుజనుల అభివృద్ధి కేంద్రంగానే అమలయ్యాయి. దీంతో ఉత్పత్తి కులాలకు ఉపాధి లభించింది. ఉదాహరణకు చేపపిల్లల పంపిణీని తీసుకుంటే%ా% చేపలు పెద్దయ్యాక ముదిరాజు బిడ్డలు ఎప్పటికప్పుడు ఆ చేపలను వలవేసి పట్టుకుంటూ రోజువారీగా ఉపాధి పొందడం మనం చూశాం. గొల్లకుర్మలకు గొర్ల పంపిణీ వంటి కార్యక్రమాలతో ఏటికేడు వారికి ఉపాధి పెరుగుతూ వచ్చింది. ఇలా ఏ సంక్షేమ పథకం తీసుకున్నా%ా% గత బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపాధి కల్పిస్తూనే వచ్చింది.వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు ఆసరా పింఛన్లు అందిస్తూ అండగా నిలిచింది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేద ప్రజల చేతుల్లోనూ ఎంతోకొంత డబ్బు కనిపించింది. పేదల చేతుల్లో పైసలు చెలామణి అయ్యాయి. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం కొలువుదీరాక పైసక్కరువొచ్చింది. పైసలు కనపడక ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు.పాలనపై కనీస అవగాహన లేని రేవంత్ రెడ్డి హయాంలో ప్రజల పరిస్థితిని ఒకసారి ఊహించుకోండి. అంతకుమించి అనక తప్పని పరిస్థితి. ఇందుకు కారణం ఒక్క ముక్కలో చెప్పాలంటే.. స్వపాలనలో తెలంగాణ సంపద ప్రజలకే చెందేది. ఢిల్లీ పాలకుల చేతుల్లో కీలు బొమ్మలైన కాంగ్రెస్ నాయకులు తెలంగాణ సంపదను ఇప్పుడు ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. అందుకే తెలంగాణలో పైసక్కరువొచ్చింది. సుమారు పదకొండేండ్లుగా అధికారం లేక దోమలు కొట్టుకుంటున్న ఢిల్లీలోని కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ ఒక ఏటీఎంలా మారింది.కాంగ్రెస్ అంటే మొదట గుర్తుకువచ్చేది స్కీముల పేరిట చేసే స్కాములు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు ఏడాదిన్నర కావస్తున్నది. 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. వాటిని అమలుచేసేందుకు అష్టకష్టాలు, ఆపసోపాలు పడుతున్నది. ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాలు, స్కీములు అమలు చేయడానికి ఏం చేయాలో సర్కార్‌కు అంతుచిక్కడం లేదు.. సచివాలయం కింద లంకె బిందెల కోసం బుల్డోజర్లతో తవ్వుతూ వెతికిన రేవంత్ రెడ్డికి కనీసం ఖాళీ బిందైనా దొరకకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. అందుకే ఆయన ఖజానా ఖాళీ అయిందని మాటిమాటికి చెప్తూనే, సంపదను సృష్టించవచ్చనే విషయాన్ని మరిచిపోతున్నాడు.ఖాళీ ఖజానాను నింపుకొనేందుకు కాంగ్రెస్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నది. ప్రభుత్వ పెద్దల కమీషన్లు, అధికార పార్టీ నేతల అక్రమ దందాలకు తోడు రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యం, అర్థం పర్థం లేని విధానాలతో ప్రజల జేబులకు చిల్లులు పడ్డాయి. రేవంత్ రెడ్డి సర్కారు అసంబద్ధమైన చర్యలతో చేసేందుకు పనులు లేక, చేతిలో పైసలు లేక ప్రజలు అల్లాడుతున్నారు.రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకొచ్చిన హైడ్రా కారణంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం ఘోరంగా పతనమైంది. కొత్త ప్రాజెక్టుల సంగతి దేవుడెరుగు, ఉన్నవాటిని ఊడగొట్టకుంటే చాలనే పరిస్థితి వచ్చింది. మహానగరం చుట్టుపక్కల ఉన్న ప్లాట్లన్నీ ముండ్ల కంపలతో నిండిపోయాయి. కొనేవారు లేక ఫ్లాట్లు బూజు పట్టిపోతున్నాయి. రియల్ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన బిల్డర్లు, రియల్టర్లు, నిర్మాణరంగ కార్మికులు మొదలుకొని సిమెంటు, ఇసుక, ఇటుక వంటి అనేక పరిశ్రమలు కుదేలయ్యాయి. వాటిలో పనిచేసే కార్మికులు చేతిలో చిల్లిగవ్వ లేక రోడ్డున పడ్డారు.పైసలు లేక అక్కడక్కడా ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితులు దాపురిస్తున్నాయి. రియల్ రంగం ఒకటే కాదు, తెలంగాణలోని అన్ని రంగాల పరిస్థితి ఇంతే. పెట్టుబడి సాయం అందక, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుకాక, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. రైతన్నలు అప్పుల పాలవుతున్నారు. నేతన్నల సాంచల సప్పుడు ఆగిపోయి వారికి సైతం పైసక్కరువొచ్చింది. ఉచిత బస్సు కారణంగా ఆటో డ్రైవర్ల జేబులు ఖాళీ అయ్యాయి. ఆటో డ్రైవర్లు సైతం ఆత్మహత్యలకు పాల్పడటం కన్నీరు తెప్పిస్తున్నది. కనీసం ఆర్టీసీ అయినా బాగుపడిందా అంటే అదీ లేదు.మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది తప్ప, ఆదాయం ఏ మాత్రం పెరగలేదు. ఉచిత బస్సు పథకం సొమ్మును చెల్లించేందుకు ప్రభుత్వానికి చేతులు రాకపోవడంతో ఆర్టీసీకి డీజిల్‌కు కూడా పైసలు ఎల్లడం లేదు. మినీ అంగన్వాడీ టీచర్లు, హోంగార్డులు, ఎక్సైజ్ సిబ్బంది మొదలుకొని అనేక శాఖల ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు సరిగా ఇవ్వడం లేదు. దీంతో ఆయా కుటుంబాలు నెలల తరబడి పస్తులుంటున్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే రాష్ట్రంలోని ప్రజలది ఒక్కొక్కరిది ఒక్కో శర. అనేక వర్గాలు చేతిలో పైసలు లేక కొనుగోలు శక్తిని కోల్పోయి తిండికి నోచుకోవడం లేదు.కేసీఆర్ హయాంలో పదేండ్ల పాటు తెలంగాణ ఖజానా నిండుకుండలా తొణికిసలాడింది. కానీ, రేవంత్ రెడ్డి అసమర్థత కారణంగా రాష్ట్ర ఆదాయం గణనీయంగా పడిపోయింది. రిజిస్ట్రేషన్ సహా అనేక శాఖల రాబడి తగ్గిపోయింది. జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ అట్టడుగున నిలిచింది. కేసీఆర్ పాలనలో ఇతర దేశాలతో పోటీపడిన తెలంగాణ%ా% ఇప్పుడు మన దేశంలోని చిన్న చిన్న రాష్ట్రాలతో కూ డా పోటీ పడలేని దుస్థితికి చేరింది. రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న విధానాలను చూస్తుంటే తెలంగాణ ఖజానా, వ్యాపారుల గల్లా పెట్టెలు, ప్రజల చేతుల్లో పైసలు ఇక ఎప్పటికీ కనపడవేమోనని అనిపిస్తున్నది.ఖాళీ ఖజానాను నింపుకొనేందుకు కాంగ్రెస్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నది. ప్రభుత్వ పెద్దల కమీషన్లు, అధికార పార్టీ నేతల అక్రమ దందాలకు తోడు రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యం, అర్థం పర్థం లేని విధానాలతో ప్రజల జేబులకు చిల్లులు పడ్డాయి. రేవంత్ రెడ్డి సర్కారు అసంబద్ధమైన చర్యలతో చేసేందుకు పనులు లేక, చేతిలో పైసలు లేక ప్రజలు అల్లాడుతున్నారు.

## భారీగా పడిపోయిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు..! 52 వారాల కనిష్ఠానికి చేరిన షేర్ ధర..!



వరుసగా ఐదోరోజు ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయాయి. ఉదయం ట్రేడింగ్‌లో బ్యాంక్ షేర్లు 25శాతం తగ్గాయి. ప్రైవేటురంగ బ్యాంక్ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించిన నేపథ్యంలో షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మంగళవారం ఉదయం ఇండస్‌ఇండ్ షేర్లు మధ్యాహ్నం 1.45 గంటలకు రూ.226.90 తగ్గి ఒక్కో షేరు ధర రూ.673.60 చేరి.. 52 వారాల కనిష్ఠానికి చేరుకుంది. అదే సమయంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీ షేరు రూ.227.70 తగ్గి.. ఒక్కో షేరుకు రూ.673కి చేరింది. సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోకు సంబంధించిన ప్రక్రియల అంతర్గత సమీక్ష సందర్భంగా ఖాతాల బ్యాలెన్స్‌లో కొన్ని వ్యత్యాసాలను గుర్తించినట్లు ఇండస్‌ఇండ్ బ్యాంక్ పేర్కొంది. ముంబయికి చెందిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించామని అంతర్గత సమీక్షలో పేర్కొంది. దాంతో బ్యాంక్ నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం పడనున్నట్లు అంచనా వేసింది. ఇది రూ.1,530 కోట్ల నష్టానికి సమానం అన్నమాట. బ్యాంక్ ప్రకటన షేర్లపై ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే షేర్లు 25శాతం వరకు పతనమయ్యాయి. ఫలితంగా బ్యాంక్ మార్కెట్ విలువ ఏకంగా రూ.14వేల కోట్లు తగ్గింది. గతేడాది డిసెంబర్ నాటికి బ్యాంక్ నికర విలువ రూ.65,102 కోట్లుగా ఉన్నది. సెప్టెంబర్ 2023లో ఆర్‌బీఐ జారీ చేసిన సూచనల మేరకు ఈ సమీక్ష జరిగింది. ఈ విషయాన్ని ఆడిటర్ పరిశలిస్తుందని.. మార్చి 2025 నాటికి నివేదిక వస్తుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. అయితే, ప్రతికూల ప్రభావాన్ని తట్టుకోగలమని బ్యాంక్ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు సోమవారం దాదాపు నాలుగుశాతం పడిపోయాయి.

## నిస్సాన్‌కు సీఈవో మకోటో ఉచిడా రాజీనామా..! కొత్త సీఈవోగా ఆయనే..!



ప్రముఖ జపాన్ కార్ల తయారీ సంస్థ నిస్సాన్ మోటార్ కంపెనీకి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మకోటో ఉచిడా రాజీనామా చేశారు. కంపెనీ ఆర్థిక ఫలితాలు నిరాశజనకంగా ఉండడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉచిడా స్థానంలో ప్రస్తుతం కంపెనీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఇవాన్ ఎస్పినోసా కొత్త సీఈవోగా బాధ్యతలు స్వీకరిస్తారని నిస్సాన్ పేర్కొంది. ఉచిడా కంపెనీ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. నిస్సాన్ జనరల్ షేర్ హోల్డర్ల సమావేశం వరకు పదవిలో కొనసాగుతారు. గత నెలలో హోండా మోటార్ కంపెనీతో జాయింట్ హోల్డింగ్ కంపెనీని ఏర్పాటుకు సంబంధించిన చర్చలను ఉచిడా నిలిపివేశారు. ఈ నిర్ణయం తర్వాత భవిష్యత్ గురించి ఊహాగానాలున్నాయి. జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ కంపెనీలైన హోండా, నిస్సాన్ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాయి. విలీనానికి తమ వ్యాపారాలను విలీనం చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు గత ఫిబ్రవరిలో కంపెనీలు ప్రకటించాయి. విలీన చర్చలపై ఇక ముందుకు వెళ్లకూడదని బోర్డులు నిర్ణయించాయని పేర్కొన్నాయి. ఈ క్రమంలో మూడో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ ఒకటి అవతరించబోతోందన్న అంచనాలకు బ్రేక్ పడినట్లయ్యింది. ప్రపంచ వాహన మార్కెట్‌లో పెరిగిన పోటీని తట్టుకునేందుకు మూడు కంపెనీలు ఏకమవ్వాలని భావించామని.. ప్రస్తుత చర్చలు సాగుతున్న తీరు మాత్రం నిస్సాన్ సత్తాను పూర్తి స్థాయిలో రాబట్టలేదని.. నిస్సాన్‌ను హోండా అనుబంధ విభాగంగా మార్చే ప్రతిపాదనకు ఒప్పుకోమని ఉచిడా పేర్కొన్నారు. అయితే, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర పరిశోధన ప్రాజెక్టులపై రెండు కంపెనీల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిస్సాన్ 80 బిలియన్ యెన్ (సుమారు 540 మిలియన్ డాలర్లు) నష్టాన్ని అంచనా వేసింది. ఇక సీఈవో రాకతో నిస్సాన్ వ్యూహంలో మార్పులు ఉండవచ్చని.. కొత్త నాయకత్వంలో ఆర్థికంగా మెరుగైన పనితీరు కనబరుస్తుందని.. మార్కెట్‌లో తన స్థానం బలోపేతమవుతుందని కంపెనీ అంచనా వేస్తున్నది.

## ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. అమెరికాలో ఆర్థిక మాంద్యం భయాల మధ్య పెట్టుబడిదారులు భయాందోళనకు గురయ్యారు. అమెరికా మార్కెట్ల పతనం సైతం దేశీయ మార్కెట్లపై భారీ ప్రభావం పడింది. ఈ క్రమంలో మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 73,743.88 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత మార్కెట్లు కోలుకున్నాయి. ఈ క్రమంలో ఇంట్రాడేలో 74,195.17 పాయింట్లు గరిష్ఠానికి సెన్సెక్స్ పెరిగింది. చివరలో స్వల్పంగా లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. ఇంట్రాడేలో 73,663.60 కనిష్ఠానికి చేరింది. చివరకు 12.85 పాయింట్లు తగ్గి.. 74,102.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 37.60 పాయింట్ల లాభంతో 22,497.90 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,411 షేర్లు పెరగ్గా.. 2,406 షేర్లు పతనమయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం పెరిగాయి. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం తగ్గాయి. నిఫ్టీలో ట్రెంట్, సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, బీపీసీఎల్ అత్యధికంగా లాభపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్ గ్రిడ్ కార్ప్, ఎంఅండ్‌ఎం నష్టపోయాయి. రంగాల్లో మెటల్, రియాల్టీ, టెలికాం, ఆయిల్, గ్యాస్ 0.5 నుంచి 3శాతం వరకు పెరిగాయి. ఆటో, ఐటీ, బ్యాంక్ 0.3 నుంచి 0.7 శాతం వరకు పడిపోయాయి.

## 4 ట్రిలియన్ డాలర్లు ఆవిరి.. అమెరికా మార్కెట్ కుదేలు



ట్రంప్ ఇచ్చిన షాక్‌తో ఇన్వెస్టర్లు భయపడ్డారు. దీంతో వాళ్లు మార్కెట్ షేర్లను అమ్మేసుకున్నారు. సోమవారం వాల్ స్ట్రీట్‌లో సుమారు నాలుగు ట్రిలియన్ల డాలర్ల నష్టం జరిగింది. యూఎస్ స్టాక్ మార్కెట్ల నుంచి 4 ట్రిలియన్ డాలర్లు ఆవిరైపోయాయి. ట్రంప్ ఆర్థిక విధానాల వల్ల మార్కెట్లు షేక్ అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. వాల్ స్ట్రీట్‌కు చెందిన అన్ని ప్రధాన ఇండెక్స్‌లు సోమవారం ట్రేడింగ్‌లో వడిదిడుకులు ఎదుర్కొన్నాయి. డౌ, ఎస్ అండ్ పీ 500, నాక్‌డాక్ మార్కెట్లు .. తీవ్ర వత్తిడికి లోనయ్యాయి. డౌ ఇండెక్స్ ట్రేడింగ్‌లో సుమారు 890 పాయింట్లు తక్కువ వద్ద ముగిసింది. ఇక ఎస్ అండ్ పీ 500.. 2.7 శాతం తక్కువ ట్రేడ్ అయ్యింది. టెకీ కంపెనీలు ఉండే నాస్‌డాక్ 4 శాతం నష్టపోయినట్లు తెలుస్తోంది. నవంబర్‌లో దేశాధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి అమెరికా మార్కెట్లు డౌన్ అవుతూనే వస్తున్నాయి.

# షియోమీ నుంచి 15 సిరీస్ ఫోన్ల ఆవిష్కరణ.. ఇవీ ఫీచర్లు.. స్పెషిఫికేషన్లు..!

15 ఎ ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ షియోమీ తన షియోమీ 15 సిరీస్ ఫోన్లను మంగళవారం భారత్ మార్కెట్‌లో ఆవిష్కరించింది. ఇందులో షియోమీ 15, షియోమీ 15 అల్ట్రా ఫోన్లు ఉన్నాయి. ఈ రెండు ఫోన్లు స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్‌పై నడుస్తాయి. లైకా బ్యాక్డ్ రేర్ కెమెరా మాడ్యూల్స్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 32- మెగా పిక్సెల్ కెమెరాలు ఉంటాయి. ఈ ఫోన్లు హైపర్ ఓఎస్ 2.0 స్కిన్‌తో ఆండ్రాయిడ్ 15 పై పని చేస్తాయి. షియోమీ 15 అల్ట్రా ఫోన్‌ను గత ఫిబ్రవరిలో, షియోమీ 15 ప్రోతోపాటు షియోమీ 15 ఫోన్లను గత అక్టోబర్‌లో చైనా మార్కెట్‌లో ఆవిష్కరించింది. షియోమీ 15, షియోమీ 15 అల్ట్రా ధర ఇలా.. షియోమీ 15 అల్ట్రా ఫోన్ 16జీబీ ర్యామ్ విత్ 512జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.1,09,999 పలుకుతుంది. ఐసీఐసీఐ బ్యాంక్ డెబిట్ లేదా క్రెడిట్ కార్డుపై ప్రీ-బుకింగ్స్ నమోదు చేసుకున్న వారికి ఫ్రీ ఫోటోగ్రఫీ కిట్ లెజెండ్ ఎడిషన్, రూ.10 వేలు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. షియోమీ 15 అల్ట్రా ఫోటోగ్రఫీ కిట్ లెజెండ్ ఎడిషన్‌లో యూఎస్బీ టైప్-సీ కెమెరా గ్రిప్, 2000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ, డిటాచబుల్ షట్టర్ బటన్ ఉంటాయి. షియోమీ 15 ఫోన్ 12జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ. 64,999 లకు లభిస్తుంది. ఐసీఐసీఐ బ్యాంకు కార్డులపై ప్రీ-బుకింగ్ చేసుకున్న వారికి రూ.5,000 ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌తోపాటు రూ.5,999 విలువైన ఫ్రీ షియోమీ కేర్ ప్లాన్ బెనిఫిట్లు లభిస్తాయి. రెండు ఫోన్లు కూడా ఈ నెల 19 నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకూ ఫ్రీ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ నెల 11 నుంచి భారత్ మార్కెట్‌లో లభిస్తాయి. అమెజాన్, షియోమీ ఇండియా ఈ-స్టోర్, సెలెక్టెడ్ రిటైల్ స్టోర్లలో సేల్స్ ప్రారంభం అవుతాయి. షియోమీ 15 ఫోన్ బ్లాక్, గ్రీన్, వైట్ కలర్స్, షియోమీ 15 అల్ట్రా ఫోన్ సిల్వర్ క్రోమ్ కలర్ ఆప్షన్‌లో అందుబాటులో ఉంటుంది.




### షియోమీ 15 అల్ట్రా.. షియోమీ 15 ఫోన్లలో ఫీచర్లు.. స్పెషిఫికేషన్స్.. !

షియోమీ 15 అల్ట్రా ఫోన్ 6.73- అంగుళాల డబ్ల్యూక్యూహెచ్‌డీం (1,440ఐ3,200 పిక్సెల్స్) క్వాడ్ కర్వ్డ్ ఎల్టీపీఓ అమోలెడ్ స్క్రీన్ విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్ కలిగి ఉంటుంది. గరిష్ఠంగా 3200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉంటుంది. షియోమీ షీల్డ్ గ్లాస్ 2.0 ప్రొటెక్షన్‌తో వస్తోందీ ఫోన్. హెచ్‌డీఆర్10ం, డోల్బీ విజన్‌కు డిస్‌ప్లే మద్దతుగా ఉంటుంది. షియోమీ 15 ఫోన్ 6.36- అంగుళాల ఫుల్ హెచ్‌డీం (1,200 %ఇ% 2,670 పిక్సెల్స్) ఎల్టీపీఓ అమోలెడ్ డిస్‌ప్లే కలిగి ఉంటుంది. షియోమీ 15, షియోమీ 15 అల్ట్రా ఫోన్లు క్వాల్‌కామ్ ఓక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్‌లతో పని చేస్తాయి. షియోమీ 15 అల్ట్రా లైకా బ్యాక్డ్ క్వాడ్ కెమెరా యూనిట్‌తో వస్తోంది. 50-మెగా పిక్సెల్ ప్రైమరీ ఎల్‌వైటీ -900 సెన్సర్ విత్ ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్), 50-మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ కెమెరా, 50-మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్ 858 టెలిఫోటో కెమెరా విత్ ఓఐఎస్,200-మెగా పిక్సెల్ ఐసోసెల్ హెచ్‌పీ9 పెరిస్కోప్ టెలిఫోటో కెమెరా విత్ ఓఐఎస్ అండ్ అప్‌టూ 4.3ఎక్స్ ఆప్టికల్ జూమ్ ఉంటాయి. షియోమీ 15 ఫోన్ లైకా ట్యూన్డ్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంటుంది. 50- మెగా పిక్సెల్ మెయిన్ సెన్సర్ కెమెరా విత్ ఓఐఎస్ సపోర్ట్, 50-మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ షూటర్, 50-మెగా పిక్సెల్ టెలిఫోటో కెమెరా విత్ ఓఐఎస్ అండ్ అప్‌టూ 3ఎక్స్ ఆప్టికల్ జూమ్ కలిగి ఉంటాయి. రెండు ఫోన్లలోనూ సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 32- మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. షియోమీ 15 అల్ట్రా ఫోన్ 90వాట్ల వైర్డ్, 80వాట్ల వైర్‌లెస్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5,410 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. షియోమీ 15 ఫోన్ 90వాట్ల వైర్డ్, 50 వాట్ల వైర్‌లెస్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5,240 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తున్నది. సెక్యూరిటీ కోసం ఇన్-డిస్‌ప్లే అల్ట్రా సోనిక్ ఫింగర్ ప్రింట్ సెన్సర్లో వస్తున్నాయి. 5జీ, 4జీ ఎల్‌టీఈ, వై-ఫై 7, బ్లూటూత్, జీపీఎస్, ఎన్‌ఎఫ్‌సీ, యూఎస్బీ 3.2 టైప్-సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటాయి.

# రూపాయి బెంబేలు



### ఒక్కరోజే 36 పైసలు క్షీణత
### డాలర్‌తో పోల్చితే 87.31 వద్దకు

ముంబై, మార్చి 10: రూపాయికి మరిన్ని చిల్లులుపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం, టారిఫ్ అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటంతోపాటు విదేశీ పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోతుండటంతో దేశీయ కరెన్సీ విలువ సోమవారం ఒకేరోజు 36 పైసలు పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ వారం కనిష్ఠ స్థాయి 87.31కి జారుకున్నది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు పతనం చెందడంతో కరెన్సీ మార్కెట్లో సెంటిమెంట్‌ను నిరాశపరిచిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 87.24 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 87.36 కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 36 పైసలు నష్టపోయి 87.31 వద్ద స్థిరపడింది. గత నెల 25న రూపాయి ఒకేరోజు 47 పైసలు నష్టపోయిన విషయం తెలిసిందే. దీనితర్వాత ఈరోజు అత్యధికంగా పడిపోయింది. డాలర్‌తో పాటు మిగతా ఆరు కరెన్సీలు కూడా పతనం చెందాయి. గ్లోబల్ మార్కెట్లో బ్యారెల్ బ్రెంటాయిల్ స్వల్పంగా పెరిగి 70.56 డాలర్లు పలుకగా, సెన్సెక్స్ 217.41 పాయింట్లు కోల్పోయింది. దీంతో ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు(ఎఫ్‌ఐఐ)లు రూ.485.41 కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు.

### మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఇండస్ట్రియల్స్, చమురు అండ్ గ్యాస్ రంగ షేర్లలో చివరి గంటలో భారీగా అమ్మకాలు చోటు చేసుకోవడం సూచీలు నష్టాల్లోకి జారుకోవడానికి ప్రధాన కారణం. వరుసగా ఎనిమిది సెషన్లుగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ సోమవారం 217.41 పాయింట్లు పతనం చెంది 74,115.17 వద్ద స్థిరపడింది. ప్రారంభంలో 74,741 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సూచీ ఇంట్రాడేలో 74,022.24 పాయింట్లకు పడిపోయింది. మరో సూచీ నిఫ్టీ సైతం 92.20 పాయింట్లు కోల్పోయి 22,460.30 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరులు రూ.4 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. బీఎస్‌ఈలో లిట్కస్టెన సంస్థల మార్కెట్ విలువ రూ.4,43,269.25 కోట్లు కరిగిపోయి రూ.3,93,85,818.73 కోట్లు(4.51 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది.

# గోల్డ్ రష్‌కు కారణాలివే..

### ట్రంప్ సుంకాలతోనూ బంగారం ధరలు పైపైకి

ఈ ఏడాదీ మదుపరులకు హాట్ ఫేవరేట్ బంగారమే. ముఖ్యంగా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు.. తమకు వాటిల్లే నష్టాల నుంచి రక్షణగా పుత్తడినే ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే గడిచిన 12 నెలల్లో పసిడి ధర 40 శాతానికిపైగా ఎగబాకింది. అయితే ఇదొక్కటే గోల్డ్ రేట్లను పరుగులు పెట్టిస్తున్న కారణమా? అంటే కాదనే చెప్పాల్సి వస్తున్నది. ఈ గోల్డ్ రన్ వెనుక ఒక్క కారణమే ఉందంటే ఎంతమాత్రం సరికాదు మరి. అయితే ఇంకేంటి? బంగారం ధరలు రికార్డుల్లో పరుగులు పెట్టడానికి ప్రధాన కారణాలను విశ్లేషిస్తే..

### అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్

జూన్ 2022లో అమెరికా ద్రవ్యోల్బణం 9.1 శాతం గరిష్ఠాన్ని తాకింది. నిజానికి ఆ ఏడాది మార్చి నుంచే ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్.. ధరల అదుపునకు వడ్డీరేట్లను పెంచ డం మొదలుపెట్టింది. అయినప్పటికీ ఫలితం శూన్యం. దీంతో జూలై 2023దాకా రేట్లను ఫెడ్ రిజర్వ్ పెంచుతూనే పోయింది. ఆ తర్వాత కూడా సెప్టెంబర్ 2024 వరకు వడ్డీరేట్లను తగ్గించకుండా గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచింది. భారత్‌లోనూ ఆర్బీఐ ఇదే రకమైన ద్రవ్య విధానాన్ని అవలంభించిన విషయం తెలిసిందే. అయితే ఇన్వెస్టర్లు డాలర్ కంటే గోల్డ్ సురక్షితమని భావించి పెద్ద ఎత్తున కొనడం మొదలు పెట్టారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఫిబ్రవరి 2024 నుంచి పసిడి ధరలు పెరగడం మొదలైంది. కానీ గతకొద్ది నెలలుగా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గిస్తూ వస్తున్నది. ఇప్పటికే 100 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. అయితే ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగానే ఉండటంతో చివరి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచింది. ఈ పరిణామం గ్లోబల్ మార్కెట్‌లో ధరలను అధిక స్థాయిల వద్దే ఉంచేలా చేస్తున్నది.

### సెంట్రల్ బ్యాంకులు

ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని భారీగా కొని నిల్వ చేసుకుంటున్నాయి. దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇవి చక్కగా ఉపయోగపడుతాయని రిజర్వ్ బ్యాంకులు గట్టిగా విశ్వసిస్తున్నాయి. ఈ క్రమంలోనే భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడు డిమాండ్ మరింత పెరుగుతున్నది. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పుడు, ఆ తర్వాత చైనా-తైవాన్ మధ్య సంఘర్షణలు తలెత్తినప్పుడు, ఇజ్రాయెల్-హమాస్ దాడులు జరిగినప్పుడు పసిడి కొనుగోళ్లను సెంట్రల్ బ్యాంకులు పెంచుతూపోయాయి. భారత్, చైనా ఈ విషయంలో ముందుంటున్నాయి.



### స్వదేశంలోకి తరలింపులు

సెంట్రల్ బ్యాంకులు కేవలం బంగారాన్ని కొనడమే కాదు.. ఇన్నాళ్లూ విదేశాల్లో దాచిపెట్టిన పసిడి నిల్వలను తమ దేశంలోకి తీసుకొచ్చుకుంటున్నాయి. భారత్, అమెరికాసహా పలు దేశాల రిజర్వ్ బ్యాంకులు, ఇన్వెస్టర్లు, ట్రేడర్లు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వాల్ట్‌ల్లో బంగారాన్ని దాచిపెడుతున్నాయి. అయితే గత ఏడాది నుంచి ఈ పుత్తడి నిల్వలను తమతమ దేశాల్లోకి అంతా తీసుకెళ్తున్నారు. తమ సొంత వాల్ట్‌ల్లో భద్రపర్చుకుంటున్నాయి. దీనికి అసలు కారణం తెలియకపోయినా.. ట్రంప్ టారిఫ్‌లు లేదా ఇతర సుంకాల నేపథ్యంలో ముప్పు పొంచి ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రష్యన్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ హోల్డింగ్స్‌ల్లో దాదాపు 300 బిలియన్ డాలర్లను అమెరికా, దాని మిత్ర దేశాలు బ్లాక్ చేశాయి. దీంతో మన సొమ్ము మన దగ్గరే ఉంటే ఉత్తమమన్న ఆలోచనకు అన్ని దేశాలూ వస్తున్నాయి. ఇక అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత న్యూయార్క్ కొమెక్స్ ఎక్స్ఛేంజ్‌కు గోల్డ్ షిప్‌మెంట్స్ దాదాపు 75 శాతం పెరగడం గమనార్హం. బ్రిటన్ వాల్ట్‌ల్లో నుంచి బంగారాన్ని వెనక్కి తీసుకుంటుండటంతో భౌతిక బంగారానికి అక్కడ డిమాండ్ ఒక్కసారిగా పెరుగుతున్నది. గ్లోబల్ మార్కెట్‌లో ధరల పెరుగుదలకూ ఇది కూడా కారణమే.

### మార్కెట్ డిమాండ్

బహిరంగ మార్కెట్ల నుంచి పుత్తడికి డిమాండ్ పెరుగుతుండటం కూడా ధరలను ఎగదోస్తున్నది. జ్యుయెల్లర్స్, ఇండస్ట్రీ, ఇన్వెస్టర్లు, సెంట్రల్ బ్యాంకులు, రిటైల్ కస్టమర్ల నుంచి బంగారానికి ఆదరణ పెరుగుతూపోతున్నది. గత ఏడాది రికార్డు స్థాయిలో 4,974 టన్నుల గోల్డ్ డిమాండ్ నమోదైంది. దీని విలువ మునుపెన్నడూ లేనివిధంగా 382 బిలియన్ డాలర్లను తాకింది.

### వాణిజ్య యుద్ధం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ప్రతీకార సుంకాలకు దిగుతుండటంతో ట్రేడ్‌వార్ భయాలు చుట్టుముడుతున్నాయి. మెక్సి కో, కెనడాలతోపాటు చైనా, భారత్ మరికొన్ని దేశాలపై పెద్ద ఎత్తున సుంకాలను పెంచుతామని హెచ్చరిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఇప్పటికే కొన్ని దేశాలపై అమలు చేస్తుండగా, మరికొన్నింటిపై వచ్చే నెల నుంచి మొదలు కానున్నాయి. ఇది స్టాక్ మార్కెట్లను కూలదోస్తున్నది. ఫలితంగా ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం వైపునకు మళ్లిస్తున్నారు. ఇదొక్కసారిగా డిమాండ్‌ను పెంచుతున్నది. గత ఏడాది భారతీయ మార్కెట్‌లో తొలిసారి తులం 24 క్యారెట్ బంగారం గరిష్ఠంగా రూ.89,450 పలికిన సంగతి విదితమే. గ్లోబల్ మార్కెట్‌లోనూ ఔన్స్ 2,950 డాలర్ల దరిదాపుల్లోకి వెళ్లింది.

**ఏటా సగటున 3వేల టన్నుల బంగారాన్ని తవ్వి తీస్తున్నారు.**

**2022 నుంచి 2024 మధ్య 3,299 టన్నుల పుత్తడిని సెంట్రల్ బ్యాంకులు కొన్నాయి.**

**గత ఏడాది పోలాండ్ (89.54 టన్నులు) తర్వాత అత్యధికంగా పసిడి నిల్వల్ని పెంచుకున్నది భారత్ (72.60 టన్నులు).**

**నిరుడు సెప్టెంబర్ ఆఖరునాటికి ఆర్బీఐ వద్ద 854 టన్నుల బంగారం నిల్వలు.**

**2024 మే, అక్టోబర్ నెలల్లో బ్రిటన్‌లో దాచిన 200 టన్నుల బంగారాన్ని తిరిగి తెచ్చుకున్న ఆర్బీఐ.**

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332